తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

21-3-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 48 పేజీలు: 10+4 వెల: 6.50







న్యూఢిల్లీలో గురువారం ప్రధాని మోడీతో భేటీ అయిన లోక్‌సభ మాజీ స్పీకర్ శివరాజ్ పాటిల్, బిజెపి నాయకురాలు అర్చన పాటిల్ తదితరులు

# చిరంజీవికి బ్రిటన్ అవార్డు

>> తెలిపారు. ఈ పురస్కారం నటుడుగా తనపై మరింత స్ఫూర్తిదాయక బాధ్యతలు పెంచిందన్నారు. మాటలకందని సంతోషం నెలకొందనిచెప్పిన చిరంజీవి తన పురస్కార ప్రధానానికి సంబంధించిన చిత్రాలన కూడా ఇన్‌స్టాలో పోస్టుచేసారు. అంతేకాకుండా మొట్టమొదటి భారతీయుడుగా విదేశాల్లో ప్రతిష్టాత్మకఅ వార్డు సాధించిన నటుడుగా కూడా రికార్డుసాధించారు. లండన్‌లోని యుకె పార్లమెంట్‌లో ఈనెల 19న ఒకప్రత్యేక కార్యక్రమంలో అవార్డును బహూకరించారు. చిరంజీవిసోదరుడు ఎపి డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ తన సోదరునికి అభినందనలు తెలిపారు. పవన్‌కల్యాణ్‌కూడా తన అన్న అవార్డు స్వీకరణ చిత్రాలను పోస్టుచేసారు. చిరంజీవిని తాను అన్నగా కాకుండా ఒక తండ్రిగా భావిస్తానని పేర్కొన్నారు. తన జీవితంలో హీరో తనకు తన అన్న చిరంజీవేనని పవన్‌పోస్టుచేసారు. హౌస్‌ఆఫ్ కామన్స్‌లో జరిగిన ఈ అవార్డు ప్రధాన వేడుకలో ప్రముఖులు ఎంపిలు మంత్రులు అందరూ పాల్గొన్నారు. వీరిలో నవేంద్రమిశ్రా, సోజన్‌జోసెఫ్, బాబ్‌బ్లాక్‌మాన్‌వంటి ప్రముఖులుకూడా ఉన్నారు.

# 2026 మార్చికి దేశం నక్సల్ రహితం

## తాజా ఎన్‌కౌంటర్లపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

**న్యూఢిల్లీ, మార్చి 20:** ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన కాల్పుల్లో 30 మంది మావోయిస్టులు మృతి చెందిన ఘటనపై కేంద్ర మంత్రి అమిత్ షా స్పందించారు. భారత్‌ను నక్సల్‌రహిత దేశంగా మార్చేందుకు చేపట్టిన ఆపరేషన్‌లో ఇది మరో విజయమని అన్నారు. ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నక్సలైట్ల పట్ల కఠిన వైఖరి అవలంభిస్తోందని పేర్కొన్నారు. అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పిస్తున్నా కొందరు నక్సలైట్లు లొంగిపోవడంలేదు. అలాంటి వారి పట్ల మోడీ సర్కార్ కఠిన వైఖరి అవలంభిస్తోంది. మన సైనికులు నక్సల్ ముక్త్ భారత్ అభియాన్ దిశలో మరో పెద్ద విజయాన్ని సాధించారు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, కాంకెర్‌లలో మన భద్రతా దళాలు నిర్వహించిన రెండు వేర్వేరు ఆపరేషన్లలో 22 మంది నక్సలైట్లు హతమయ్యారు. 2026 మార్చి 31 నాటికి దేశం మావోయిస్టు రహితంగా మారుతుంది అని అమిత్ షా పేర్కొన్నారు. కాగా ఒకేరోజు బీజాపూర్, కాంకెర్ జిల్లాల్లో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లు జరిగాయి.

# రోజులు దగ్గరపడ్డాయి..

>> నొక్కాలని ప్రయత్నిస్తే సహించేది లేదని మాజీ మంత్రి, శాసనసభ్యులు, రాష్ట్ర భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందంటే అందుకు కారణం కేసీఆర్ అన్నారు. కెసిఆర్ ఉద్యమం చేపట్టకపోతే తెలంగాణ ప్రజలను ఐక్యం చేయకపోతే శూన్యం నుంచి సునామిని సృష్టించిన నాయకుడు కేసీఆర్ అని అన్నారు. కెసిఆర్ ని విమర్శించే నైతిక అర్హత కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. కాంగ్రెస్, బిజెపి రెండు ఒకటేనని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బిజెపి వెనకేసుకొస్తుందని అవినీతి చేసిన పట్టనట్లుగా వ్యవహారిస్తుందని విమర్శించారు. బడాబాయ్, చోటా భాయిగా వర్ణించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును గడగడలాడించిన నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. చిన్న వయసులో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డి ది వికృతమైన మనస్తత్వమని పేర్కొన్నారు. పర్సనాలిటీ పెంచుకుంటున్నారని అనుకున్నానే తప్ప పర్సంటేజీలు పెంచుతారని ఊహించలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ ఆనవాళ్లు చెరపలేరు అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా పోరాటాల కిల్లాగా పేర్కొని తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం జరిగిన జిల్లా సూర్యాపేట అన్నారు. పోరాటాల చరిత్ర కలిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లా లో తిరిగి పార్టీ ఆదిపత్యం కొనసాగుతుందని ప్రజలంతా భారత రాష్ట్ర సమితి నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. ప్రాజెక్టుల కింద వరి పంటలు ఎండిపోతే ప్రభుత్వం బాధ్యత అని మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి పేర్కొనటం విడ్డూరంగా ఉందన్నారు. వ్యవసాయ బావులు బోర్ల కింద పంటలు ఎండిపోతే ప్రభుత్వానికి బాధ్యత ఉండదని పేర్కొనటం బాధ్యత రాహిత్యానికి నిదర్శనం అన్నారు. పంటలు ఎండిపోతుంటే పట్టించుకోని ప్రభుత్వం నీటిని పొదుపు చేసుకునే ఆలోచన లేని విధానాలతో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఈ వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారంపై ప్రభుత్వము దృష్టి సారించాలన్నారు. ఎండుతున్న పంటలను కాపాడే ప్రయత్నం చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. న్నో అభివృద్ధి పనులు చేపడితే విస్మరించి విమర్శలు చేయటము అధికార పార్టీకి తగదు అన్నారు. సూర్యాపేటకు వచ్చిన కేటీఆర్ కు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. నినాదాలు చేశారు. భారీ ఎత్తున కార్యకర్తలను తరలించారు. కేటీఆర్‌రాక పార్టీశ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో సూర్యపేట ఎమ్మెల్యే గుంటకల్ జగదీశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్ కుమార్ బొల్ల మల్లయ్య యాదవ్ కంచర్ల భూపాల్ రెడ్డి నోముల భగత్, బడుగుల లింగయ్య యాదవ్ నరసింహారెడ్డి గుజ్జా దీపిక యుగంధర్ పెరుమళ్ళ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీలో రూ.2,000 కోట్లతో తైవాన్ పారిశ్రామిక పార్క్ ఏర్పాటు

**హైదరాబాద్, మార్చి 20 ప్రభాతవార్త:** తైవాన్‌కు చెందిన అగ్రశ్రేణి పారిశ్రామికవేత్తల సమూహం(ఎలీజియన్స్ గ్రూప్) హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో రూ.2,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. ఫ్యూచర్‌సిటీలో మొట్టమొదటి ప్రపంచస్థాయి సాంకేతిక, పారిశ్రామిక పార్క్ (ఐటిఐపి)ను అభివృద్ధి చేయడానికి ముందుకొచ్చింది. ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు నిర్ధిష్ట కార్యాచరణతో రాష్ట్ర ప్రతినిధి బృందం ప్రస్తుతం తైవాన్ రాజధాని తైపీలో పర్యటిస్తోంది. తైవాన్‌భారత ఆర్థిక సంబంధాల పురోగతి కార్యక్రమంలో భాగంగా గురువారం 11 సంస్థలు ఈ పార్కులో పెట్టుబడులు (ఎఫ్‌డిఐ) పెట్టడానికి అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఐటిఐపికి రాష్ట్ర ప్రభుత్వం కొంగరకలాన్‌లోని ఎలక్ట్రానిక్స్ పార్కులో ఇప్పటికే 15 ఎకరాల భూమిని అందజేసింది. పూర్తి స్థాయిలో పరిశ్రమల ఏర్పాటుకు మరో 250 ఎకరాలను కేటాయించాలని తైవాన్ కంపెనీలు అభ్యర్థించాయి. భూ కేటాయింపులు పూర్తయిన వెంటనే పారిశ్రామికవాడ అభివృద్ధి పనులు మొదలు పెడతామని తైవాన్ ప్రతినిధులు స్పష్టం చేసారు. రానున్న 3 సంవత్సరాల్లో మొదటి దశలో రూ.2,000 కోట్ల పెట్టుబడితో పరిశ్రమల నిర్మాణం పూర్తయి, ఉత్పాదన ప్రారంభమవుతుంది. దీనివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉద్యోగాలు దొరుకుతాయి. ఈ టెక్నాలజీ, ఇండస్ట్రియల్ పార్కులో ఎలక్ట్రానిక్స్, సౌర పలకల పరిశ్రమల లాంటి ఉన్నత స్థాయి సాంకేతిక ఉత్పత్తులు తయారవుతాయి. దేశీయ అవసరాలతో పాటు భారీ పరిమాణంలో ఎగుమతులు జరుగుతాయి. ఇక్కడ ఏర్పాటయ్యే పరిశ్రమలకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా నిపుణులను అందుబాటులో ఉంచుతామన్న మంత్రి శ్రీధర్ బాబు సందేశాన్ని రాష్ట్ర ఎలక్ట్రానిక్స్ విభాగం డైరెక్టర్ వింగ్ కమాండర్ డా. సూర్యకాంత్ శర్మ తైవాన్ ప్రతినిధులకు వివరించారు. తెలంగాణాలో ప్రతిభావంతులైన మానవ వనరుల లభ్యతతో అత్యంత అనుకూల పారిశ్రామిక వాతావారణం (ఇకో సిస్టం) ఉందని ప్రతినిధుల గ్రూప్ ఛైర్మన్ సైమోన్‌లీ ఈ సందర్భంగా అన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసే పరిశ్రమల నిర్మాణం, నిర్వహణలో పాలుపంచుకునే తైవాన్ నిపుణుల కోసం అక్కడి సంస్కృతి ఉట్టిపడేలా ఫర్మోసా టౌన్ పేరుతో ఒక కమ్యూనిటీ నిర్మాణాన్ని చేపట్టనున్నట్టు ఆయన వెల్లడించారు.

# 3 రోజులు వర్షాలు

>> ఇలాంటి సమయంలో హైదరాబాద్ వాతావరణ శాఖ తెలంగాణ ప్రజలకు చల్లని కబురు చెప్పింది. ఎండల నుంచి ఉపశమనం కలిగేలా వెదర్ అప్డేట్ ఇచ్చింది. రాష్ట్రంలో ఈనెల 21 నుంచి వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఈనెల 21 నుంచి 25 వరకు రాష్ట్రంలో పలు చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే ఛాన్స్ ఉందని చెప్పారు. అయితే ఎలాంటి హెచ్చరికలు జారీ చేయలేదు. రాబోయే మూడ్రోజులు రాష్ట్రంలో అక్కడక్కడా.. ఉదయం సమయంలో పొగమంచు ఏర్పడే ఛాన్స్ ఉందని తెలిపారు. రాబోయే రెండ్రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండదని చెప్పారు. ఆ తర్వాత ఉష్ణోగ్రతల్లో స్వల్ప తగ్గుదల ఉంటుందని అన్నారు. మొత్తానికి భానుడి భగభగలతో అల్లాడుతున్న తెలంగాణ ప్రజలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఉపశమనం కలిగించే వార్త చెప్పినట్లయింది. ఈనెల 21 నుంచి వర్షాలు కురుస్తాయని చెప్పటంతో ప్రజలు కూడా రిలీఫ్‌గా ఫీలవుతున్నారు. హాట్ సమ్మర్‌లో కాస్త కూల్ వెదర్ రానుండటం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఈనెల 25 తర్వాత ఎండల తీవ్రత పెరగనున్న నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల మధ్య బయటకు వెళ్లకపోవటమే మంచిదని చెబుతున్నారు. తలపై టోపీ లేదా గొడుగు, కాటన్ దుస్తులు ధరించాలని.. తేలికపాటి ఫుడ్ తీసుకోవాలని సూచిస్తున్నారు. ఎక్కువగా నీళ్లు తాగటంతో పాటుగా.. శరీరం డీహైడ్రేట్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు.

# టెన్త్ పరీక్షలు

>> పరీక్షలు కొనసాగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 10వ తరగతి పరీక్షల కోసం 2650 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణ కోసం 2650 మంది సీఎస్, డీవోలతోపాటు.. 28,100 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. రాష్ట్రంలోని 11,547 ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు స్కూల్స్ నుంచి 5,09,403 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. వారిలో 2,58,895 మంది బాలురు ఉండగా.. 2,50,508 మంది బాలికలున్నారు. పరీక్షలకి సంబంధించిన హాల్ టికెట్లను ఇప్పటికే పాఠశాలలకు పంపించారు. అలాగే ఎస్ఎస్‌సి బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లోనూ పొందుపర్చినట్టు అధికారులు తెలిపారు.

## వారం - వర్జ్యం

తేది : 21-03-2025, శుక్రవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
సప్తమి తె.4.25
జ్యేష్ఠ రా.1.45
వర్జ్యం తె.5.38-7.23
దు.ఉ.8.45-9.33, 2) మ.12.47-1.35
శుభసమయం : ఉ.5.00-6.00,
సా.7.00-8.00
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** సోదరులతో అకారణంగా విరోధాలు ఏర్పడుతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే.

**వృషభం:** రుణబాధలు ఎదురై చికాకులు పెట్టిన నిదానంగా ముందుకు సాగుతారు. వస్తువుల కొనుగోలు.

**మిథునం:** విలువైన వస్తువులు, ఆభరణాలు, వాహనాలు కొనుగోలు చేస్తారు. శుభవార్తలు.

**కర్కాటకం:** నూతన ప్రయత్నాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. సన్నిహితుల సాయం అందుతుంది.

**సింహం:** దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు. ప్రయాణాలలో నూతన పరిచయాలు.

**కన్య :** పాతమిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు. వస్తు, వస్త్రా లాభాలు పొందుతారు.

**తుల :** వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమయై ఊరట చెందుతారు.

**వృశ్చికం:** దూరప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. కొత్తమిత్రులతో పరిచయాలు.

**ధనుస్సు:** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. నూతన వస్తు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**మకరం:** అనుకున్న పనులలో ఆటంకాలు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు. వివాదాలకు దూరంగా వుండండి.

**కుంభం:** కీలక నిర్ణయాలలో జాప్యం జరిగినా నిదానంగా తీసుకుంటారు. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం.

**మీనం :** దూరప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. కాంట్రాక్టులు లాభిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కొలువుల పండుగ

>> మందిరంలో గురువారం సాయంత్రం తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మంచినీటి సరఫరా, స్త్రీ శిశుసంక్షేమశాఖల మంత్రి ధనసరి అనుసూయ సీతక్క సభాధ్యక్షతన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ, పురపాలకశాఖలలో ఉద్యోగ, కారుణ్య నియామకపత్రాల అందజేత, బిల్డ్‌నౌ పోర్టల్ ఆవిష్కరణ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జ్యోతిప్రకాసనంచేసి ప్రసంగించారు. దశాబ్దకాల నిరీక్షణకు తెరపడుతూ మీ కల నేడు నిజం కాబోతుందన్నారు. ఈ నియామకాలు మీ హక్కు, చట్టబద్ధమైందని, ఇవాళ నియామకపత్రాలు అందుకోబోతున్న 922మందికి, వారి కుటుంబసభ్యులకు అభినందనలు తెలిపారు. గత పాలకులు పదేళ్లుగా ఈ నియామకాలను పట్టించుకోలేదంటే వారి నిర్లక్ష్యం తేటతెల్లమౌతుందన్నారు. తెలంగాణ రాష్ట్రమేర్పడితే తమ జీవితాలు బాగుపడుతాయని నిరుద్యోగ యువత పోరాడిందని, రాష్ట్రమేర్పడినా వీరితోపాటు అమరుల ఆశయాలు నెరవేరలేదు. మేము అధికారంలోకి రాగానే ప్రజాప్రభుత్వంలో 57,924 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీచేశాం. తాము నోటిఫికేషన్లు వేశామని, మేము చేసింది ఏమీలేదని బిఆర్ఎస్ వాళ్లు మాట్లాడుతున్నారు. పదేళ్లు పరీక్షలు నిర్వహించపోతే నిరుద్యోగుల దుస్థితి కనిపించలేదా? మీ ఇంటి బిడ్డలకు పదవిపోతే ఇంకో పదవి ఇచ్చుకున్నమీకు తెలంగాణలో ఈ పేదింటి బిడ్డల బాధ కనిపించలేదానని నిలదీశారు. మేము 10నెలల్లో చేసింది మీరు పదేళ్లలో చేయలేకపోయింది పోగా మేము చేసే ప్రజోపయోగ పనులన్నింటికీ మా కాళ్లల్లో కట్టెలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో భవన నిర్మాణ అనుమతుల్లో అక్రమాలు అరికట్టి పారదర్శకతకు పీటవేస్తూ బిల్డ్‌నౌ పోర్టల్‌ను తీసుకొచ్చామని, ఎంతటివారైనా ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రజలకు పారదర్శక పరిపాలనే మా ధ్యేయం.... అదే గుడ్ గవర్నెన్స్.. ఇది తెలంగాణ మోడల్ అని స్పష్టం చేశారు. అయితే ఈమధ్య ప్రజలకు నామీద వ్యతిరేకత వచ్చింది.. కోపంగా ఉన్నారని దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఆడబిడ్డలకు బస్సు ఫ్రీ ఇచ్చినందుకు కోపంగా ఉన్నారా? 21వేల కోట్లు రుణాలు మాఫీ చేసినందుకా? అదానీ, అంబానీలతో పోటీపడేలా ఆడబిడ్డలకు సోలార్ ఉత్పత్తిచేసే అవకాశం కల్పించినందాకా? పేదలకు 200యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నందుకా? ఎందుకు మాపై కోపంగా ఉంటారని ప్రశ్నించారు. సోషల్ మీడియాల్లో రేవంత్‌రెడ్డికి పట్టురాలేదు అంటున్నారు.. రాజయ్య, ఈటల వంటి బలహీనవర్గాలను సస్పెండ్ చేస్తేనే, ధర్నాలు చేయనివ్వకపోతే పట్టువచ్చినట్లా.... పోలీసులకు నేను ఆదేశాలిస్తే కెటిఆర్‌ను దంచరా? సచివాలయానికేరాని ఆయనకు పరిపాలనమీద పట్టుందట.. 18గంటలు పనిచేసే మాకు లేదట.. తాజాగా కాంట్రాక్టర్లు సచివాలయానికి వచ్చి ధర్నాచేశారు.. అది మేమిచ్చిన స్వేచ్ఛ అన్నారు. మేము గడీల్లో పెరగకపోయినా నల్లమల అడవుల్లో పేదను చూస్తూ పెరిగాం.... మీకులేని మానవత్వం మాకు ఉంది. మాకు విజ్ఞత ఉంది.... అదిలేకే ఫామ్‌హౌస్ నుండి బయటకు రాలేకపోతున్నారని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మిస్ యూనివర్స్ పోటీలపై కొందరు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు.. కానీ ఇది పర్యాటకరంగానికి అద్భుత అవకాశం, వివిధ దేశాల ప్రతినిధులు వస్తున్నారని, ఈ 72వ మిస్ యూనివర్స్ పోటీలతో ప్రపంచం తెలంగాణ వైపు చూడబోతోందని, వందల కోట్ల ఆదాయం రాబోతుందన్నారు. ఫార్ములా ఈ-రేస్ ముసుగులో ప్రభుత్వ సొమ్ము దోచుకున్న మీకు మాకు పోలికా.... పట్టింపు లేకుండా వ్యవహరించడం మీ విధానమైతే పట్టుదలతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్న సంకల్పం మాదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి శాంతికుమారి, నగర మేయర్ విజయలక్ష్మి, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్, కార్పొరేటర్ విజయారెడ్డి, సముద్రాల వేణుగోపాలాచారి, పలువురు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మిస్ వరల్డ్ పోటీలు తెలంగాణకు గర్వకారణం

## అందాల పోటీలను మహిళా సాధికారతకు ప్రతీకగా చూడాలి: మంత్రి జూపల్లి

**హైదరాబాద్, మార్చి 20 ,ప్రభాతవార్త:** మిస్ వరల్డ్ పోటీలకు అతిథ్యమివ్వడం తెలంగాణకు గర్వకారణంతెలంగాణ సంస్కృతిని పరిచయం చేసే సువర్ణావకాశంఅందాల పోటీలను మహిళా సాధికారతకు ప్రతీకగా చూడాలిరాజకీయ కోణంలో మిస్ వరల్డ్ పోటీలను చూడటం సరికాదని మిస్ వరల్డ్ ప్రి ఈవెంట్ లో మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 72వ మిస్ వరల్డ్ పోటీలకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వడం ఆనందంగా ఉందని, ఫ్యూచర్ సిటిగా ఎదుగుతున్న విశ్వనగరం హైదరాబాద్.. ఈ ఈవెంట్ కు వేదికగా నిలవడం గర్వంగా ఉందన్నారు. గురురవారం బేగంపేట్ టూరిజం ప్లాజాలో మిస్ వరల్డ్ పోటీలకు చెందిన ప్రీ ఈవెంట్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాలకు తెలంగాణ నెలవని, ప్రపంచానికి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారం, పర్యటక అందాలను తెలియజేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ చరిత్రాత్మకమని, వేలాది ఏళ్ల చరిత్ర ఉన్న కొత్త రాష్ట్రంలో కొత్త కార్యక్రమం జరుగుతోందని, మహిళల ఆత్మ సౌందర్యాన్ని సెలబ్రేట్ చేయడం మిస్ వరల్డ్ పోటీల ఉద్దేశమని, సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర గొప్పదని వెల్లడించారు. దక్షిణ కొరియాలో స్విడ్ గేమ్, బీటీఎస్ బ్యాండ్ లాంటివి ఆ దేశానికి ఎంతో ఉపయోగపడ్డాయని, ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణకు పేరు ప్రఖ్యాతులతో పాటు ఆర్థికంగానూ వృద్ధి సాధిస్తుందని భావిస్తున్నామన్నారు. అందాల పోటీలను మహిళా సాధికారతకు ప్రతీకగా చూడాలే కాని, ప్రభుత్వంపై విమర్శలకు, రాజకీయ కోణంలోనే మిస్ వరల్డ్ పోటీలను చూడటం సరికాదని హితవు పలికారు. మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ సాధారణంగా ఆతిధ్య రాష్ట్రంతో 5050 భాగస్వామ్య నమూనాను అనుసరిస్తుందని, ఈ పోటీలకు రూ. 55 కోట్లు అంచనా వ్యయం కాగా రూ. 27 కోట్ల రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంది, మిగిలిన సగం నిధులను నిర్వాహకులు సమకూరుస్తా రన్నారు. ఈ ఈవెంట్ లో స్పాన్సర్స్ ను భాగస్వాములు చేస్తున్నందు వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం పడదని, పర్యాటక అభివృద్ధి సంస్థ రూ. 5 కోట్లు మాత్రమే వెచ్చిస్తుందని, మిగితా నిధులు స్పానర్స్ నుంచి సమకూరుతాయన్నారు. మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ వల్ల తెలంగాణలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు పెట్టుబడులను ఆకర్షించవచ్చని తెలిపారు. సుమారు 140 దేశాల వారు ఇక్కడికి వస్తారని ప్రపంచం దృష్టి తెలంగాణ రాష్ట్రంపై పడుతుందని వివరించారు. అందాల పోటీలు అంటే ఇంకో కోణంలో చూడొద్దని ఇది ఎంతో మంది అమ్మాయిలకు, మహిళలకు, మనోధైర్యం, సంకల్పం ఇస్తుందని మంత్రి జూపల్లి పేర్కొన్నారు.



బీజాపూర్ దంతెవాడ జిల్లా సరిహద్దులో ఎన్‌కౌంటర్ జరిగిన అండ్రి అటవి ప్రాంతం

# నెత్తురోడిన దండకారణ్యం

>> పరిధిలోని అండ్రి అటవి ప్రాంతంలో గురువారం మావోయిస్టులకు భద్రతా బలగాలకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఎదురుకాల్పుల్లో 26 మంది మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో అగ్రనాయకులు ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. భారీ నగదు స్వాధీనం చేసుకున్నామని ఏకే 47 రైఫిల్ ఇన్సాస్ ఎస్ఎల్ ఆర్ తోపాటు సెమీ ఆటోమిటిక్ వెపన్స్ మందుగుండి సామాగ్రిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు.

కాంకేర్ నారాయణ్ పూర్ జిల్లాల సరిహద్దులో జరిగిన మారో ఎన్ కౌంటర్ నలుగురు మావోయిస్టులు మృతిచెందారని సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతుందని తెలిపారు. ఎన్ కౌంటర్లు...లొంగుబాట్లుదండకారణ్యంలో వరుస ఎన్ కౌంటర్లు జరుగుతున్నాయి. గత ఏడాది (2024)లో 934 మంది మృతిచెందగా 1045 మందిని అరెస్టు చెయ్యాగా అనేక మంది లొంగిపోయారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 105 మంది ఎన్ కౌంటర్లలో మృతి చెందగా పదుల సంఖ్యలో లొంగుబాట్లు జరుగుతున్నాయి. ఆకురాలే కాలం కావడంతో అడవిలో నక్సల్స్ మరింత గడ్డు పరిస్థితులు ఎదురుకానున్నాయి.

# పోలీసులు ఉక్కుపాదం

>> నమోదు చేశారు. కేసు నమోదైన వారందరికి నోటీసులు జారీ చేశారు. కేసు నమోదైన వారిలో సినీ నటులు రానా దగ్గుబాటి, విజయ్ దేవరకొండ, ప్రకాశ్‌రాజ్, మంచు లక్ష్మి, ప్రణీత, నిధి అగర్వాల్, అనన్య నాగేళ్ల, సిరి హనుమంతు, శ్రీముఖిలతో పాటు వర్షిణి సౌందరరాజన్, వసంతి క్రిష్ణన్, శోభా శెట్టి, అమృత చౌదరి, నయని పావనీ, నేహా పఠాన్, పండు, పద్మావతి, ఇమ్రాన్‌ఖాన్, విష్ణుప్రియ, హర్షసాయి, భయ్యా సన్నీ యాదవ్, శ్యామల, టేస్టీ తేజ, రీతు చౌదరి, బండారు సుప్రీతలు ఉన్నారు. వీరు జంగిల్‌రమ్మీ.కామ్, ఏ23, యోలో247.కామ్, ఫేయిర్‌ప్లే.లైవ్, జీత్‌విన్, తాజ్77, ధనీబుక్365, మామా247.కో, తెలుగు365.ఇన్ వంటి బెట్టింగ్, గ్యాంబ్లింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్నట్లుగా తెలిపారు.

**అనుమతి ఉన్న గేమ్స్‌కే ప్రచారం : విజయ్ దేవరకొండ టీమ్**

కాగా బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్‌పై మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కావడంతో నటుడు విజయ్ దేవరకొండ టీమ్ వివరణ ఇచ్చింది. చట్టప్రకారం అనుమతి ఉన్న గేమ్స్‌కు మాత్రమే నటుడు విజయ్ దేవరకొండ ప్రచారం చేశారని తెలిపారు. అనుమతి ఉన్న ప్రాంతాల వరకే విజయ్ ప్రమోటర్‌గా ఉన్నారని, రమ్మీ స్కిల్ బేస్డ్ గేమ్ అని సుప్రీంకోర్టు పలుమార్లు చెప్పిందని అన్నారు. ఏ23 సంస్థకు గతంలో విజయ్ ప్రచారకర్తగా పనిచేశారని, ప్రస్తుతం సదరు సంస్థతో విజయ్‌కి ఎటువంటి సంబంధం లేదని క్లారిటీ ఇచ్చింది. కేసు నమోదుపై నటుడు ప్రకాశ్‌రాజ్ సైతం సోషల్ మీడియా వేదికగా ఓ వీడియో విడుదల చేశారు. ప్రస్తుతం తాను షూటింగ్ కోసం ఓ గ్రామానికి వచ్చానని, బెట్టింగ్ యాప్ ప్రమోషన్‌పై కేసు నమోదు కావడం తెలిసి వివరణ ఇస్తున్నట్లు ప్రకాశ్ రాజ్ తెలిపారు. అందరినీ ప్రశ్నించే తాను ఈ విషయంలో సమాదానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. 2016లో సదరు యాడ్ తనవద్దకు వస్తే చేశానని చెప్పారు. అది తప్పని కొద్దినెలల్లోనే తెలిసిందని అన్నారు. సంవత్సరం తరువాత అగ్రిమెంట్ పొడిగిస్తామని వాళ్లు వస్తే వద్దని చెప్పానని తెలిపారు. 2021లో సదరు కంపెనీ మరో కంపెనీకి అమ్మడం జరుగడంతో సోషల్ మీడియా వేదికలో తన యాడ్ మళ్లి వచ్చిందన్నారు. దీనిపై అప్పుడే వాళ్లకు లీగల్ నోటీసు పంపించానని, వాళ్లు సైతం సదరు యాడ్‌ను అపేశారని అన్నారు. తాజాగా మరోసారి సదరు యాడ్ మీద చర్చ ప్రారంభమైందని అన్నారు. తనకు పోలీసుల నుంచి ఎటువంటి నోటీసులు అందలేదని తెలిపారు. మరోవైపు పలువురు యూట్యూబర్లు, మీడియా ఇన్‌ఫ్లూయోన్సర్లు తమ మీద కేసు నమోదు కావడం తెలుసుకొని అజ్ఞాతంలోకి వెళ్లిపోయారనే ప్రచారం జరుగుతుంది.

# లక్షకు చేరువలో ఉద్యోగాలు

>>10,954 త్వరలోనే గ్రామ పాలనా అధికారుల నియామకం జరుగనుంది. తెలంగాణలో నిరుద్యోగం తగ్గింది. నిరుద్యోగుల భవితకు ప్రజా ప్రభుత్వం బాసటగా నిలిచిందని తెలుపుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యాలయం గురువారం సాయంత్రం ఓ ప్రకటనలో వివరించింది. 15 నెలల్లోనే రాష్ట్ర ప్రభుత్వం 57,946 ఉద్యోగ నియామకాలు చేపట్టిందని వెల్లడించారు. కొత్తగా 30,338 పోస్టులను మంజూరు చేసింది. ఇటీవలే గ్రూప్1, గ్రూప్2, గ్రూప్3 ఫలితాలను విడుదల చేసింది. 563-గ్రూప్1 పోస్టులు, 783-గ్రూప్2 పోస్టులు, 1365-గ్రూప్3 పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు త్వరలో నియామక పత్రాలను ప్రభుత్వం అందించనుంది. 14,236 అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఇటీవలే ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు త్వరలోనే 10,954 గ్రామ పరిపాలనా అధికారులను నియమించనుంది. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి ఏళ్లకేళ్లుగా కారుణ్య నియామకాలకు ఎదురుచూస్తున్న బాధిత కుటుంబాలకు ప్రభుత్వం బాసటగా నిలిచింది. రవీంద్రభారతిలో గురువారం 922 మందికి సిఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందించారు. వీరలో 582 కారుణ్య నియామకాలు ఉన్నాయి. ఈ కారుణ్య నియామకాలను చేపట్టేందుకు ఉన్న అడ్డంకులను తొలగించేందుకు ముఖ్యమంత్రి కీలక నిర్ణయం తీసుకున్నారు. సిఎం ఆదేశాల మేరకు జెడ్పీ, మండల పరిషత్తుల్లో ఉన్న 524 ఆఫీస్ సబార్డినేట్, నైట్ వాచ్‌మెన్ పోస్టులను జూనియర్ అసిస్టెంట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేశారు. కొత్తగా 58 జూనియర్ అసిస్టెంట్ సూపర్ న్యూమర్ పోస్టులు సృష్టించారు.

**15 నెలల్లో 2025 మార్చి 20 నాటికి**

| శాఖలు | ఉద్యోగాల సంఖ్య |
|---|---|
| వ్యవసాయ, సహకార శాఖ | 208 |
| పశుసంవర్ధక, మత్స్య, డెయిరీ | 173 |
| బీసీ సంక్షేమ శాఖ | 5,578 |
| ఇంధన శాఖ | 850 |
| వైద్యఆరోగ్యకుటుంబ సంక్షేమశాఖ | 7,517 |
| ఉన్నత విద్య, సాంకేతిక విద్యాశాఖ | 3,893 |
| హోం శాఖ | 15,526 |
| నీటిపారుదల శాఖ | 1,235 |
| మైనారిటీ సంక్షేమ శాఖ | 1,584 |
| మున్సిపల్, పట్టణాభివృద్ధి | 3,148 |
| రెవన్యూశాఖ | 2,696 |
| ఎస్సీ అభివృద్ధి | 2,235 |
| విద్యాశాఖ | 10,209 |
| రవాణా, రోడ్డు భవనాలు | 442 |
| ఎస్టీ సంక్షేమ శాఖ | 1,290 |
| పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి | 722 |
| ఉపాధి కార్మిక శాఖ | 128 |
| ఇతర శాఖలు | 512 |
| పంచాయతీరాజ్, మున్సిపల్ | 922 |
| **మొత్తం** | **58,868** |

# హారీష్‌రావుకు హైకోర్టులో ఊరట

>> వాదనలు ఉన్నాయని తప్పుపట్టారు. కేసు దర్యాప్తు అధికారి ఎడాపెడా అరెస్ట్ చేసి నిందితులను భయభ్రాంతులకు గురిచేశారని, వాళ్లను భయపెట్టి బలవంతంగా తమకు కావాల్సిన రీతిలో వాంగ్మూలాలు తీసుకొని ఈ కేసులో హరీశ్‌రావును ఇరికించే కుట్ర చేస్తున్నారని చెప్పారు. చక్రధర్‌గౌడ్‌పై లైంగికదాడి సహా మొత్తం 11 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఆ కేసులు తప్పుగా నమోదైనవో, కాదో తేల్చాల్సింది కోర్టులని, కానీ ప్రభుత్వమే అవి తప్పుడు కేసులు అంటున్నదని చెప్పారు. రాజకీయ ప్రతీకారం తీర్చుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్న దని చెప్పారు. చక్రధర్‌గౌడ్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ గతంలో తనపై నమోదైన పలు కేసులను కోర్టు కొట్టేసిందని, కొన్ని కేసుల్లో స్టే ఉత్తర్వులు ఉన్నాయని చెప్పారు. ఇదే కేసులో రెండో నిందితుడు రిటైర్డ్ పోలీస్ అధికారి రాధాకిషన్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేస్తామని వెల్లడించారు.

# సర్పంచ్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ

## బిజెపి నేతలకు అమిత్‌షా,నడ్డా దిశానిర్దేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి20:** కరీంనగర్‌లో వచ్చిన ఫలితాలతో తెలంగాణ రాష్ట్రం మొత్తం ఇదే వ్యూహాంతో వెళ్లాలని బీజేపీ నేతలు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఇదే ఉత్సాహంతో స్థానిక ఎన్నికల్లో పనిచేసేలా బీజేపీ హై కమాండ్ దిగువ స్థాయి నేతలకు దిశానిర్దేశం చేస్తోంది. సర్పంచ్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ పోటీ చేయాలని బీజేపీ హై కమాండ్ భావిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో ఊహించని విజయాలు అందుకున్న బీజేపీ రాష్ట్ర నేతలు.... బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను గురువారం ఢిల్లీలో కలుసుకున్నారు. ముందుగా నడ్డాతో అరగంట పాటు తెలంగాణ బీజేపీ నేతలు సమావేశమయ్యారు. తెలంగాణలో మంచి ఫలితాలు సాధించిన నేతలను నడ్డా అభినందించారు. ఇలాగే కష్టపడితే తెలంగాణలో అధికారం సాధించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం పార్లమెంట్ భవనంలో అమిత్‌షాను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నేతృత్వంలోతెలంగాణ ఎంపీలు, నాయకులు కలిశారు స్థానిక ఎన్నికల్లో విజయం కోసం పాటించాల్సిన వ్యూహాలపై చర్చలు జరిపారు.

ఆదివారం
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్
: fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
21-3-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 48 పేజీలు: 10+4 వెల: 6.50

కేంద్ర ప్రభుత్వంపై మస్క్ 'ఎక్స్' దావా!
టీషర్టులు వేసుకొని సభకు రాకండి: స్పీకర్
9

30 మంది మావోయిస్టుల హతం

మృతుల్లో పలువురు అగ్ర నాయకులు?

భారీగా ఆయుధాలు, నగదు స్వాధీనం

వరుస ఎన్‌కౌంటర్లతో దద్దరిల్లుతున్న దంతెవాడ ప్రాంతం

మరో 2 భారీ ఎన్‌కౌంటర్లు

# నెత్తురోడిన దండకారణ్యం



బీజాపూర్ దంతెవాడ జిల్లా సరిహద్దులో ఎన్‌కౌంటర్ జరిగిన అంద్రి అటవి ప్రాంతం

**చర్ల, మార్చి 20, ప్రభాతవార్త:** ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మావోయిస్టు కంచుకోటలకు బీటలు బారుతున్నాయి. నక్సల్స్ లేని భారత్‌ను చూస్తాం.. 2026 కల్లా మావోయిస్టులను ఏరివేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పలుమార్లు ప్రకటించిన విషయం తెలిసిందే. గత ఏడాదిన్నర కాలంగా జరుగుతున్న ఎన్‌కౌంటర్లు లొంగుబాట్లను చూస్తుంటే ఆదిశగా అడుగులు పడుతున్నాయని తేటతెల్లం అవుతుంది. ఒక వైపు మావోల ఏరివేత మరో వైపు గ్రామాల అభివృద్ధి రవాణా సౌఖర్యం వంటికి చకచకా జరుగుతున్నాయి. ఇప్పటికే నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలలో బేస్ క్యాంపులను ఏర్పాటుచేసి వాటి నుండి అటవి ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో వరస ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయి.. దండకారణ్యంలో మారోసారి కాల్పుల మోతతో దద్దరిల్లింది. ఒకేరోజు వేర్వేరు చోట్ల జరిగిన భారీ ఎన్‌కౌంటర్లలో 30 మంది మావోయిస్టులు మృతిచెందారు. మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో భద్రతా బలగాలకు చెందిన డిఆర్జీ జవాను రాజు ఓయమ్మీ మృతిచెందాడు. భారీగా నగదును మందుగుండి సామాగ్రి ఇతర వస్తువులను స్వాదీనం చేసుకున్నారు. ఈ ఎన్ కౌంటర్ కు సంభందించిన బస్తర్ రేంజి ఐజి సుందర్ రాజ్ వివరాలు వెల్లడించారు. బీజాపూర్ దంతెవాడ జిల్లా సరిహద్దు గంగులూరు పోలీస్ స్టేషన్ >>2



2026 మార్చికి దేశం

## నక్సల్ రహితం

తాజా ఎన్‌కౌంటర్లపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

2



బ్రిటన్ 'హౌస్‌ఆఫ్ కామన్స్'లో జీవితసాఫల్య పురస్కారం అందుకొన్న మెగాస్టార్ చిరంజీవి

# చిరంజీవికి బ్రిటన్ అవార్డు

'హౌస్‌ఆఫ్ కామన్స్'లో జీవితసాఫల్య పురస్కారం అందుకొన్న తెలుగు నటుడు

**లండన్, మార్చి 20:** ప్రముఖ టాలీవుడ్‌నటుడు కేంద్ర మాజీ మంత్రి పద్మభూషణ్ చిరంజీవిని యుకె పార్లమెంటు ఘనంగా సత్కరించింది. బ్రిటన్ హౌస్ ఆఫ్ కామన్స్‌లో లేబర్‌పార్టీ ఎంపిలు మంత్రులు, ఇతర అధికారుల సమక్షంలో చిరంజీవికి జీవితసాఫల్య పురస్కారం అందించారు. టీమ్‌బ్రిడ్జ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో చిరంజీవి స్వయంగా ఈ పురస్కారాన్ని అందుకన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన జీవితంలో ఇదొక మరపురాని అద్భుత సందర్భమని, తన అభిమానులు, బంధుమిత్రులు, బ్రిటన్‌లోని తన శ్రేయోభిలాషులు అందరికీ ఆయన కృతజ్ఞతలు >>2

# కొలువుల పండుగ

వివిధ శాఖలలో 922 ఉద్యోగ, కారుణ్య నియామక పత్రాలు అందించిన సిఎం రేవంత్

గత ప్రభుత్వం పదేళ్లలో చేయనిది మేం పదినెలల్లో చేశాం..

### భవితకు చిరునామా తెలంగాణ: సిఎం

**హైదరాబాద్ (రవీంద్రభారతి), మార్చి 20 ప్రభాతవార్త:** భారతదేశంలో అన్ని రంగాల్లో అభివృద్ధికి మారుపేరుగా భవితకు చిరునామాగా తెలంగాణ రాష్ట్రం నిలిచిందన్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి భారత ప్రధానమంత్రి మోదీ అంటే నాకు గొప్ప గౌరవమని, దేశాన్ని అభివృద్ధి చేస్తున్నాననడం సబబే అయినా కానీ అభివృద్ధి అంతా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర దక్షిణ భారతదేశానికే చెందిందని, గుజరాత్, ఉత్తర ప్రదేశ్ తదితర ఉత్తరభారతదేశంతోపాటు జాతీయంగా ఎంతోమంది ఉద్యోగాల కోసం ఇక్కడకు వస్తున్నారని చెబుతూ అంటే అభివృద్ధి మేము సాధించినట్లా లేక మీరు చేసినట్టా అని మోదీని ప్రశ్నించారు. తెలంగాణలో కొలువుల పండుగపేరున రవీంద్రభారతి ప్రధాన >>2



వేదిక: రవీంద్రభారతి

గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ఉద్యోగ నియామకపత్రాలను అందజేస్తున్న రేవంత్‌రెడ్డి

## లక్షకు చేరువలో ఉద్యోగాలు

15 నెలల్లోనే తెలంగాణ రికార్డు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి20:** తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ ఏడాది మార్చి 20 నాటికి 58,868 నియామకాలు జరిగాయి. త్వరలో 2711 గ్రూప్ 1,2,3 పోస్టులు నియామకాలు జరుగనున్నాయి. 30,228 కొత్త పోస్టులు మంజూరు కానున్నాయి. 14,236 అంగన్వాడీ పోస్టులకు త్వరలోనే నోటిఫికేషన్ రానున్నంది. >>2



నేటి నుంచి

## 3 రోజులు వర్షాలు

**హైదరాబాద్, మార్చి 20 ,ప్రభాతవార్త:** రాష్ట్రంలో గత కొద్ది రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలో ప్రజలు అల్లాడిపోతున్నారు. భానుడి భగభగలతో బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు, తీవ్రమైన ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ ఏడాది జనవరి చివరి వారం నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపించటం మెదలుపెట్టాడు. ఇక మార్చి నుంచి అయితే ఎండల తీవ్రత మరింత పెరిగింది. ఉదయం 9 గంటల నుంచే ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉదయం 10 తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ప్రధనంగా నగరాల్లో రోడ్లపై జన సంచారం తగ్గిపోతుంది. రాత్రి వేళల్లోనూ ఉష్ణోగ్రతల్లో పెరుగుదల నమోదవుతోంది. >>2

## నాలుగేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు

రాజీవ్ యువ వికాసం కింద సెగ్మెంటుకు 5 వేల మందికి ఉపాధి

ఉగాది నుంచి రేషన్ కార్డులపై సన్న బియ్యం: మంత్రి పొంగులేటి



**సత్తుపల్లి మార్చి 20 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రానున్న నాలుగు సంవత్సరాలలో 20 లక్షల ఇల్లు నిర్మించి పేదవాడి ఇంటి కల సాకారం చేయనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో పెనుబల్లి కల్లూరు మండలాల్లో రామచంద్రపురం పెద కోరుకొండ ఎర్ర బోయినపల్లి గ్రామాల్లో గురువారం పర్యటించి సుమారు మూడు కోట్ల రూపాయల విలువగల ఇందిరమ్మ ఇల్లు, సీసీ రోడ్లో, సైడ్ ట్రైన్స్, ఎస్సీ కమ్యూనిటీ హాల్స్, కు శంకుస్థాపన లు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం పై మండలాల్లో పలుచోట్ల జరిగిన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానంలో చేసిన ఆరు గ్యారంటీలు ను ఆర్థిక వ్యవస్థ బాగో లేకపోయినప్పటికీ దశలవారీగా అన్ని అమలు చేస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి అన్నారు. పేదవాడి ఇంటి కల సాకారం చేయాలని ప్రతి సంవత్సరం నాలుగు లక్షల 50 వేల ఇల్లు చొప్పున నిర్మాణాలు చేపట్టదలుచుకుందామని ప్రతి ఇంటికి ఐదు లక్షల రూపాయలు ప్రభుత్వం హెచ్చిస్తుందని మంత్రి అన్నారు. ప్రతి ఇంటికి నాలుగు దశల్లో ఇస్తున్న ఈ డబ్బులు ఫౌండేషన్ తర్వాత లక్ష రూపాయలు కిటికీ లెవెల్ తర్వాత లక్ష 25వేలు రూపాయలు స్లాబ్ లెవల్ చేరిన తర్వాత లక్ష 75 వేల రూపాయలు చొప్పున ఇండ్లు పూర్తి చేసిన తర్వాత మరో లక్ష రూపాయలు చొప్పున మొత్తం ఐదు లక్షలు సహాయం పేదల ఇంటి కోసం అందుతుందని మంత్రి పొంగులేటి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యువతకు బృహత్తరకరమైన పథకం ఏర్పాటు చేశారని రాజీవ్ వికాస్ పథకం ద్వారా ప్రతి నియోజకవర్గానికి 5, వేలు మందికి తగ్గకుండా ఒక్కొక్కరికి 50, వేలు నుండి 4 లక్షల రూపాయల వరకు ప్రభుత్వం అందించటానికి యువత నుండి దరఖాస్తుల ఆహ్వానిస్తుందని మంత్రి పొంగులేటి చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో చేయలేనిది 20 వేల కోట్ల రూపాయలు రైతులకు రుణమాఫీ చేశామని సన్న రకం ధాన్యానికి 500 రూపాయలు చొప్పున బోనస్ అందించామని పండించే ప్రతి ఎకరానికి 12 వేల రూపాయలు రైతు భరోసా కింద మొదటి విడత 6000 రూపాయలు నెలాఖరులోగా అందరికీ అందజేస్తామని మంత్రి పొంగులేటి అన్నారు. మహిళలకు ఉచితబస్సు ప్రయాణం కోసం ప్రభుత్వం 5,450 కోట్లు ఖర్చు చేశామని 200 యూనిట్లు ఉషిత విద్యుత్తు 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా తదితర పథకాలు అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం దే అని పొంగులేటి అన్నారు. జిల్లా కలెక్టర్ ముజుముల్ ఖాన్ మాట్లాడుతూ పేదల అభివృద్ధికి సొంత ఇల్లు ఉండటం అవసరమని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల్లో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి చేసిన తర్వాత వీటి అనుభవాల ద్వారా మిగతా ప్రాంతాల్లో ఇల్లు నిర్మాణాలు చేపడతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు హౌసింగ్ పీడీ భూక్య శ్రీనివాస్ మార్కెట్ కమిటీ చైర్మన్ లు దోమ ఆనంద్ బాబు, నీరజ చౌదరి కల్లూరు ఆర్డీవో ఎల్ రాజేంద్ర గౌడ్ మిషన్ భగీరథ ఈ ఈ పుష్పలత, కాంగ్రెస్ నాయకులు తోట సుజలా రాణి గాదే చెన్నారావు అధికారులు అనాధికారులు హాజరైన వారిలో ఉన్నారు.

కాంగ్రెస్‌కు రోజులు

## దగ్గరపడ్డాయి..



గురువారం సూర్యాపేట సభలో కెటిఆర్

ప్రజాపక్షంగా మాట్లాడే పార్టీ గొంతు నొక్కుతున్నారు..

కెసిఆర్ నాయకత్వం కోరుకుంటున్న ప్రజలు

సూర్యాపేట సభలో కెటిఆర్

**ప్రభాతవార్త, నడిగూడెం,(సూర్యాపేట):** ప్రజాసంక్షేమాన్ని విస్మరించి పాలనసాగిస్తున్న కర్కశ కాంగ్రెస్ పాలనకు రోజులు దగ్గరపడ్డాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను, పార్టీ నాయకులను విమర్శించడమే ధ్యేయంగా కాంగ్రెస్ పెట్టుకుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమయ్యారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకపోతున్నారు. ప్రజా సమస్యలు పట్టవు. పంటలు ఎండిపోతుంటే ప్రభుత్వానికి సంబంధం లేదంటున్నారు. వ్యవసాయ బావులు బోర్ల కింద పంటలు ఎండితే తమకేమీ బాధ్యత అంటూ తప్పుడు మాటలు మాట్లాడుతున్నారు. ప్రజలు నమ్మి అధికారాన్ని కట్టబెడితే సమస్యలు పట్టించుకోకుండా కాలం గడుపుతున్నారు. తెలంగాణ ప్రజల గుండెల నుండి ఉద్భవించిన పార్టీ భారత రాష్ట్ర సమితి. తెలంగాణ ప్రజలంతా కేసిఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారు. తెలంగాణ బిడ్డలకు టిఆర్ఎస్ అండగా ఉంటుందని, ప్రజా పక్షాన నిలబడి పోరు సాగిస్తుందని గొంతు >>2

## నేటి నుంచి టెన్త్ పరీక్షలు

5 లక్షలు పైగా విద్యార్థులు హాజరు

5 నిమిషాలు 'గ్రేస్'కు అనుమతి

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని 10వ తరగతి విద్యార్థులకు నేటి (శుక్రవారం) నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగనున్నాయి. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు 5 నిమిషాల గ్రేస్ పిరియడ్‌ను ప్రకటిస్తూ విద్యాశాఖ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. పరీక్షలకు సంబంధించి అధికా రులు అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్ష పత్రాలపై క్యూఆర్ కోడ్‌ను ఇవ్వనున్నారు. ఎక్కడా ఎటువంటి లీకేజీలు లేకుండా పరీక్షలు సవ్యంగా సాగేలా చూడటానికి.. ఎక్కడైనా పశ్నాపత్రం లీకైనట్టు అయితే.. ఈ క్యూఆర్ కోడ్ ద్వారా వెంటనే తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ప్రశ్నాపత్రాలపై క్యూఆర్ కోడ్‌ను ఈ ఏడాది నుంచి ముద్రించనున్నారు. నేటి(మార్చి 21) నుంచి ఏప్రిల్ 4 వరకు >>2

బెట్టింగ్ యాప్‌ల ప్రయోగంపై

# పోలీసులు ఉక్కుపాదం

మియాపూర్‌లో 25 మంది సినీ ప్రముఖులు, మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ల మీద కేసు

వారిలో రానా దగ్గుబాటి, విజయ్ దేవరకొండ, ప్రకాశ్‌రాజ్, అనన్య నాగళ్ల, శ్రీముఖి తదితరులు



కొందరు యాంకర్లు గురువారం పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు వచ్చిన దృశ్యం

**సైబరాబాద్ ప్రతినిధి, మార్చి 20 ప్రభాతవార్త:** బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ వ్యవహారం తెలంగాణలో మరోసారి చర్చనీయాంశంగా మారింది. గత రెండు రోజుల క్రితమే ఆర్‌టిసి ఎండి విసి. సజ్జనార్ ఈ విషయం లేవనెత్తగా తాజాగా సైబరాబాద్ కమీషనరేట్ పరిధిలో పలువురు తెలుగు సినీ ప్రముఖులు, యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయోన్సర్ల మీద కేసు నమోదు కావడం సంచలనంగా మారింది. సైబరాబాద్ కమీషనరేట్ పరిధిలోని మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఓ వ్యక్తి పిర్యాదు చేయగా, పోలీసులు బుధవారం 25మందిపై కేసు నమోదు చేశారు. వీరిలో టాలీవుడ్ ప్రముఖులు రానా దగ్గుబాటి, విజయ్ దేవరకొండ, ప్రకాశ్‌రాజ్, అనన్య నాగళ్ల, శ్రీముఖి తదితర అగ్ర నటులతో పాటు పలువురు నటులు, యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయోన్సర్లు ఉన్నారు. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. బెట్టింగ్‌యాప్స్ కారణంగా యువత నష్టపోతున్నారని, బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మియాపూర్‌కు చెందిన ప్రమోద్ శర్మ అనే వ్యక్తి ఈనెల 16వ తేదీన మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశాడు. ఈపిర్యాదుపై స్పందించిన మియాపూర్ పోలీసులు బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్న మొత్తం 25మందిపై కేసు నమోదు చేశారు. వీరిపై బిఎన్ఎస్ సెక్షన్ 318(4), 112, రెడ్‌విత్ 49, టిఎస్‌జిప 3.3(ఏ), 4, 66డి, ఐటిఏ-2000-2008 సెక్షన్ల కింద కేసులు >>2

ఫోన్ ట్యాపింగ్ కేసు:

## హరీష్‌రావుకు హైకోర్టులో ఊరట

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 20:** మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుకు హైకోర్టులో ఊరట లభించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో పంజాగుట్ట పోలీసులు నమోదుచేసిన ఎఫ్ఐఆర్‌ను గురువారం రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం కోట్టివేసింది. రియల్‌ఎస్టేట్ వ్యాపారి చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు నమోదు చేసిన ఫోన్‌ట్యాపింగ్ కేసును కొట్టివేయాలని కోరుతూ హరీశ్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై 27న వాదనలు పూర్తయ్యాయి. తాజాగా పిటిషన్‌ను కొట్టివేస్తూ ధర్మాసనం తీర్పును వెలువరించింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది దామ శేషాద్రినాయుడు, న్యాయవాది ఆర్ చంద్రశేఖర్‌రెడ్డి తమ వాదనలు వినిపిస్తూ.. చక్రధర్‌గౌడ్ తరఫున ప్రభుత్వం వకాల్తా తీసుకున్నట్టుగా >>2

వార్త

నిస్వార్థత ఎంత అధికంగా ఉంటుందో విజయం అంత అధికంగా లభిస్తుంది.

-రోజర్

# ప్రజారోగ్యాన్ని కాటేస్తున్న కల్తీ!

మానవుడికే కాదు పశుపక్ష్యాదుల ఆరోగ్యానికి సంకటంగా మారుతున్న కల్తీని నిరోధించేందుకు పాలకపెద్దలు చేస్తున్న ప్రయత్నాలు ఏ మాత్రం ఫలించడం లేదు. దేశంలో రానురాను కల్తీ పెరిగిపోతున్నది. తాగే నీటిలో కల్తీ, పప్పులో కల్తీ, ప్రాణాపాయం నుండి కాపాడే మందుల్లో కల్తీ, చివరకు పౌష్టికాహారంగా వయసుతో ప్రమేయం లేకుండా పసిపిల్లల నుండి వృద్ధుల వరకు సేవించే పాలల్లో కల్తీ అదీ ఇదీ అనితేడా లేకుండా మొత్తం కల్తీమయంగా మారిపోతున్నది. మనిషి మనుగడనే ప్రశ్నార్థకం చేసే సూచనలు కన్పిస్తున్నాయి. కల్తీ ఇంత ప్రమాదకరంగా మారుతున్నా పొగమంచులా అంతటా విస్తరిస్తున్నా అడిగేవారు అడ్డగించేవారు కరవైపోయారు. ఒకరకంగా చెప్పాలంటే అవినీతికి, కల్తీకి అవినాభావ సంబంధం ఉంది. పెరుగుతున్న అవినీతికి రెట్టింపు స్థాయిలో కల్తీ విస్తరిస్తుంది. దీన్ని అరికట్టేందుకు ఎన్నో చట్టాలు ఉన్నాయి. ఆ చట్టాలు అమలు చేసి కల్తీ జరగకుండా నిరోధించేందుకు దేశవ్యాప్తంగా లక్షలాది మంది అధికారులు ఉన్నారు. కోట్లాది రూపాయలు జీతభత్యాల రూపేణ ప్రజాధనం వెచ్చిస్తున్నారు. కల్తీని నియంత్రించడం అటుంచి రోజురోజుకు పెరిగిపోతున్నది. ఈ కల్తీ భారత్‌లోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా మానవ జీవనానికి సవాలుగా మారుతున్నా మనదేశంలో అత్యంత ప్రమాదకరంగా పరిణమిస్తున్నదనే సంకేతాలు వెలువడుతున్నాయి. ఇది మూడోకంటికి తెలియకుండా జరగడం లేదు. బహిరంగ రహస్యమే. అన్నింటికంటే ఆహార కల్తీ పెరిగిపోతున్నది. కొందరు దళారులు, వ్యాపారులు లాభాల కోసం పప్పుదినుసులు, మాసాలాలు వంటి నిత్యావసర వస్తువులను కల్తీ చేస్తున్నారు. కల్తీ అడ్డుకట్టకు ప్రమాణాల చట్టం 2006లో తీసుకువచ్చినా అమలు గూర్చి పట్టించుకునేవారే లేరు. మార్కెట్లో విక్రయించే ఆహార పదార్థాల తయారీకి ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతి తప్పనిసరి. కానీ వ్యాపార సంస్థలేవీ అనుమతులు తీసుకోవడం లేదు. అలాగే ఎన్నో చట్టాలను పట్టించుకోవడం లేదు. 1947లో వంటనూనెల నియంత్రణ చట్టం, 1955 నిత్యావసర సరుకుల నియంత్రణ చట్టం, 1992 పాల ఉత్పత్తుల నియంత్రణ చట్టం లాంటివి ఎన్నో అమలుకు నోచుకోవడం లేదు. అన్నింటికంటే ముఖ్యంగా 1954 ఆహార కల్తీ నిరోధక చట్టాన్ని పూర్తిగా మరిచిపోయారనే చెప్పొచ్చు. ఇక్కడా, అక్కడా అనికాదు. దేశవ్యాప్తంగా ఈ కల్తీ విజృంభించిపోతున్నది. ఫలితంగా కోట్లాది మంది రకరకాల వ్యాధులకు గురవుతున్నారు. ముఖ్యంగా, గుండె, నరాలు, ఎముకలు, మూత్రపిండాలు, మెదడు, చర్మసంబంధిత సమస్యలు విస్తరిస్తున్నాయి. కల్తీకాటుకు ప్రపంచవ్యాప్తంగా యేటా డెబ్బై, ఎనభై లక్షల మందికిపైగా మరణిస్తుంటే అందులో భారత్‌లో ఐదారు లక్షల మంది వరకు అసువులు బాస్తున్నట్లు అనధికార లెక్కలు చెబుతున్నాయి. అన్నింటికంటే బాధాకరం ఈ కల్తీతో మరణించినవారిలో ముప్పైశాతానికి మించి ఐదేళ్లలోపు ఉన్న బాలబాలికలే. ఇటీవల కల్తీతో తయారు చేసిన ఆహార పదార్థాలను భుజించిన హాస్టల్ విద్యార్థులు ఆస్పత్రిపాలవుతున్న సంఘటనలు తరచుగా జరుగుతున్నాయి. ఇక పాలల్లో కల్తీ ఇటీవల బాగా పెరిగిపోయింది. డిమాండ్‌కు తగినట్టు ఉత్పత్తి లేకపోవడంతో ఆ వ్యత్యాసాన్ని పూడ్చేందుకు రకరకాల మార్గాల్లో కృత్రిమ పాలను తయారు చేస్తున్నారు. చక్కెర, ఉప్పు, గంజిపొడి, బియ్యం పిండి, యూరియా, గ్లూకోస్, పెరాక్సైడ్, డిటర్జెంట్, మైలమన్‌పొడి, నూనె తదితర పదార్థాలతో కల్తీ పాలు తయారవుతున్నట్లు సమాచారం. ఈ కల్తీ పాలను తాగితే అజీర్ణ సమస్యలు ప్రారంభమై కడుపునొప్పితో పాటు మూత్రపిండాలు, కాలేయం, నాడీవ్యవస్థపై కూడా ప్రభావం పడుతుందని వైద్యనిపుణులే హెచ్చరిస్తున్నారు. రసాయనికాలతో కూడిన పాలను దీర్ఘకాలం తీసుకుంటే కేన్సర్ వచ్చే అవకాశం ఉందంటున్నారు. ఇక పాలల్లో చిక్కదనం రావాలని ఇటీవల కాలంలో ప్రోటీన్ శాతాన్ని పెంచేందుకు ప్రమాదకరమైన మైలమన్ రసాయనిక పొడిని కలుపుతున్నారు. ఇక క్రిమిసంహారక మందులు పిచికారి చేసిన మేతను పశువులకు వేయడంతో దుష్ప్రభావాలకు కారణమవుతున్నాయి. మరికొన్ని సందర్భాల్లో పశువులకు గాలికుంటు లాంటి వ్యాధులు సోకినప్పుడు వాటి పాలను వాడకూడదని డాక్టర్లు చెప్తున్నా అవేమీ పాటించడం లేదు. ఈ పాల ద్వారా చేసే రకరకాల తీపి పదార్థాలు కూడా కలుషితమవుతున్నాయి. భారతదేశానికి సంబంధించి ఎన్నో సందర్భాల్లో సర్వోన్నతన్యాయస్థానం కల్పించుకున్న పరిస్థితులు కూడా వచ్చాయి. దేశప్రజలకు విక్రయించే పాలల్లో అరవైశాతంపైగా కల్తీయేనన్న వాస్తవాన్ని సాక్ష్యాత్తు జాతీయ ఆహార భద్రతా ప్రమాణాల మండలి ఏనాడో వెల్లడించింది. అప్పట్లో దేశంలో ఏదో ప్రాంతాల్లో తనిఖీ నిర్వహిస్తే అధిక శాతం కల్తీ బయట పడింది. ఇలాంటి సందర్భాల్లో సర్వోన్నత న్యాయస్థానం కల్పించుకొని ఇంతపెద్ద సమస్యపై పాలకులు ఏం చేస్తున్నారో చెప్పమంటూ నిలదీసి అడిగింది. ఈ దురాగతాలను నివారించడంలో విఫలమవుతున్న అధికారగణంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ప్రశ్నించిన సందర్భాలు కొన్ని ఉన్నాయి. ఇప్పటికైనా పాలకులు కల్తీవిషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది. కొత్త చట్టాలసంగతి దేవుడెరుగు. ఉన్నచట్టాలను త్రికరణశుద్ధిగా అమలుచేసేందుకు ప్రయత్నం చేయాలి. అవినీతితోనో, అలక్ష్యంతోనో లేక ఇతర కారణాలతో ఈ కల్తీని నిరోధించకపోతే ప్రజారోగ్యం ప్రశ్నార్థకంగా మారకతప్పదు.

అదృష్టం నుదుటన లేదు. మానవుడు చేసే కృషిలోనే ఉంది.



ఆస్కార్‌వైల్డ్

ఇతరులు మనకు ఇచ్చేది తాత్కాలికమైనది. స్వయం కృషితో మనం సంపాదించుకున్నదే శాశ్వతమైనది.



జీన్ ఫ్రాముజాన్

# జల పరిరక్షణ అందరి బాధ్యత

**పట్టణాలలో వచ్చే టువంటి మురికి నీటిని పునర్వినియోగించే ఆధునిక పద్ధతులను పునికిపుచ్చుకోవాలి. నీటి ప్రాముఖ్యతను పెంచడానికి ప్రజలలో అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి జలచైతన్యాన్ని పెంచాలి. ప్రస్తుతం శాస్త్రజ్ఞులు భూమిని వదిలి వేరే వేరే గ్రహాలకు వెళ్లి పరిశోధనలు చేయటానికి ప్రధానమైనటు వంటి కారణం భవిష్యత్తులో నీరు గాలి భూమి కాలుష్యం పెరిగి నివసించడానికి ఆమోదయోగ్యంగా లేనటువంటి కానటువంటి గ్రహంగా మారుతుందని తెలిసి భవిష్యత్ తరాల కోసం ఈ వెతుకులాటే ఈ గ్రహ పరిశోధనలకి అన్వేషణ. ఈ అన్వేషణ ప్రస్తుతం భూమి మీద ఉన్న జల వనరులను కాపాడుకోవడానికి, పెంచుకోవడానికి ప్రయత్నించాలి.**

డాక్టర్ ఎ. భాగ్యరాజ్

ప్రపంచంలోని జంతువులు, మొక్కలు, మానవ మనుగడకు నీరు చాలా ముఖ్యమైనది. ఈ ప్రపంచంలో ఏ వస్తువుకి లేనటువంటి ఒక మహత్తరమైన శక్తి నీటికి ఉన్నది. అది ఎటువంటి మలినములైన వస్తువునైనా శుభ్రపరిచే శక్తి, జంతువులు, మానవుల దాహార్తిని తీర్చే శక్తి, పంటలు పండించడానికి, భవనాలు, కట్టడాలు, అభివృద్ధి పనులకు దోహదపడుతుంది. నీళ్ల పర్యావరణ వ్యవస్థలను, మానవ ఆరోగ్యాన్ని, ఆర్థిక అభివృద్ధిని నిలబెట్టడంలో కీలకమైన పాత్ర పోషిస్తుంది. ఇది మానవ శరీరంలో సుమారు 70శాతం వరకు ఉంటుంది. ముఖ్యంగా ఉత్పత్తి రంగానికి, పారిశ్రామికరణకు, వ్యవసాయానికి, శుభ్రపరచడానికి, నీటి నుండి విద్యుత్ శక్తి, భూమి ఉష్ణోగ్రతను స్థిరీకరించడానికి ఉపయోగపడుతుంది. శుభ్రమైన నీరు ఉండడంవలన ప్రజారోగ్యం మెరుగుపడుతుంది. భవిష్యత్తు తరాలకు శుభ్రమైన మంచి నీటిని అందుబాటులో ఉండేలా చూసుకోవడానికి నీటి వనరుల పరిరక్షణ బాధ్యతాయుతమైన నిర్వహణ చాలా అవసరం. ప్రస్తుతమున్న సమయంలో పేదవారికి ధనికులకి మధ్య జరుగుతున్న పోరాటంలో ఉన్నవాడు పోషకాలున్నటువంటి నీళ్లు తాగుతుంటే లేనివాడు కలుషితమైనటువంటి, అనారోగ్యానికి కారణమైనటువంటి నీటిని తాగుతున్నారు. ఈ ప్రపంచంలో పేదవాడిగా పుట్టడమే పాపం అయిపోయినట్టు ఉన్నది. ప్రకృతి సిద్ధంగా లభించేటువంటి నీటికి కూడా పోరాడవలసి వస్తోంది. రాబోయే కాలంలో రాజకీయ పార్టీల హామీ పత్రం (మేనిఫెస్టో)లో నీరు ప్రాముఖ్యత మరింత ఎక్కువగా ఉంటుంది. ప్రకృతి సిద్ధంగా లభించేటటువంటి నీరు ప్రస్తుతం వ్యాపారస్తుల్లో అది ఒక కల్పతరువుగా మారిపోయింది. దీనికి ప్రధానమైన కారణం ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానం, వాటి చేతగానితనం, అమలుపరచడంలో ఉదాసీనంగా వ్యవహరించడం. అడవులను, నీటి వనరులను పెద్దపెద్ద వ్యాపారవేత్తలకు అప్పనంగా దోచిపెట్టడం. నీటి కోసం యుద్ధాలుజరగబోయే సమయం అతి దగ్గరలోనే ఉందని పాలకులు గుర్తించి నీటి ప్రాముఖ్యతను, దాని విలువను ప్రజలలో తీసుకువెళుతూ భూగర్భజలాలను ఎలా పెంచాలో, ఉపరితల మంచినీటిని ఎలా ఉపయోగించుకోవాలో ప్రజలలోఅవగాహనకల్పించాలి. అంతర్జాతీయ నీటిదినోత్సవ ప్రాముఖ్యత ఐక్యరాజ్యసమితి 1993 నుండి ప్రతి సంవత్సరం మార్చి 22న నిర్వహించబడుతున్న ప్రపంచ జల దినోత్సవం, మంచినీటి ప్రాముఖ్యతపై దృష్టిపెడుతుంది. ప్రపంచ జలదినోత్సవం సురక్షితమైన నీరు అందుబాటులో లేకుండా జీవిస్తున్న 220కోట్ల ప్రజలకు అవగాహన కల్పించడానికి, ప్రతి సంవత్సరం మార్చి 22న ప్రపంచ నీటి దినోత్సవం జరుపుకుంటారు. నీటి సంరక్షణ, నీటి ప్రవాహాలకు సంబంధించిన అంశాలపై దృష్టి పెట్టడం, నీటి సమస్యలకు పరిష్కారాలు కనుక్కోవడం, వాతావరణ మార్పులను తగ్గించడం, హిమానీనదాల నష్టానికి అనుగుణంగా కమ్యూనిటీలు, పర్యావరణ వ్యవస్థలను రక్షించడం, చర్యలు తీసుకోవడం గురించి చర్చిస్తారు. పపంచ నీటి దినోత్సవం సందర్భంగా ఐక్యరాజ్యసమితి ప్రపంచ నీటి అభివృద్ధి నివేదికను విడుదల చేస్తుంది.

యూనెస్కో ప్రస్తుత సంవత్సర నినాదం 'హిమానీనదాల సంరక్షణ'. ఇది భూమి నీటి చక్రాన్ని నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తున్నందున ప్రపంచంలోని హిమానీ నదాలను రక్షించాల్సిన తక్షణ అవసరాన్ని చెబుతుంది. వాతావరణ మార్పు హిమానీనదాల ద్రవీభవనాన్ని వేగవంతం చేస్తుండటంతో, మంచినీటి లభ్యత మరింత అనిశ్చితంగా, జటిలంగాను మారుతోంది. అయినప్పటికీ మనం అవసరమైన అత్యవసర చర్యలు తీసుకోవడం లేదు. నేటి ప్రపంచంలో నీరు ప్రాముఖ్యత భూమిలో మొత్తం భూగర్భ జరాలు దాదాపు 23 మిలియన్ క్యూబిక్ కిలోమీటర్లు, కానీ సులభంగా వినియోగానికి అందుబాటులో ఉండేవి కేవలం 0.3శాతం మాత్రమే. ఆరోగ్యకరమైన ప్రతి మానవుడికి



రోజుకి రెండు నుంచి మూడు లీటర్ల నీరు అవసరం. ఒక నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 220 కోట్ల మందికి సురక్షితమైన తాగునీరు లేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం అభివృద్ధిచెందుతున్న దేశాలలో 80 శాతం వ్యాధులు నీటిద్వారానే సంక్రమిస్తున్నాయి. భూమిపైన లభ్యం అవుతున్న నీటిలో 70శాతం నీరు వ్యవసాయానికి, పరిశ్రమలకు 20శాతం, ఆహార వ్యవసాయసంస్థ ప్రకారం కిలో గోధుమకు 1,800 లీటర్లు, కిలోబియ్యానికి 2,500 లీటర్లు, ఒక ఆపిల్‌కు 70లీటర్లు, గ్లాసుపాలకు 200లీటర్లు కావాలని అదేవిధంగా యూనెస్కో లెక్కలప్రకారం పరిశ్రమల రంగంలో ఒక కిలోకాటన్ వస్త్రానికి 10,000లీటర్లు, కారుకి 40,000 లీటర్లు, మైక్రోచిప్‌కు 35లీటర్లు అవసరమోతాయి అని వెల్లడించింది. ప్రపంచంలో అత్యధిక నాణ్యత గల తాగునీరు కలిగిన దేశాలు అమెరికా, ఇటలీ, సింగపూర్, కెనడా, జర్మనీ వందకు 10098 శాతం పైన ఉంటే మన దేశంలో 25.8 శాతంతో దేశం వారీగా నీటి నాణ్యతలో సుమారుగా చివరి 1015 మధ్యలోస్థానంతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి. ప్రపంచ జనాభాలో 18శాతం ఉన్న భారత దేశంలో ప్రపంచ మంచినీటి వనరులు కేవలం 4 శాతం మాత్రమే ఉన్నాయి. దీని వలన పరిశుభ్రమైన తాగునీటి లభ్యత సామాజిక, ఆర్థిక అవసరంగా మారింది. తలసరి నీటి లభ్యతలో ఇది 133వ స్థానంలో ఉంది. ప్రపంచ నీటి వనరులలో 20.1 శాతం ఉపయోగిస్తున్న రెండవ అతిపెద్ద నీటి వినియోగదారు. యాభై సంవత్సరాల క్రితం 3,000 క్యూబిక్ మీటర్ల నుండి నేడు 1,123క్యూబిక్ మీటర్లకు తలసరి నీటిలభ్యత బాగాతగ్గింది. ఇది ప్రపంచసగటు ఆరువేల క్యూబిక్ మీటర్ల కంటే చాలా తక్కువ. జనాభా పెరుగుదల పెరుగుతున్న డిమాండ్ కారణంగా నీటి నాణ్యత నీటి కాలుష్యం ఒక ప్రధాన ఆందోళన. 50,000 కంటే ఎక్కువ జనాభా ఉన్న పట్టణ కేంద్రాలు రోజుకు 38,000 మిలియన్ లీటర్ల మురుగునీటిని ఉత్పత్తి చేస్తాయి. కానీ శుద్ధి సామర్థ్యం 11,000 ఎమ్ఎల్‌డి (29శాతం) మాత్రమే. 2050 నాటికి, పట్టణ వ్యర్థ జలాలు 100,000 ఎమ్ఎల్‌డి కంటే ఎక్కువగా ఉండవచ్చు. గ్రామీణ ప్రాంతాలు మరో 50,000ఎమ్ఎల్‌డిని జోడించవచ్చు. ప్రపంచవ్యాప్తంగా, 70శాతం మంచి నీరు వ్యవసాయ వినియోగానికి, పరిశ్రమ వినియోగానికి (20శాతం కంటే తక్కువ). గృహ (లేదా మునిసిపల్) వినియోగానికి (సుమారు 12శాతం) ఉన్నాయి. నీటిపారుదల కోసంఉపయోగించే మొత్తం నీటిలోభూగర్భజలాలు25శాతం గృహ అవసరాల కోసం ఉపసంహరించబడే మంచినీటిలో సగం సరఫరా చేస్తున్నాయి. ప్రభుత్వాలు ప్రజల భాగస్వామ్యం బాధ్యతలు 2025-26 కేంద్ర బడ్జెట్లో తాగునీరు పారిశుద్ధ్య శాఖకు కేంద్రం 74,226 కోట్లు కేటాయించింది. దీనిలో ఎక్కువ భాగం గ్రామీణ గృహాలకు కుళాయి నీటి కనెక్షన్లను అందించడం లక్ష్యంగా పెట్టుకున్న జల్ జీవన్ మిషన్కు కేటాయించబడింది. ప్రస్తుతం ఉన్న ఆధునిక కాలంలో ప్రభుత్వాలు అటవీ భూములను ఆధునిక పారిశ్రామికవేత్తలకు తన అనుయాయులకు ప్రభుత్వ భూములను, అటవీ భూములను అప్పనంగా కట్టబెడుతుంది. మంచి నీరు కావాలంటే అటవీపైనే ఆధారపడవలసిన ప్రస్తుత పరిస్థితులలో అడవులను కాపాడుకుంటేనే భవిష్యత్తు తరాలకు మంచి నీటిని అందించగలము. ప్రస్తుతమున్న ప్రభుత్వాలు అటవీ భూములను పెంచకపోయినా పరవాలేదు కానీ ఉన్నటువంటి అటవీ భూములను కాపాడుకోవడమేసరైనమార్గం. ప్రస్తుత కాలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం గణనీయంగా పెరగడంతో చెరువులో కాలువలు కొండలు, గుట్టలు ఆక్రమణలకు గురవుతున్నాయి. ప్రభుత్వాలు, అధికారులు నియంత్రించడంలో విఫలమవుతున్నారు. ప్రపంచ బ్యాంకు ఒక నివేదికలో మనదేశంలో సరైననీటి సరఫరా పారిశుద్ధ్యం లేకపోవడంవల్లఏటా 25వేలకోట్లు నష్టపోతున్నామనివెల్లడించింది. శుభ్రమైన నీరు మంచి ఆరోగ్యాన్ని ఆనందన్నిస్తే, అపరిశుభ్రమైన నీరు అనారోగ్యాన్ని, అల్లకల్లోలనాన్నిస్తుంది. ముఖ్యంగా పట్టణాలలో ప్రస్తుతం కడుతున్న భవనాలకు, అపార్ట్మెంట్లకు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసిన తరువాతనే అనుమతులు ఇచ్చే విధంగాఉండాలి. పట్టణాలలో వచ్చేటువంటి మురికి నీటిని పునర్వినియోగించే ఆధునిక పద్ధతులను పునికిపుచ్చుకోవాలి. నీటి ప్రాముఖ్యతను పెంచడానికి ప్రజలలో అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి జలచైతన్యాన్ని పెంచాలి. ప్రస్తుతం శాస్త్రజ్ఞులు భూమిని వదిలి వేరే వేరే గ్రహాలకు వెళ్లి పరిశోధనలు చేయటానికి ప్రధానమైనటు వంటి కారణం భవిష్యత్తులో నీరు గాలి భూమి కాలుష్యం పెరిగి నివసించడానికి ఆమోదయోగ్యంగా లేనటువంటి కానటువంటి గ్రహంగా మారుతుందని తెలిసి భవిష్యత్ తరాల కోసం ఈ వెతుకులాటే ఈ గ్రహ పరిశోధనలకి అన్వేషణ. ఈ అన్వేషణ ప్రస్తుతం భూమి మీద ఉన్న జల వనరులను కాపాడుకోవడానికి, పెంచుకోవడానికి ప్రయత్నించాలి. •

# జాతి వివక్ష రహిత సమాజం సాధ్యమేనా?

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

నాడు దక్షిణ ఆఫ్రికాలో శరీర చర్మ రంగు కారణంగా మహాత్మాగాంధీని తాను ప్రయాణిస్తున్న రైలు నుంచి బయటకు గెంటివేయడం జరిగిన విషయం మనకుతెలుసు. 2020లో తెల్లతోలు పోలీసులతో ఘర్షణలో 46 ఏండ్ల నల్ల తోలు జార్జి ఫ్లాయిడ్ దుర్మరణం పాలుకావడం కూడా విన్నాం. ఇలా నాటి నుంచి నేటి వరకు వర్ణ, జాతి వివక్ష దురాచార, దురహంకారం ప్రపంచాన్ని చుట్టేస్తూనే ఉన్నది. 21 మార్చి 1960న దక్షిణ ఆఫ్రికాలో వర్ణ వివక్ష చట్టాలకు వ్యతిరేకంగా నిర్వహించిన శాంతియుత నిరసన కార్యక్రమంలో జరిపిన అమానవీయ పోలీసు కాల్పుల్లో 69 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోవడం జరిగింది. ఈఘటనకు గుర్తుగా ఐరాస తీర్మానం ప్రకారం ప్రతి ఏటా 21 మార్చిన 'అంతర్జాతీయ జాతి వివక్ష నిర్మూలన దినం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ రేసియల్ ఎలిమినేషన్ ఆఫ్ డిస్క్రిమినేషన్)'ను పాటించుట ఆనవాయితీగా మారింది. 2025 అంతర్జాతీయ జాతి వివక్ష నిర్మూలన దినం ఇతివృత్తంగా అన్ని రకాల జాతి వివక్షల నిర్మూలనపై 60వ అంతర్జాతీయ సదస్సు' అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న వివిధ రకాల వివక్షలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున మానవ హక్కుల ఉల్లంఘనల పట్ల అవగాహన కార్యక్రమాలను నిర్వహించుట కొనసాగుతున్నది. మానవాళిపై సమానత్వం, సాంస్కృతిక సహనశీలత, జాతి పక్షపాత రహిత ధోరిణి, వివక్ష కానరాని సమాజ స్థాపనల పట్ల మానవాళిపై చైతన్యం కలిగించడమే ఏకైక ఉద్దేశంతో ఈ దినం నిర్వహిస్తున్నారు. జాత్యహంతకారం, జాతి వివక్ష, వర్ణవివక్ష, విదేశీ జాతుల పట్ల వివక్ష, కుల మత విభేదాలు, అంటరానితనం, వివక్షతతో అహంకార పోకడలు నేటి డిజిటల్ ప్రపంచంలో కూడా కనిపించడంతో శోచనీయం. ఏ దేశంలో ఉన్నప్పటికీ మనిషిని మనిషిగా చూడగలిగే రోజులు రావడానికి అనేకఉద్యమాలు జరిగాయి. జరుగుతూనే ఉన్నాయి. ఫైట్ రేసిజమ్ లేదా జాత్యహంకారంపై పోరు అనే నినాదం నిత్యం జపించాల్సిన అగత్యం ఏర్పడింది. విశ్వ మానవాళి ఐక్యత మంత్రాన్ని జపిస్తూ, భిన్నత్వంలో ఏకత్వం సాధిస్తూ, మానవ హక్కుల గీతాలు దాటకుండా నిలబడుతూ, సమానత్వ సాధన దిశగా గట్టి అడుగులు పడే విధంగా మన ప్రవర్తనలు మారాలి. శరణార్థులు, వలసదారుల వేదనలకు సరైన సమాధానాలు వెతికే మహాకార్యం చేపట్టడానికి నడుం బిగించాలి. వ్యక్తిగత గౌరవాన్ని నిలుపుకోవడం, జాతి వివక్షకు తావివ్వకపోవడం, వర్ణ వర్గీకరణను వ్యతిరేకించడం, మానవ హక్కుల చట్టాల ఉల్లంఘనలను తీవ్రంగా తీసుకోవడం, అందరిని సమదృష్టితో చూసుకోవడం, అందరి సంస్కృతులను గౌరవించడం లాంటి చర్యలు వివక్ష రహిత సమాజస్థాపనకు ఉపకరిస్తాయి. వర్ణ, వర్గ వివక్షకు బదులుగా విద్య, వ్యక్తిత్వం, ఉన్నత ఆలోచనలు, నైతిక ప్రవర్తనలు, విషయ పరిజ్ఞానం, శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలను బట్టి వ్యక్తులను గౌరవించే రోజులు రావాలని కోరుకుందాం. తెల్లతోలు, నల్లతోలు ఆలోచనలను రూపుమాపుదాం. మానవత్వమే మంత్రంగా వివక్ష రహిత సమాజ స్థాపనకు ఉద్యమిద్దాం. •

# ప్రజావాక్కు



## అభివృద్ధి అంటే ఇదేనా?

**అభివృద్ధి** చెందుతున్న దేశంలో పరిశ్రమలు, వాహనాలు ఎక్కువ కావడంతో గాలి, నీరు కలుషితమై ప్రజలు అనేక వ్యాధులబారిన పడుతున్నారు. ఈ కలుషితమైన గాలిని పీల్చడంవల్ల కేన్సర్ అనే భయంకరమైన వ్యాధి ప్రజలను పట్టి పీడిస్తోంది. జల కాలుష్యం వల్ల దాహమేస్తే నీళ్ల తాగడానికి భయపడిపోతున్నారు ప్రజలు. గత్యంతరం లేక ప్లాస్టిక్ బాటిల్‌లో నిల్వచేసిన నీళ్లతో తృప్తిపడుతున్నారు. ఈనీళ్ల తాగడంవల్ల ఆరోగ్యానికి మంచిది కాదని తెలిసినా తప్పడంలేదు. ఇక ఆహార విషయానికొస్తే చాలా వరకు కూరగాయలు, పండ్లు, ఆహార వస్తువులన్నీ ప్లాస్టిక్ కవర్లలోనూ, డబ్బాలలో చేసినవే వాడుకుంటున్నారు. అభివృద్ధిఅంటే పరిశుభ్రమైన గాలి, నీరు, స్వచ్ఛమైన ఆహారం ప్రజలకు అందించడం.

-కాయల నాగేంద్ర, హైదరాబాద్

## సంక్షోభంలో యూరప్

**నిజమే** యూరప్‌ఇప్పుడు కనపడని సంక్షోభంలో ఉన్నది. అమెరికా విచ్చలవిడి తనపు రూపం ఒకవైపు రష్యా ఆధిపత్య భావజాలం ఒకవైపు. ఏ సంస్థ మూలంగా అయితే యూరప్ ఎదిగిందో అదే మూలనపడ్డ పరిస్థితి మరోవైపు. ఇవన్నీ కలగలిసి యూరప్‌ను సంక్షోభంలోకి నెడుతున్నాయి. సంపన్నదేశాలు చిన్నదేశాలలో పుట్టే గ్రూప్‌లను అంటి నేషనల్ గ్రూప్స్‌గా చూడడం కూడా ఒక కారణం. అవి తమ అస్తిత్వాన్ని నిలుపుకోవడానికి లేదా తమ విలువైన సంపదపైన ఆధిపత్యం వహించకుండా చేయడం గురించి ప్రయత్నిస్తున్నాయి అని అనుకోవచ్చుగా.

-భారత అవినాష్, జనగామ

## ఎపి ఫైబర్‌నెట్ పని తీరు మారదా?

ఎపి ఫైబర్‌నెట్ సంస్థలో పని చేస్తున్న ఉద్యోగుల వివరాలు తక్షణం ఇవ్వాలని ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశించి పది రోజులు దాటినా ఆ సంస్థ నూతన మేనేజింగ్ డైరెక్టర్ ఇంతవరకు వివరాలు అందించిన సమాచారం లేదు! అంటే సంస్థలో పనిచేస్తూ జీతాలు పొందుతున్న వారి వివరాలే సంస్థ వద్ద లేవన్నది సుస్పష్టం! ఇలాంటి అనవసర జాప్యాలు, కాలహరణంతో విసుగు చెంది సంస్థ చైర్మన్ మీడియా ముందు తన అసంతృప్తిని వెళ్లగక్కితే ఆయన పదవి నుంచి వైదొలగే పరిస్థితి కల్పించారు.

-జి.రామకృష్ణ,ముస్తాబాద,కృష్ణా జిల్లా

## బియ్యం బొక్కిన కేసుల పురోగతి ఏది?

రాష్ట్రంలో గతవైకాపా పాలనలో రేషన్ బియ్యం భారీగా పక్కదారిపట్టిన వైనాలు వెలుగు చూశాయి. గత పదినెలలుగా దారి మళ్లించిన బియ్యం నిత్యం పట్టుబడుతున్న వార్తలు పత్రికల్లో వస్తున్నాయి. అయితే కేసులు నమోదు చేస్తున్నారు. కానీ వాటి పురోగతి, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠినచర్యలు కానరావడంలేదు. రాష్ట్రపౌరసరఫరాల శాఖమంత్రి ఈ అక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టికేసుల సత్వర పరిష్కారానికి శ్రద్ధ చూపాలి. లేకుంటే ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళ్లే ప్రమాదం ఉంది.

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

## నింగి నుండి దివికి

**భారత** సంతతికి చెందిన అమెరికా వనిత సునీతా విలియమ్స్ అంతరిక్ష ప్రయాణం జూన్ 5, 2024 లో ప్రారంభమయింది. తిరిగి అదే నెల 15న తిరిగి రావాలి. కాని ఆమెను, సహచర వ్యోమగామి బుచ్ విల్మోర్‌ను తీసికెళ్లిన బోయింగ్ స్టార్ లైనర్ తిరిగి వచ్చేటప్పుడు పనిచేయడం మానేసింది. అంతే అప్పటి నుండి నాసా వారికి కంటి మీద కునుకు లేకుండాపోయింది. ఎట్టకేలకు అనేక మరమ్మతులు చేసి తొమ్మిది నెలల తరువాత మార్చి 19న భూమి మీదకు తేగలిగారు. గతంలో మన భారతీయ వనిత కల్పనాచావ్లా మూడవసారి 2003 జనవరి నెలలో అంతరిక్షంలోకి వెళ్ళి తిరిగి వస్తూండగా వారి కోలంబియా స్పేస్ షటిల్ పేలిపోయి ఆమెతో పాటు ఆరుగురు క్రూ మెంబర్సు దుర్మరణం చెందడంతో మొత్తం ప్రపంచం దిగ్భ్రాంతి, బాధను వ్యక్తంచేసింది. ఈ వ్యోమగాములకు ఏమవుతుందోనని భయం పట్టుకుంది. భయపడ్డ వారంతా తెలికగా ఊపిరి పీల్చుకోగలిగారు. మన ప్రధాని నరేంద మోడీ గారు సునీతను భారత్‌కు రమ్మని ఆహ్వానించారు.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేయాలి

**విద్యార్థులకు** వేసవి సెలవులు అనగానే సంతోషం. ఈ సెలవులలో ఉష్ణోగ్రతల తాకిడికి, వడగాలులు వంటి వాటి నుండి వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవడానికి ప్రభుత్వం విద్యాశాఖ ద్వారా విజ్ఞానానికి సంబంధించిన వినోదానికి సృజనాత్మకతకు, సంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు పాటలు డ్రాయింగ్‌వంటి సబ్జెక్టులను కొంత జ్ఞానం సంపాదించడానికి గాను ప్రత్యేక క్లాసులు అవసరం. ప్రతి గ్రామంలో విద్యార్థుల వేసవి శిక్షణ శిబిరాలను విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# డీలిమిటేషన్‌కు సహేతుక ప్రామాణికాలవసరం

జుర్రు నారాయణ యాదవ్

ప్రజాస్వామ్యం రెండు రకాలు. ఒకటి ప్రత్యక్ష ప్రజాస్వామ్యం, రెండు పరోక్ష ప్రజాస్వామ్యం. జనాభా చాలా తక్కువగా ఉన్న ప్రాచీన కాలంలో ఏథెన్స్‌లాంటి గ్రీక్ నగరాల్లో ప్రత్యక్ష ప్రజాస్వామ్యం మనుగడలో ఉండేది. కానీ జనాభా పెరుగుతున్న కొలది ప్రత్యక్ష ప్రజాస్వామ్యంలో ఉన్న సవాళ్లను అధిగమించుటకు పరోక్ష ప్రజాస్వామ్యం అంటేప్రాతినిధ్య ప్రజాస్వామ్యం నెలకొల్పబడింది. ఆధునిక కాలంలో ప్రజాస్వామ్యం అంటే ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం. దీంట్లో ప్రతినిధులు ఎంపికే కీలకం. ఈ ప్రతినిధుల సంఖ్యను కాలానుగుణంగా జనాభా పెరుగుతున్నట్లుపెంచవలసి వస్తుంది. స్వాతంత్ర అనంతరం మనదేశంలో 1951 జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ సభ్యుల సంఖ్యను నిర్ణయించడం జరిగింది. కాలనుగుణంగా ఈప్రతినిధుల సంఖ్యను జనాభాకు అనుగుణంగా పార్లమెంట్లో పెంచుటకుఆర్టికల్ 82 ద్వారా, శాసన సభలో పెంచుటకు ఆర్టికల్ 170 ద్వారా రాజ్యాంగం అవకాశం కల్పించింది. 1951 జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభలో 494 స్థానాలుండగా, 1961జనాభా లెక్కల ప్రకారం 522 స్థానాలకు ప్రతినిధుల సంఖ్య పెరిగింది. 1971 జనాభా లెక్కల ప్రకారం ఈ ప్రాతినిధ్యం 543 స్థానాలకు పెరిగింది. అయితే 70 దశకంలో జనాభా నియంత్రణలో భాగంగా పార్లమెంటు స్థానాల పెరుగుదల పరోక్షంగా జనాభా పెరుగుదలను ప్రోత్సహిస్తుందనే కారణంతో ఇందిరా గాంధీ ప్రభుత్వం 1976 సంవత్సరంలో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా మరో 25 సంవత్సరాలు పార్లమెంట్, శాసనసభ స్థానాలు పెంచరాదని రాజ్యాంగ సవరణ ద్వారా చట్టం చేయడం జరిగింది. మళ్లీ 2001 సంవత్సరంలో వాజ్‌పాయి ప్రభుత్వం 84వ రాజ్యాంగ సవరణ ద్వారా మరో 25 సంవత్సరాలు ప్రాతినిధ్యంలో మార్పులు చేయరాదని నిర్ణయించింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 2026వ సంవత్సరంలో పార్లమెంట్, శాసనసభ స్థానాలు ప్రస్తుత జనాభా ప్రకారం పెంచుటకు నిర్ణయించింది. ఈ నిర్ణయమే ప్రస్తుతం దేశవ్యాప్తంగా దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాల మధ్య తీవ్ర చర్చకు దారితీసింది. ప్రస్తుత జనాభా ప్రకారం డీలిమిటేషన్ ప్రక్రియ చేపడితే జనాభా నియంత్రణలో ముందు వరుసలోఉన్న కేరళ, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక లాంటి దక్షిణాది రాష్ట్రాలు నష్టపోనున్నాయి. ప్రస్తుతం ఈరాష్ట్రాల్లో 543 పార్లమెంట్ స్థానాలకుగాను 129 స్థానాలతో 24శాతంప్రాతినిధ్యం కలిగి ఉన్నాయి. అయితే ప్రస్తుత జనాభాని పరిగణనలోకి తీసుకొని డిలిమిటేషన్ చేస్తేదక్షిణాది రాష్ట్రాల్లో పార్లమెంట్ ప్రాతినిధ్యం తగ్గుతుంది. ప్రస్తుతం 142 కోట్లజనాభాకు 20 లక్షలకు ఒక ఎంపీ స్థానం అనుకున్నా సుమారు775 స్థానాల్లో దక్షణాది రాష్ట్రాల్లో 144 స్థానాల ప్రాతినిధ్యం రావొచ్చు. అయితే ప్రాతినిధ్యం పెరిగినట్లు కనిపించిన శాతం పరంగా



24శాతం నుంచి 19శాతానికి తగ్గుతుంది. జనాభా పెరుగుదలను సమర్థవంతంగా నియంత్రించలేని ఉత్తరాది రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్లో 40స్థానాలు, బీహార్లో 30 స్థానాలు, మధ్యప్రదేశ్‌లో 18స్థానాలు, రాజస్థాన్లో 19స్థానాలు, మహారాష్ట్రలో 20స్థానాలు పెరిగి మొత్తంగా ఉత్తరాది రాష్ట్రాల్లో ప్రాతినిధ్యం 60శాతానికి పెరగవచ్చు. జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలు నష్టపోనుండగా జనాభా నియంత్రించలేని ఉత్తరాది రాష్ట్రాలు డిలిమిటేషన్‌వల్ల లాభపడనున్నాయి. ఈ చర్య ఏరకంగా సహేతుకం? జనాభాను నియంత్రించి అభివృద్ధి సాధిస్తూ దేశ జీడిపికి గణనీయంగా తోడ్పడుతున్న దక్షిణాది రాష్ట్రాలకు నష్టం చేకూరుస్తూ, జనాభాను సమర్థవంతంగా నియంత్రించలేని దేశ అభివృద్ధికి ఆశించిన స్థాయిలో తోడ్పడని ఉత్తరాది రాష్ట్రాలకు లాభం చేకూర్చడమా?. ఇదెక్కడి న్యాయం? ప్రస్తుత జనాభా ప్రకారమే డీలిమిటేషన్ చేపడితే అది సమైక్య వ్యవస్థ స్ఫూర్తిని దెబ్బతీసే అవకాశం ఉంది. దక్షిణాది ప్రాంతీయ పార్టీలను ఈ చర్య బలహీనపరుస్తూ ఉత్తరాది జాతీయ పార్టీలకు పరోక్షంగా తోడ్పడవచ్చు. రాష్ట్రాల మధ్య నిధుల కేటాయింపుల్లో దక్షిణాది రాష్ట్రాలు వివక్షతకు గురికావాల్సివస్తుంది. ఆ చర్య సుపరిపాలనను నిరుత్సాహపరచవచ్చు. ప్రస్తుత జనాభా ప్రకారమే డీలిమిటేషన్ చేపడితే ఆర్థికసంఘం కూడా రాష్ట్రాలకు నిధుల కేటాయింపుల్లో జనాభాను ఒక ప్రామాణికంగా తీసుకొని దక్షిణాది రాష్ట్రాలకు కేంద్ర నిధుల్లో కోత విధించవచ్చు. దక్షిణాది రాష్ట్రాలు దేశ జిడిపికి ఎక్కువ ఆదాయాన్ని సమకూర్చుతూ కేంద్ర నిధుల కేటాయింపుల్లో తక్కువ ఆదాయాన్ని పొందుతున్నాయి. అది ఇంకా బలంగా కొనసాగవచ్చు. ఇప్పటికే ఉన్న ఉత్తరాది రాజకీయ పార్టీల ఆధిపత్యం ఇంకా బలంగా తయారు కావచ్చు. దక్షిణాది రాష్ట్రాలకు పార్లమెంటులో సరైన ప్రాతినిధ్యం లేదని భావిస్తూ ఏర్పాటు వాదం వైపు అడుగులు వేయవచ్చు. ఈ చర్య దేశ ఐక్యతకు, ప్రజాస్వామ్య పరిపుష్టికి నిరోధకంకావచ్చు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 82,170 ప్రకారం డీలిమిటేషన్ ద్వారా ప్రాతినిధ్యం పెరగాల్సిందే. కానీ దానికి తీసుకోనున్న ప్రామాణికాలు సహేతుకంగా ఉండాలి. జనాభా ఒక అంశమే గాని, అదే నిర్ణయాంశం కాకూడదు. జనాభాతోపాటు దేశాభివృద్ధిలో రాష్ట్రాలవాట, విద్యా వైద్యరంగాల ప్రగతిలో రాష్ట్రాల సూచి, మహిళా సాధికారతలో రాష్ట్రాల సూచి, భౌగోళిక అంశాల ప్రాధాన్యత మొదలైన అంశాలని పరిగణనలోకి తీసుకోవాలి. లేదా ప్రస్తుతమున్న ప్రాతినిధ్య శాతంలో మార్పు లేకుండా పార్లమెంట్‌లో స్థానాలు పెంచాలి. లేదా రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించే రాజ్యసభ స్థానాల్లోనైనా దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని పెంచే ప్రత్యేక ఏర్పాట్లు అయిన ఉండాలి. లేదా జనాభా నియంత్రణలో ఉత్తర, దక్షిణాది రాష్ట్రాలు సమాన స్థాయిలు చేరేవరకు 1976 జనాభా లెక్కల ఆధారంగానే ప్రస్తుతం డీ లిమిటెషన్ జరపాలి. డీలిమిటేషన్ ఐక్యతకు దోహదం చేయాలి. డీలిమిటేషన్ దేశంలో ప్రాతినిధ్యం పెంచలేగాని ప్రాంతీయ విభేదాలను సృష్టించరాదు. పెరిగే ప్రాతినిధ్యం ప్రాంతాల మధ్య సమస్యలు పరిష్కరించాలేగాని, ప్రోత్సహించరాదు. ప్రాతినిధ్యం దేశ ప్రజల మధ్య ఐక్యతను బలపరచాలేగాని, బలహీన పరచరాదు. కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలు, అన్ని ప్రాంతాలు, అన్ని పార్టీల ఏకాభిప్రాయం మేరకు సహేతుకమైన ప్రామాణికాలతో డీలిమిటేషన్ ప్రక్రియను చేపట్టి ప్రాతినిధ్య ప్రజాస్వామ్యానికి పరిపుష్టి చేకూర్చాలి. •

# వ్యవసాయాభివృద్ధికి నూతన ప్రణాళికలు

## తెలంగాణ రైతులకు డిజిటల్ వ్యవసాయం

### ఇండో-జర్మన్ బృందంతో వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** భారత్-జర్మనీ ప్రభుత్వాల సహకారంతో వ్యవసాయ రంగం అభివృద్ధికి నూతన ప్రణాళికలు చేపట్టాల్సిన అవసరం ఉందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ నూతన ఆవిష్కరణ కేంద్రం (ఎజిహెచ్‌యుబి) డిజిటల్ వ్యవసాయంపై దృష్టి సారించి, తెలంగాణ రైతులను ఆధునిక వ్యవసాయం సాంకేతికతలను వినియోగించే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఇండో-జర్మన్ ప్రాజెక్టుల బృందం సభ్యులు హైదరాబాద్ సచివాలయంలో గురువారం మంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో పండించే పంటలు అంతర్జాతీయ ఎగుమతి ప్రమాణాలకు అనుగుణంగా పండించేవిధంగా రైతులను ప్రోత్సహించాలపి బృందానికి సూచించారు. దీనివలన ఎగుమతులు పెరిగి రైతులకు అధిక ధరలు పొందుతారన్నారు. దీనికి జర్మనీ ప్రభుత్వంతో కలిసి వ్యవసాయ అనుబంధ శాఖ, ఎజిహెచ్‌యుబి, వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా ప్రాసెసింగ్ యూనిట్లు, ఎగుమతి అవకాశాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను అందించే అవకాశాలను పరిశీలించాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. డిజిటల్ వ్యవసాయాన్ని తెలంగాణ రైతులకు అందించేందుకు పనిచేయలన్నారు. నూతన వ్యవసాయ పద్ధతులు, ఆధునిక యంత్రాలు ఉపయోగించడం ద్వారా కూలీల కొరతను అధిగమించడమే కాకుండా, అధిక దిగుబడులు రైతులు పొందే విధంగా సాంకేతికతను అనుసంధానం చేయాలన్నారు.

ప్రస్తుతం జర్మన్ సహకారంతో రాజస్థాన్, ఒడిశా, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలలో ప్రగతిలో ఉన్న వివిధ ప్రాజెక్టలను అధ్యయనం చేసేందుకు రాష్ట్రం నుండి ఒక బృందాన్ని అక్కడకు పంపాలని చెప్పారు. తెలంగాణ రైతులను కూడా అక్కడికి పంపించి వారికి శిక్షణ ఇచ్చి, పంట ఉత్పత్తులను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉత్పత్తి చేసి, ఎగుమతి చేసే విధంగా చూడలన్నారు. సాంకేతికతలను ఉపయోగించి అధిక దిగుబడి, ఆహార ప్రాసెసింగ్, మార్కెట్ లింకేజెస్ వంటి అంశాలను అభివృద్ధి చేయాలని సూచించారు.

# మహబూబ్‌నగర్‌లో బైపాస్ రోడ్డు నిర్మించండి

## కేంద్రమంత్రిని కలిసిన ఎంపి డికె అరుణ, ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి



కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీకి వినతిపత్రం అందజేస్తున్న ఎంపి డికె అరుణ, ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో మార్చి 20, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బైపాస్ రోడ్‌ను నిర్మించాలనికేంద్ర రోడ్డు రవాణా రహదారులు శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ఢిల్లీలోని వారి కార్యాలయంలో మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మహబూబ్ నగర్ ఎంపి డికె అరుణతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బైపాస్ రోడ్ ఆవశ్యకతను కేంద్రమంత్రికి ఎమ్మెల్యే వివరించారు. గతంలో మున్సిపాలిటీగా ఉన్న మహబూబ్‌నగర్ ఇప్పుడు మున్సిపల్ కార్పోరేషన్‌గా రూపాంతరం చెందిందని, అలాగే ఎన్నో నూతన విద్యాసంస్థలు, యూనివర్సిటీలు జిల్లా కేంద్రంలో ఏర్పాటు అవుతున్నాయని, మహబూబ్‌నగర్ పట్టణానికి కేవలం ప్రధాన రహదారి ఒక్కటే ఉండడం, పెద్దపెద్ద వాహనాలు సైతం పట్టణంలో నుంచే వెళ్ళడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్నాయని ఆయన వివరించారు. మహబూబ్ నగర్ పట్టణ జనాభా కూడా అధికంగా ఉండడంతో సాధారణ వాహనాల రద్దీ అధికంగా అవుతుందని ఆయన కేంద్ర మంత్రికి తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయుటకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఎసిబి వలలో ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్

## రూ.20 వేలు డిమాండ్.. పట్టుకున్న అధికారులు

**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :** ఎసిబి ట్రాప్‌లో స్టేషన్‌ఘన్‌పూర్ ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ పర్వతం రామకృష్ణతోపాటు మరో నిందితుడు ప్రైవేటు సహాయకుడైన ఎదునూరి రమేష్‌ను అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా గురువారం పట్టుకున్నారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. ఇంటి రిజిస్ట్రేషన్‌కోసం రూ.20వేలు లంచం డిమాండ్ చేయగా బాదితులు ఏసీబీని ఆశ్రయించినట్లు తెలిపారు. ఈమేరకు ఏసీబీ అధికారుల సూచనమేరకు గురువారం ఫిర్యాదు దారునుంచి రూ.20వేలు తీసుకుంటుండగా పట్టుకున్నట్లు తెలిపారు. కాగా, వీరిని అరెస్టుచేసి ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచినట్లు, కేసు విచారణలో ఉన్నట్లు తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ ఉదోయగి లంచం డిమాండ్ చేసినట్లయితే చట్టప్రకారం చర్య తీసుకోవడానికి ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064ను సంప్రదించాలని తెలిపారు.

# వరంగల్ బల్దియాకు రూ,1071.48 కోట్ల బడ్జెట్ ఆమోదం



## రూ.1071.48 కోట్ల అంచనాలతో బల్దియా బడ్జెట్ ఆమోదించిన కౌన్సిల్

**వరంగల్ బ్యూరో, ప్రభాతవార్త:** వరంగల్ మహానగరపాలక సంస్థకు సంబంధించిన 202526 సంవత్సరానికి గాను ముసాయిదా బడ్జెట్ రూ.1071 కోట్ల 48 లక్షల అంచనాలను మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన గురువారం పాలక వర్గం ఆమోదించింది. ఈ సమావేశంలో 1/3 కోరం హాజరైన తదుపరి బడ్జెట్ సమావేశం ప్రారంభించగా బల్దియా అకౌంట్స్ అధికారి సరిత బడ్జెట్ అంచనాలను వెల్లడించారు. రూ.1071 కోట్ల 48 లక్షల అంచనాలతో రూపొందించిన బడ్జెట్ కు సభ్యులు ఏకగ్రీవంగా అంగీకారం తెలపడంతో పాలక వర్గం బడ్జెట్ ను ఆమోదించింది. ఇందులో రూ.337 కోట్ల 38 లక్షలు సాధారణ పన్నుల ద్వారా, రూ.728 కోట్ల 10 లక్షలు వివిధ గ్రాంట్ల ద్వారా, రూ 600 కోట్లు డీపాజిట్లు, అడ్వాన్సుల ద్వారా సమకూరుతుందని అంచనా వేశారు.

**మొక్కుబడిగా బల్దియా బడ్జెట్ సమావేశం**

రాష్ట్ర రాజధాని తర్వాత రెండవ రాజధానిగా ఎదుగుతున్న గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం సాదాసీదాగా మొక్కుబడిగా సాగింది. మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైన బడ్జెట్ సమావేశం కేవలం ఒక గంట మాత్రమే కొనసాగి ఒంటిగంటకు ముగిసింది. బడ్జెట్ పద్దులపై పెద్దగా చర్చ జరపలేదు. ప్రధాన ప్రతిపక్షాలైన టిఆర్ఎస్ బిజెపిల నుండి ఒక్కరికి మాత్రమే అవకాశం దక్కింది బిజెపి నుండి కార్పొరేటర్ చాడ స్వాతి, బిఆర్ఎస్ నుండి ఇండ్ల నాగేశ్వరరావుకు మాత్రమే అవకాశం ఇచ్చారు. వారికి కూడా బడ్జెట్ పై మాత్రమే ప్రసంగించాలని మేయర్ హుకుం జారీ చేశారు. బడ్జెట్ కేవలం అంకెల గారడీ అని గత బడ్జెట్ పూర్తిగా అమలు చేయకుండానే కొత్త బడ్జెట్ను ఆమోదించడం ఆమోదయోగ్యం కాదని కనీసం బడ్జెట్ పై చర్చ కు లేకుండానే ఆమోదించడం సరైన పద్ధతి కాదని బిఆర్ఎస్ కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వరరావు అసంతృప్తి వ్యక్తం చేశారు.

**నాసిరకం రోడ్లపై ప్లకార్డులతో బిజెపి నిరసన**

స్మార్ట్ సిటీ కింద కోట్ల రూపాయల నిధులు ఖర్చుపెట్టి నగరంలో బల్దియా ఆధ్వర్యంలో వేస్తున్న అంతర్గత రోడ్లు వారంరోజులకే పగుళ్లు పడుతున్నాయని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని బిజెపి కార్పొరేటర్లు ప్ల కార్డులతో నిరసన వ్యక్తం చేశారు. రూ,1071.48 లక్షల అంచనాలతో రూపొందించిన బడ్జెట్‌లో బల్దియా వాస్తవ ఆదాయం 337.38 కోట్లు మాత్రమే మిగతా దాదాపు 700 కోట్లు వివిధ గ్రాంట్లు డిపాజిట్ల రూపంలో ఆదాయం వస్తే తప్ప బడ్జెట్ పూర్తిగా అమలుకాని పరిస్థితి. బడ్జెట్‌పై అటవీ పర్యావరణ దేవదాయశాఖ మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ సర్వతోముఖాభివృద్ధియే ధ్యేయంగా 2025 26 సంవత్సరపు బల్దియా మహాబడ్జెట్‌ను 1071.48 కోట్ల రూపాయలతో ప్రవేశపెట్టి ఆమోదించుకోవడం జరిగిందన్నారు. ఈ అభివృద్ధిలో మనమందరం భాగస్వాములు కావాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ నగరంపై ప్రత్యేక దృష్టి సారించి నగరాన్ని అన్నివిధాలా సుందరంగా తీర్చిదిద్దాలనే సదుద్దేశంతో టెల్‌పార్క్, విమానాశ్రయం, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, స్ట్రాంగ్ వాటర్ డ్రైన్, ఇన్నర్‌రింగ్‌రోడ్, ఔటర్ రింగ్ రోడ్ల ఏర్పాటుకు శరవేగంగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు. రాజకీయాల కతీతంగా వరంగల్ నగరాభివృద్ధికి అందరు సమష్టిగా కృషి చేయాలని కోరారు.

# వైద్య సేవల బలోపేతానికి సమగ్ర ప్రణాళిక

## పేదలకు అన్నిరకాల డయాగ్నస్టిక్ సేవలు అందుబాటులో..

### అధికారుల సమీక్షలో మంత్రి దామోదర రాజనర్సింహా

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వైద్య సేవల బలోపేతానికి సమగ్ర ప్రణాళికను రూపొందిస్తున్నట్టు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ అధికారులకు స్పష్టం చేశారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో అధునాతన సౌకర్యాల కల్పనకు సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తామని.. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరిపడా హెచ్ఆర్, ఎక్విప్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డ్రగ్స్, శానిటేషన్‌లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలిగేలా బ్రాండింగ్ చేయాలన్నారు. అన్ని రకాల డయాగ్నస్టిక్ సేవలు పేద ప్రజలకు అందుబాటులో ఉండేలా సమగ్ర ప్రణాళికను రూపొందిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు.

రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల బలోపేతానికి సమగ్ర ప్రణాళిక రూపకల్పనపై హైదరా బాదులోని ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో మంత్రి దామోదర రాజ నర్సింహ గురువారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సమీక్షలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తూ, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆర్‌వి కర్ణన్, టిజిఎంఎస్ఐడిసి ఎండి హేమంత్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్, టివివి కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ పాల్గొన్నారు. టూల్స్ అండ్ ప్లాంట్స్ నిర్వహణ కోసం అన్ని హాస్పిటళ్ల సూపరింటెండెంట్లకు నిధుల కేటాయించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. జవాబుదారీతనం ఉండే విధంగా ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ ఆసుపత్రి సూపర్నిటెండెంట్‌లపై ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత సంవత్సర కాలంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఐపీ, ఓపీ, ఇతర సర్జరీల సంఖ్య పెరిగిందని...అన్ని ఆసుపత్రుల్లో సరిపడా డాక్టర్లు, నర్సింగ్ సిబ్బందిని త్వరలోనే నియమిస్తామని మంత్రి తెలిపారు.

వైద్యవిధాన పరిషత్‌ను డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్‌గా మారుస్తామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, పల్లె దవాఖాన, పట్టణ దవాఖాన, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో నిర్ధారించిన అన్ని రకాల వైద్య సేవలు విధిగా అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

90 శాతం వైద్య సేవలు జిల్లా స్థాయిలోని ప్రభుత్వ హాస్పిటళ్లలోనే అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. రిఫరల్ సిస్టమ్ ద్వారా టీచింగ్ హాస్పిటళ్లకు పేషెంట్లను అనుమతించడం ద్వారా గాంధీ, ఉస్మానియా, నిమ్స్ వంటి హాస్పిటళ్లపై ఒత్తిడి తగ్గిస్తామనిసూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో డ్యూటీ హావర్స్‌లో డాక్టర్లు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకుంటామని మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు.

# మోడీ ప్రభుత్వం యుజిసి బిల్‌ను వెనక్కి తీసుకోవాలి

## 24న పార్లమెంట్ ముట్టడి పోస్టర్ విడుదల చేసిన వెంకటస్వామి

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం యుజిసి బిల్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు వెంటకస్వామి డిమాండ్ చేశారు. గురువారం గాంధీభవన్‌లో మార్చ్ 24న పార్లమెంట్ ముట్టడి పోస్టర్‌ను గాంధీ భవన్‌లో ఆవిష్కరించించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ మోడి ప్రభుత్వం బిల్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. అందుకే మార్చ్ 24 న ఎన్ఎ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పార్లమెంట్ ముట్టడి కార్యక్రమం చేపట్టామన్నారు. తెలంగాణ నుండి 400 మంది డిల్లికి వెళుతున్నామని, బిజెపి యూజిసిని గ్రిప్‌లో పెట్టుకోవాలని చూస్తుందన్నారు. కులగణన జరిగిన తర్వాత రాష్ట్రంలో అట్టడుగు వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. బిసిలకు విద్యలో, ఉద్యోగాలలో 42శాతం రిజర్వేషన్ తీసుకరావడం చరిత్రలో గొప్ప నిర్ణయం అన్నారు. ఎస్సి వర్గీకరణను చేసిన సిఎం రేవంత్ రెడ్డి చరిత్ర పుటల్లోకి ఎక్కారన్నారు. 20 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని మోడీ యువతను మోసం చేశాడన్నారు. యువ వికాసం పథకాన్ని అన్ని యూనివర్సిటీలు కాలేజీలకు తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేసేందుకు ప్రణాళికను రూపొందించామని అన్నారు. ప్రభుత్వ పథకాలతో పాటు ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్‌లను అందించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ఓయూలో మనువాదులు ప్రజా ప్రభుత్వంపై తీసుకొచ్చిన సర్క్యులర్‌ను వ్యతిరేకిస్తుందన్నారు. అన్ని రాష్ట్రాల్లో విద్యాలయాలలో ఎన్నికలు జరగాలన్నారు. విద్యార్థులలో చైతన్యం తీసుకరావాలని ఎన్ఎస్‌యుఐ ముందుకు పోతుందని, జై భీం,జై బాపు,జై సంవిధాన్‌ను గ్రామ గ్రామానికి తీసుకపోతున్నామని తెలిపారు. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో చర్చించి తీర్మానం చేసామని, 11 వేల కోట్లు గురుకులాలకు బడ్జెట్‌లో కేటాయించడం చాలా సంతోషంగా ఉందని, 58 ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ప్రభుత్వం నిర్మిస్తుందన్నారు.

## ఎండిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని

# రైతు నిరసన దీక్ష

### పాల్గొన్న మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

### దీక్షా శిబిరం వద్ద పురుగుమందు డబ్బాతో రైతు ఆత్మహత్యాయత్నం



**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :** జనగామ జిల్లా దేవరుప్పుల మండలకేంద్రంలోని రైతు నిరసన దీక్షా కార్యక్రమంలో గురువారం ఎండిన పంట పొలాలకు ఎకరానికి రూ.25వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ రైతు నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొన్నారు. సాగునీరు లేక పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారికి న్యాయం చేయాలని ఈసందర్భంగా దయాకర్‌రావు డిమాండ్ చేశారు.

కాగా, దీక్షా శిబిరం వద్ద దేవరుప్పుల మండలం పెద్దమడూరుకు చెందిన దాశరథం అనే రైతు మాట్లాడుతూ రైతుల పంట పొలాలు ఎండిపోతున్నాయని, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకొని నష్టపోయిన రైతులకు నష్టపరిహారంగా 25వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గం లో ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యే ఏసీ రూముల్లో ఉంటూ రైతుల బాధలను పట్టించుకోవడం లేదని, గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉన్న దయాకర్‌రావు హయాంలో ఇలాంటి బాధలు లేవని తన ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పుడున్న ప్రభుత్వంపట్ల రైతులు ఆత్మహత్యలకు పాల్పడాల్సిన పరిస్థితి వచ్చిందంటూ తన బాధను ధర్నాలో వివరిస్తూ ఒక్కసారిగా తాను తీసుకొచ్చిన పురుగుల మందు డబ్బాతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. దీంతో అక్కడే ఉన్న బీఆర్ఎస్‌పార్టీకి చెందిన కొందరు నాయకులు రైతును అడ్డుకుని అతడి చేతిలోని పురుగుమందు డబ్బాను తీసుకున్నారు. అనంతరం మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నష్టపరిహారం వచ్చేలా చేస్తానని, ప్రభుత్వంతో మాట్లాడి మీకు న్యాయం చేసేలా చూస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# మరింత ఉత్సాహంగా పనిచేయాలి

## కొత్తగా ఎన్నికైన బిజెపి ఎమ్మెల్సీలతో కేంద్రమంత్రి అమిత్‌షా

### ఢిల్లీలో కలిసిన ఎమ్మెల్సీలు మల్క కొమరయ్య, అంజిరెడ్డి

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిజెపి తరపున గెలిచిన ఎమ్మెల్సీలు మరింత ఉత్సాహంగా పనిచేయాలని బిజెపి సీనియర్ నేత, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సూచించారు. రాష్ట్రంలో ఫిబ్రవరి 27న జరిగిన కరీంనగర్- మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్ టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచిన బిజెపి ఎమ్మెల్సీలు మల్క కొమరయ్య, అంజిరెడ్డిలు గురువారం ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిశారు.

కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ నేతృత్వంలో కొత్తగా గెలిచిన ఎమ్మెల్సీలు ఢిల్లీలో అమిత్ షాను కలిశారు. హోం మంత్రిని కలిసిన వారిలో బిజెపి ఎంపీలు ధర్మపురి అరవింద్, రఘునందన్ రావు, డీకే అరుణ, గోడం నగేశ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు కె.లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు ఉన్నారు.

కేంద్ర హోం మంత్రి అమిత్ షాకి శాలువా కప్పి బొకెను అందజేసి మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీలుగా గెలిచిన వారిని అమిత్ షా అభినందించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లేలా ఉత్సాహంగా పనిచేయాలని అమిత్ షా సూచించారు.

# ముగిసిన ఇంటర్ ప్రధాన పరీక్షలు

## రేపటి నుంచి ప్రారంభం కానున్న మూల్యాంకనం

### 19 కేంద్రాల్లో కొనసాగనున్న స్పాట్ వాల్యుయేషన్

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ నెల 5 నుంచి ప్రారం భమైన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో ప్రధాన పరీక్షలు గురువారంతో ముగిశాయి. ఈ నెల 25తో బ్రిడ్జి కోర్సులకు చెందిన పరీక్షలతో మొత్తం ఇంటర్ పరీక్షలు ముగియనున్నాయి. రేపటి(మార్చి 22) నుంచి ఇంటర్ జవాబుపత్రాల మూల్యాంకంనం ప్రారంభం కానుంది. గురువారం జరిగిన సెకండియర్ కెమిస్ట్రి పేపర్-2, కామర్స్ పేపర్-2 పరీక్షలకి 14 మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదైనట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. గురువారం జరిగిన ఇంటర్ పరీక్షలకి 97.13 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. సెకండియర్ పరీక్షలకి 4,44,697 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 4,31,964 మంది హాజరయ్యారు. మరో 12,733 మంది పరీక్షలకు హాజరు కాలేదు. గురువారం జరిగిన పరీక్షలకి సెట్ బి పేపర్‌ను ఎంపిక చేశారు. రాష్ట్రంలో కరీంనగర్, నిజామాబాద్, సిద్ధిపేట జిల్లాల్లో ఒక్కో మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాగా.. సూర్యాపేటలో అత్యధికంగా 11 మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయి. ఇంటర్ బోర్డు నుంచి అబ్జర్వర్స్‌ను సూర్యాపేట, మెదక్, కరీంనగర్, సంగారెడ్డి, హైద రాబాద్ జిల్లాలకు పంపించినట్టు బోర్డు కార్యదర్శి తెలిపారు.

## కేంద్రమంత్రి బండి సంజయ్‌కు

# హైకోర్టులో భారీ ఊరట.. కేసు కొట్టివేత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 18:** కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కు హైకోర్టులో భారీ ఊరట లభించింది. బండి సంజయ్‌పై నమోదైన కేసును హైకోర్టు కొట్టేసింది. జీహెచ్ఎంసీ ఎన్నికల సమయంలో ప్రచారంవేళ బండి సంజయ్‌పై కేసు నమోదైంది. కార్యకర్తల భేటీలో భాగంగా బండి సంజయ్ మత విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడారని కొందరు వ్యక్తులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై సికిందరాబాద్ మార్కెట్ పోలీసులు కేసు నమోదు చేసి, ఛార్జ్ షీట్ కూడా దాఖలు చేశారు.

అయితే దీనిపై గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ కేసులో కేంద్రమంత్రి తరపు న్యాయవాది మాట్లాడుతూ.. బండి సంజయ్ మతవిద్వేషాలు రెచ్చగొట్టారని చెప్పడానికి ఎటువంటి ఆధారాలులేవని, ఆధారాలు లేకుండానే బండి సంజయ్‌పై అభియోగంమోపి కేసునమోదు చేశారని కోర్టుకు వివరించారు. దీంతో ఆధారాలు లేకుండా కేసు నమోదు చేశారన్న కారణంతో కేసును కొట్టివేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి ప్రకటించారు.

# 10వ తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు

## బిసి సంక్షేమం, రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నేటి(శుక్రవారం) నుంచి జరగనున్న 10వ తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం పక్షాన 10వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థినీ, విద్యార్థులకు శుభాకాంక్షలు, అభినందనలు, ఆశీర్వాదాలన్నారు. విద్యార్థులు ఎవరూ కూడా ఆందోళనకు గురికాకుండా.. ఒత్తిడి లేకుండా పరీక్షలకు హాజరు కావాలని మంత్రి సూచించారు. మీరందరూ జీవితంలో ఏ పరీక్షలు రాసిన.. ఏ ఉన్నత శిఖరాలకు వెళ్లిన 10వ తరగతి పరీక్షల మార్కుల మెమో ముఖ్యమైందన్నారు. అందరూ కష్టపడి చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. పిల్లలు చదువుకోవడానికి మంచి అవకాశం ఇచ్చి పిల్లల ఉజ్వల భవిష్యత్‌కు తోడ్పడాలన్నారు. విద్యార్థులు పరీక్షలు బాగా రాయాలని ప్రభుత్వం పక్షాన ఆశీర్వాదం అందిస్తున్నట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# 'దబిడ దిబడ' పాట డాన్స్‌స్టెప్స్‌పై రాష్ట్ర మహిళా కమిషన్ సీరియస్

**హైదరాబాద్ (బేగంపేట) మార్చి 20, ప్రభాతవార్త:** 'దబిడ దిబడ' పేరుతో రూపొం దించిన తెలుగుపాటపై రాష్ట్ర మహిళా కమిషన్ సీరియస్ అయింది. ఇలాంటి పాటల చిత్రీకరణ చెయ్యొద్దంటూ సినిమా ఇండస్ట్రీకి హెచ్చరిక చేసింది. తెలుగు సినిమాపాటల్లో మహిళలతో అసభ్యకరంగా డాన్స్ చేస్తూ చూపించారని వచ్చిన ఫిర్యాదులను ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద నేతృత్వంలోని రాష్ట్ర మహిళా కమిషన్ పరిశీలించింది. అటువంటి కంటెంట్‌ను ప్రోత్సహించవద్దని నిర్మాతలు, కొరియో గ్రాఫర్లను హెచ్చరించారు. ఇలాగే కొనసాగిస్తే సంబంధిత చట్టాల ప్రకారం కఠిన మైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ అంశంపై కమిషన్ తీవ్రంగా హెచ్చరించింది. సినిమా అనేది సమాజంపై ప్రభావం చూపే శక్తివంతమైన మాధ్య మం కావడంతో ఇందులో మహిళలను అవమానించే లేదా అసభ్యకరంగా చూపిం చే అంశాలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయ న్నారు. ఈ అంశంపై ప్రజలు సామాజిక సంస్థలు తమ అభిప్రాయాలను మహిళా కమిషన్‌కు తెలియ జేయ వచ్చున్నారు. ఈ విషయంపై నిశితంగా పరిశీలన కొనసాగిస్తూ అవసరమైన మరిన్ని చర్యలు తీసుకుంటామన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
రామాయంపేట మునిసిపల్ కౌన్సిల్ కార్యాలయం
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన

1) e-NIT Nos.E1/MCR/పైన CC రోడ్లు పునర్నిర్మాణంగా వేయుట/SDRF 2024-25, పనుల సంఖ్య: 12. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 21.03.2025 ఉ.10.30 గం. వర్క. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ముగింపు తేది: 28.03.2025 సా.5.30 గం. వర్క. ప్రైస్ బిడ్ తెరుచు తేది (ఫైనాన్షియల్ బిడ్ స్టేజ్) 28.03.2025 సా.5.35 గం. వర్క. గమనిక: టెండర్‌కు సంబంధించిన సవివర సమాచారం Tender.telangana.gov.in యొక్క వెబ్‌సైట్ పై పొందవచ్చును. మరి ఏ ఇతర సమాచారానికి అయినా రామాయంపేట మునిసిపాలిటీ కమిషనర్ మరియు ఇంజనీర్, ఫోన్ సం. 7989695428, 9948296849.

సం/- కమిషనర్, రామాయంపేట మునిసిపాలిటీ
DIPR.No.11824-PP/CL/Advt/1/2024-25,తేది: 20.03.2025



పురపాలక సంఘ కార్యాలయము - దమ్మాయిగూడ
మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా
వేలము ప్రకటన
తేది: 19/03/2025

విషయము: దమ్మాయిగూడ పురపాలక సంఘ పరిధిలో 2025-26 సంవత్సరమునకు తాయి బజార్ ఫీజు నిర్వహణ నిమిత్తం వేలము ప్రకటన జారీ చేయుట.

పై విషయము ప్రకారం దమ్మాయిగూడ పురపాలక సంఘము పరిధిలో ఈ క్రింద చూపబడిన కాలనీలలో 2025-26 (1/4/2025 నుండి 31/03/2026 వరకు గల కాల పరిమితికి) సంవత్సరము తై బజార్ నిర్వహించుట కొరకు మునిసిపల్ కమిషనర్ శ్రీమతి A. నాగమణి గారి సమక్షములో తేది: 25.03.2025 మంగళవారము రోజున ఉదయం గం.11.30 ని.లకు మునిసిపల్ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలము నిర్వహించబడును.

క్రమ సంఖ్య, వారము, తై బజార్ నిర్వహించుటకు కాలనీ వివరములు: 1) ఆదివారము: దమ్మాయిగూడ పరిధిలోని వికాస్ నగర్ కాలనీలలో. 2) సోమవారము: అహ్మద్‌గూడ గ్రామములో. 3), 4) మంగళవారము: ప్రజాసాయి గార్డెన్స్, అహ్మద్‌గూడలో. మారుతి నగర్ కాలనీ, దమ్మాయిగూడ. 5), 6) బుధవారము: దమ్మాయిగూడ పరిధిలోని సాయిశ్రీనివాస నగర్ కాలనీలలో, ప్రగతి నగర్ కాలనీ, దమ్మాయిగూడ. 7), 8) గురువారము: సైలెంట్ ఎవెన్యూ, దమ్మాయిగూడ, కుందన్‌పల్లి. 9) శుక్రవారము: దమ్మాయిగూడ పరిధిలోని దమ్మాయిగూడ గ్రామ కంఠం మసీదు రోడ్డులో. 10) శనివారము: రాజీవ్ గృహ కల్ప కాలనీలో. 11) మునిసిపల్ పరిధిలో ప్రతిరోజు: దమ్మాయిగూడ మెయిన్ రోడ్డు (అయ్యప్ప కాలనీ). 12) కీసర: సోమవారము. 13) తిమ్మాయిపల్లి: సోమవారము. 14) యాద్గార్‌పల్లి: శనివారము. 15) చీర్యాల: బుధవారము.

ఈ దిగువ పేర్కొనిన నిబంధనలకు లోబడి వేలములో పాల్గొనవలసియుండును.

1. తేది 24/03/2025 నుండి తేది 25/03/2025 ఉదయం గం.10.30 ని వరకు కార్యాలయ పని వేళలో రూ.1,000/- దరఖాస్తు చెల్లించి దరఖాస్తు ఫారమును పొందగలరు. 2. పురపాలక సంఘమునకు ఎలాంటి బకాయి ఉన్న యెడల అట్టి వ్యక్తి వేలము నందు పాల్గొనుటకు వీలు లేదు. 3. వేలములో పాల్గొనే వారు వేలం పాట. 4. పాడుటకు ధరావత్తుగా రూ.1,50,000/- డ్రాఫ్ట్ / చలాన / నగదుగా చెల్లించి వేలములలో పాల్గొన వలసియుండును. 5. ఇట్టి వేలము యొక్క ప్రభుత్వ పాట రూ.30,25,000/-. 6. వేలందారు విధిగా మునిసిపల్ పరిధిలో నిర్వహించబడు సంత దినము మార్కెట్ నడుపబడు స్థలము నందు చేయబడు దుకాణములపై మార్కెట్ ఫీజు వసూలు చేయబడవలయును. 7. వేలము పాట పాడిన వారి ధరావత్తు సొమ్ము వేలము పూర్తి కాబడిన రోజు నుండి 15 రోజులలో తిరిగి చెల్లించబడును. 8. వేలముదారు వేలము పూర్తికాబడిన వెంటనే వేలము యొక్క మొత్తము సొమ్ములో 1/4వ వంతు చెల్లించవలెను. ఒప్పంద పత్రము వ్రాయించే వరకు వేలము దారుడుకి ఫీజు వసూలు చేయు అధికారము లేదు. అంత వరకు మునిసిపల్ సిబ్బందిచే ఫీజు వసూలు చేయించబడును. అట్టి డబ్బులు వేలం దారుడికి ఇవ్వబడవు. వేలందారుడు ఇట్టి అగ్రిమెంటుకు లోబడి ఇచ్చిన సమయములో అగ్రిమెంటు చేయించుకొనగలరు. అగ్రిమెంట్ సమయములో 6 నెంబర్లు ఖాళీ చెక్కులు మునిసిపల్ కార్యాలయమునకు ఇవ్వవలెను. 9. ధరావత్తు చేసిన సొమ్ము వేలములన్నియు పూర్తి కాబడి తదుపరి మాత్రమే తిరిగి వేలముదారుకు మినహా ధరావత్తు చేసిన వారికి ఇవ్వబడును. 10. వేలము పూర్తి కాబడిన వెంటనే నిర్ణయించిన సమయము ప్రకారము డబ్బులు చెల్లించనిచో తిరిగి వేలము నిర్వహించుటకు ఏర్పాటు చేయబడును. రెండవ వేలములో మొదటి వేలము కన్నా తక్కువ మొత్తము వచ్చినచో అట్టి తక్కువ మొత్తము మొదటి వేలము దారునకు దానిపై ఎలాంటి హక్కు ఉండనేరదు. మొదటి ధరావత్తు సొమ్ము మునిసిపాలిటీ నిధికి జమ చేయబడును. కాని తిరిగి వాపస్ ఇవ్వబడదు. తదుపరి ఎలాంటి ఆక్షేపణలు చెల్లనేరవు. 11. ఎలాంటి కారణము చూపకుండా ఇట్టి వేలమును రద్దు చేయు అధికారము మునిసిపాలిటీ వారు కలిగియున్నారు. మరియు ఇట్టి వేలము విషయములో మున్సిపాలిటీ వారిదే తుది నిర్ణయము. 12. వేలము ఫీజు స్టాండుకు రూ.30/-ల చొప్పున వసూలు చేయుటకు నిర్ణయించనైనది. 13. గుత్తలు ట్రాన్స్ ఫర్ చేయుటకు గాని, తిరిగి గుత్తలు ఇచ్చుటకు గాని గుత్తేదారునికి అధికారము లేదు. 14. ప్రభుత్వ ఉద్యోగస్తులు వేలము నందు పాల్గొనుటకు అర్హత లేదు. 15. వేలము కాల పరిమితి తేది 01/04/2025 నుండి తేది 31/03/2026 వరకు ఉండును.

సం/- మునిసిపల్ కమిషనర్, దమ్మాయిగూడ పురపాలక సంఘము
DIPR.No.11786-PP/CL/Advt/1/2024-25, తేది: 20.03.2025

# సరస్వతి పుష్కరాల అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి



## ఇబ్బందులు కలగకుండా సమగ్ర ప్రణాళిక రూపొందించాలి

### దేవాదాయ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యర్

**ప్రభాతవార్త, జయశంకర్ భూపాలపల్లి బ్యూరో:** కాళేశ్వరంలో మే 15 నుండి 26వ తేదీ వరకు జరగనున్న సరస్వతి పుష్కరాల ఏర్పాట్లను దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే తదితర అధికారులు గురువారం ఇఒ కార్యాలయంలో సమీక్షించారు. పుష్కరాల సందర్భంగా భక్తుల సౌకర్యాలను మెరుగు పరిచేందుకు చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల ప్రగతిని పరిశీలించారు. సరస్వతి విగ్రహం ఏర్పాటుకు స్థలం నిర్ణయించడం, విఐపి ఘాట్ నుండి గోదావరి ఘాట్ వరకు రహదారి నిర్మాణం, పురుషులు, మహిళల కోసం శాశ్వత మరుగుదొడ్ల నిర్మాణం వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. గోదావరి హారతికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే, విఐపి ఘాట్ నుండి గోదావరి ఘాట్ వరకు చేపట్ట నున్న రహదారి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సరస్వతి పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమగ్ర ప్రణాళికతో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పూర్తిచేయాల్సిన శాశ్వత, తాత్కాలిక పనులకు ముందుగానే షెడ్యూల్ తయారు చేసుకోవాలని, సిబ్బందిని పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేసి పనుల్లో వేగం పెంచాలని సూచించారు. అంచనాల్లో వ్యత్యాసాలు చేపట్టే పనులపై నివేదికలు రెండు రోజుల్లో అందచేయాలని సూచించారు. పుష్కర సమాచారం తెలిసేలా ప్రత్యేకంగా యాప్ తయారు చేయాలని, విస్తృత ప్రచారానికి అంబాసిడర్ ను నియమించాలని తెలిపారు. పుష్కర 12 రోజుల కార్యక్రమాలకు సంబంధించి షెడ్యూల్ తయారు చేయాలని ఈఓను ఆదేశించారు. వేడి దృష్ట్యా భక్తుల సౌకర్యార్థం గోదావరిలో చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. గోదావరిలో నీని నిల్వలను పరిశీలించాలని తెలిపారు. సత్రం పనులను పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సూచించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రముఖ ప్రాంతాలలో ప్రసాదాల కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భక్తులకు సురక్షిత మంచినీరు సరఫరా చేయాలని సూచించారు. గోదావరిలోకి భక్తులు వెళ్ళకుండా ప్రమాద హెచ్చరికల బోర్డ్స్ ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు.
అంతకుముందు విఐపి ఘాట్, గోదావరి ఘాటు వద్ద చేపట్టనున్న పనులను, సత్రం పనులను పరిశీలించారు. తదుపరి ఈఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పవర్ పాయింట్ ప్రజెంటేషన్

# బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్రఅన్యాయం

## గత ప్రభుత్వ ఆనవాయితీనే కొనసాగించిన కాంగ్రెస్: ఎస్ఎఫ్ఐ

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్రఅన్యాయం చేసిందని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ విమర్శించింది. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వ అనవాతీనే కొనసాగించిందని సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7.57 శాతం నిధులను కేటాయించిందన్నారు. గత బడ్జెట్‌లో రూ. 21,292 కోట్లు కేటాయించగా .. ప్రస్తుతం రూ. 23,108 కోట్లు కేటాయించారని అన్నారు. ఈ నిధులతో ప్రస్తుతం ప్రభుత్వ విద్య ఏ మాత్రం అభివృద్ధి కాదని ఎస్ఎఫ్ఐ భావిస్తోందన్నారు.
కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేని ఫెస్టోలో పెట్టినట్లు .. ప్రతి మండలంలో తెలంగాణ మోడల్ ఇంటర్నేషనల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని చెప్పిందని.. కానీ దాని ఊసు బడ్జెట్లో లేదన్నారు. ప్రతి రెండు గ్రామాలకు ఒక గురుకులం అన్నారని.. దాని గురించి చర్చే లేదన్నారు. ఇక రాష్ట్రంలోని యూనివర్శిటీల అభివృద్ధి రూ. 450 కోట్లతో ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ప్రజా ప్రభుత్వం అంటున్న కాంగ్రెస్ .. ఈ నిధులతో ఎలా ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేస్తుందో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో గత బిఆర్ఎస్ పాలనలో యూనివర్శిటీలు దెబ్బతిన్నాయని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మెస్, భవనాలు, ఖాళీల భర్తీ, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ప్రతి యూనివర్శిటీకి అభివృద్ధికి నిధులు ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. కానీ ఆచరణలో అది జరగలేదన్నారు. ఉస్మానియాకు రూ. 1000 కోట్లు, మహిళ యూనివర్శిటీ అభివృద్ధి కోసం మరో రూ.1000 కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.
పాఠశాల విద్యారంగ లో ఖాళీలు భర్తీ, మధ్యాహ్న భోజనం నిధులు, ఏకోపాధ్యాయ పాఠశాలలు, నూతన భవనాలు, లైబ్రరీ, ముత్రశాలలు, మౌలిక సదుపాయాలు కోసం ఈ నిధులు సరిపోవన్నారు. రాష్ట్రంలో 662 పైగా గురుకులాలకు స్వంత భవనాలు లేవని, ఉన్న గురుకులాలు కూడా సరైన మౌలిక సదుపాయాలు లేవని.. స్వయంగా భట్టి విక్రమార్క ప్రకటించారని గుర్తు చేశారు.

## పరీక్షలు రాసే టెన్త్‌క్లాస్ విద్యార్థులకు మంత్రి శ్రీధర్‌బాబు ఆల్ ది బెస్ట్

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** ఆత్మ విశ్వాసం, పట్టుదల, నిరంతర శ్రమ మనల్ని విజయ తీరాలకు చేర్చే ఆయుధాలు అన్ని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో పదో తరగతి పరీక్షలు అత్యంత కీలకం. అలా అని ఒత్తిడికి గురి కావొద్దని, సమయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రశ్నలను సమగ్రంగా అర్థం చేసుకుని ప్రశాంతంగా, ధైర్యంగా రాయాలన్నారు.
అత్యుత్తమ ఫలితాలు సాధించి రాబోయే రోజుల్లో మీ ప్రతిభతో తెలంగాణకు మంచి పేరు తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. సదా మీ విజయాన్ని ఆకాంక్షిస్తూ... పదో తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థిని, విద్యార్థులకు ఆల్ ది బెస్ట్...!!! అంటూ శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

## రాష్ట్రంలో పలుచోట్ల రోడ్డుప్రమాదాలు

### ముగ్గురు మృతి, పలువురికి తీవ్రగాయాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మార్చి 20:** తెలంగాణ వ్యాప్తంగా గురువారం పలు చోట్ల రోడ్డు ప్రమాదాలు జరిగాయి. పలువురి కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. వివిధ జిల్లాల్లో జరిగిన వాహన ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందగా.. పలువురికి తీవ్రగాయాలు అయ్యాయి. మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలం కొలపల్లి గ్రామం వద్ద ఆగి ఉన్న ట్రావెల్స్ బస్సు ను డీసీఎం వాహనం వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. 11 మందికి తీవ్రగాయాలు అయ్యాయి. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు బాధితులను హుటాహుటిన జోగిపేట్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.బాధితుల్లో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.
కాగా, క్షతగాత్రులంతా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లాకు చెందిన వారిగా తెలుస్తోంది. వీరంతా మహారాష్ట్రలోని పండరిపూర్, తుల్జాపూర్ ఆలయాలను దర్శించుకుని బస్సులో తిరిగి వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. మరోవైపు కామారెడ్డి జిల్లాలోనూ ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. గాంధారిలో అర్థరాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులపైకి కారు దూసుకెళ్లింది.
పోలీసులు రోడ్డుపక్కన నిలబడి ఉండగా.. వేగంగా దూసుకొచ్చిన కారు ఇద్దరు కానిస్టేబుళ్లను ఢీకొట్టింది.ఈ ఘటనలో కానిస్టేబుల్ రవి కుమార్(40) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. సుభాశ్ అనే మరో కానిస్టేబుల్‌కి తీవ్రగాయాలు అయ్యాయి. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలంలోనూ తీవ్ర విషాదం నెలకొంది. రాజక్కపేట శివారులో ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ బోల్తాపడింది.
ఈ ప్రమాదంలో పలువురు భక్తులకు తీవ్రగాయాలు అయ్యాయి. భక్తులు రేకులకుంట ఎల్లమ్మ దర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగింది. బాధితులను సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించిన పోలీసులు చికిత్స అందింప చేస్తున్నారు. కాగా, బాధితులంతా మిరుదొడ్డి మండలం మల్లుపల్లి గ్రామస్థులుగా గుర్తించారు.



అభివాదం చేస్తున్న వడ్డెర సంఘం నాయకులు. చిత్రంలో వెంకటేష్‌మౌర్య, ఎత్తరి మారయ్య

## వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

### ఒడిఇ జాతీయ అధ్యక్షుడు వెంకటేశ్‌మౌర్య

**హైదరాబాద్ (సైఫాబాద్), మార్చి 20, ప్రభాతవార్త:** అన్ని రంగాలలో వెనుకబడిన వడ్డెర జాతి కులస్తులను తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఎస్టీ జాబితాలో చేర్చా లని, వీరి అభివృద్ధి, సంక్షేమానికి ప్రత్యేకంగా వడ్డెర కార్పోరేషన్‌లు ఏర్పాటు చేసి నిధలు కేటాయించాలని భారతీయ వడ్డెర (ఒడిఇ) సమాజ సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు డా.వెంకటేశ:మౌర్య, రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తరి మారయ్య కోరారు. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవ్యాం ధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానంచేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదికను పంపడానికి సిద్ధమైందని, ఆదేవిధంగా ప్రభుత్వం వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేధికను పంపాలని కోరారు. రాష్ట్రంలో తమ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్‌లను కేటాయించాలని, నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు సంపంగి ప్రభాకర్, డేరింగుల రూపమహేశ్వరి, కొమ్మురాజుల శేఖర్, బత్తిని రాము, దండుగుల రమేష్, దేరంగుల రామకృష్ణ పాల్గొన్నారు.

# ఇది చరిత్రలో నిలిచిపోయే బడ్జెట్




గురువారం నల్గొండ జిల్లా కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

## రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**నల్గొండ ప్రతినిధి, ప్రభాతవార్త, మార్చి20 :** అందరికీ ప్రతిఫలాలు అందించేలా బడ్జెట్‌లో ప్రయత్నించడం జరిగిందని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. గురువారం ఆయన నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. బడ్జెట్లో ఇరిగేషన్ పెద్దపీటవేయగా, అందులో నల్గొండ జిల్లా ముందుందన్నారు. నల్గొండ జిల్లాలో ఈ రబిలో లక్ష ఎకరాల ఆయకట్టు పెరిగిందని, దీని ద్వారా దాన్యం దిగుబడి పెరిగినప్పటికీ రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. బ్రాహ్మణ వెల్లెములకు బడ్జెట్లో రెండింతలు నిధులు పెంచడం జరిగిందని, బ్రాహ్మణ వెల్లములలో నీళ్ల నింపడం ద్వారా భూగర్భ జలాలు పెరిగాయని, కాలువలు, ప్రాజెక్ట పనులు పూర్తి చేసేందుకు గాను 37 కోట్ల రూపాయలను విడుదల చేయడం జరిగిందని, డిసెంబర్ నాటికి లక్ష ఎకరాలకు నీరివ్వాలన్న లక్ష్యాన్ని పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. ఎస్ఎల్ బి సీలో ప్రమాదం జరిగి 8 మంది చనిపోవడం బాధాకరమని అన్నారు. పాఠశాల విద్యలో భాగంగా 11 వేల కోట్ల రూపాయలతో 58 ఇంటిగ్రేటెడ్ పాఠశాలు ఒక్కొక్కటి 200 కోట్లతో నిర్మిస్తున్నామని, ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అన్ని వర్గాల పిల్లలకు 6 నుండి 12వ తరగతి వరకు ఉచిత విద్యను అందించడం జరుగుతుందని, ధనవంతుల పిల్లలు చదువుకున్నట్లుగానే ఈ పాఠశాలల్లో పిల్లలు చదువుకోవచ్చని స్పష్టం చేశారు. వృత్తి విద్య, ఉపాధి అవకాశాలలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఏటీసీలను మంజూరు చేయడం జరిగిందని, నల్గొండ లో 75 కోట్ల రూపాయలతో నిర్మించిన ఏటిసి లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. యువతకు ఉద్యోగ అవకాశాలలో భాగంగా స్కిల్ యూనివర్సిటీ, జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆర్ అండ్ బి బడ్జెట్లో భాగంగా 5900 కోట్లతో 12,000 కిలోమీటర్ల రోడ్లకు వచ్చేనెల 2న టెండర్లు పిలువనున్నామని తెలిపారు. నూతన హైకోర్టు భవనాన్ని, 2,700 కోట్లతో ఉస్మానియా ఆసుపత్రి నూతన భవనాన్ని నిర్మించనున్నామని చెప్పారు. రుణమాఫీ కింద నల్గొండ జిల్లాలో 2400 కోట్లు మాఫీ చేశారని అన్నారు. గతంలో ఎన్నడు లేనివిధంగా ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షనర్లకు ప్రతినెల ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం నిర్మించిన మేడిగడ్డ, కాలేశ్వరం కృంగిపోయిన విషయాన్ని గుర్తు చేశారు. బడ్జెట్‌లో ప్రస్తావించని అంశాలను సైతం తమ ప్రభుత్వం చేపడుతుందని, జిల్లాను అన్ని రంగాలలో మరింత ముందుకు తీసుకెళ్తామని, ఎస్ ఎల్ బి సి ని పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ ఉన్నారు.

# రాజీనామా చేస్తారా.. ప్రజల్లోకి వస్తారా?

## కెసిఆర్ వైఖరికి నిరసనగా కలెక్టరేట్-రాజ్‌భవన్ పాదయాత్ర

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** గజ్వేల్ నియోజకవర్గం నుంచి మాజీ సిఎం కెసిఆర్‌ను మూడు పర్యాయయాలు ఎమ్మెల్యేగా గెలిపిస్తే రెండు సార్లు సిఎం అయిన వ్యక్తిని మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజల బాగోగులను పట్టించుకోకుండా ఫాంహౌస్‌కు పరిమితం కావడం సరికాదని డిసిసి అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. ప్రజలకు సేవ చేస్తాడని మూడో సారి గజ్వేల్ ఎమ్మెల్యేగా కెసిఆర్‌కు అవకాశం ఇస్తే సమస్యలను పట్టించుకోవడం లేదని 15 నెలలుగా ఫాం హౌస్‌కే పరిమితం అయినా మాజీ సిఎం,గజ్వేల్ ఎమ్మెల్యే ప్రజల మధ్యకు రావాలని లేదంటే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ యువజన కాంగ్రెస్ నాయకురాలు అంక్షారెడ్డి ఆధ్వర్యంలో గురువారం వెయ్యి మందితో గజ్వేల్ నియోజకవర్గంలోని కలె క్టరేట్ నుంచి రాజ్‌భవన్ వరకు వంద కిలోమీటర్ల పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెసిఆర్ అసెంబ్లీకి వెళ్లకుండా ఇప్పటీ వరకు రూ.58 లక్షల జీతం మాత్రం తీసుకున్నారని తెలిపారు. నియోజకవర్గానికి రాకండా ప్రజల సమస్యలు పట్టించుకోకుండా ఫాం హౌస్‌కే పరిమి తమైన కెసిఆర్ ప్రజల సొమ్మును జీతంగా ఎలా తీసుకుంటారని ప్రశ్నిం చారు. రూ.58 లక్షల జీతం తీసుకున్న కెసిఆర్ 58 నిమిషాలు కూడ అసెంబ్లీకి వెళ్లలేదన్నారు. అసెంబ్లీకి వెళ్లి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమ స్యలపై అసెంబ్లీలో మాట్లాడిన దాఖాలలు లేవన్నారు. సిఎంగా ఉన్న సమయంలో ప్రారంభించిన పనులు అసం పూర్తిగానే మిగిలిపోయాయని తెలిపారు. ప్రజల సమస్యలను పట్టించుకోని కెసిఆర్‌కు ఎమ్మెల్యే పదవి ఎందుకని ప్రశ్నించారు. అసెంబ్లీకి వెళ్లి గజ్వేల్ అభివృద్ధి,ప్రజా సమస్యలపై చర్చించకుంటే ఆందోళనలు చేస్తామ న్నారు. సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి నిధులు అడగడానికి కెసిఆర్ వస్తే తాము కూడా వెంట ఉంటామన్నారు. అంతకు ముందు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్‌లో అందించారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకురాలు అక్షాంరెడ్డి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎలక్షన్‌రెడ్డి, భూంరెడ్డి, నాయకులు,, కార్యకర్తలు పాల్గొన్నారు.



కలెక్టరేట్ నుంచి రాజ్‌భవన్‌కు బయలుదేరిన పాదయాత్ర

# అంగన్‌వాడి, ఆశా వర్కర్ల డిమాండ్లను పరిష్కరించాలి

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అంగన్‌వాడి, ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, ఇన్సూరెన్స్, విఆర్ఎస్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ తదితర సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. వారి సమస్యల పరిష్కారం కోసం పెద్దఎత్తున ఉద్యమాలు, పోరాటాలు చేశారని.. వారి సమస్యలు పరిష్కరిస్తామని రాష్ట్రప్రభుత్వం అనేక సందర్భాల్లో హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉన్నాయన్నారు. తక్షణమే వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని జాన్‌వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ ప్రయివేటీకరణతో పాటు, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని... పీఎంశ్రీ పథకాన్ని రాష్ట్రంలోని 28 జిల్లాల్లోని 56 కేంద్రాల్లో ప్రారంభించి, మొబైల్ అంగన్‌వాడీల పేరుతో కొత్త విధానాన్ని తెస్తుందని.. దీంతో పేదలు అంగన్‌వాడీ కేంద్రం అందిస్తున్న సేవలకు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. దీని ఫలితంగా ఐసీడీఎస్ బలహీనపడి మూతపడే ప్రమాదముందన్నారు. అందుకే తక్షణమే పీఎంశ్రీ పథకంతోపాటు, మొబైల్ అంగన్‌వాడీ సెంటర్లను రాష్ట్రంలో పూర్తిగా రద్దుచేయాలన్నారు. వారికి రావాల్సిన 10 నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలన్నారు. ఆశా వర్కర్లు మకు పిక్స్‌డ్ వేతనం రు.18వేలతో పాటు, టార్గెట్ రద్దు లాంటి అనేక సమస్యలపై ఉద్యమాలు నిర్వహించారని.. దీంతో రాష్ట్ర ప్రభుత్వం వారితో చర్చలు జరిపి, పరిష్కారానికి ఐఏఎస్ అధికారితో కమిటీ వేసి, ఆ ప్రతిపాదనల ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఎన్నికల సంద ర్భంగా హామీనిచ్చింది. కానీ వారి సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. సెలవులు, ఏఎస్సీ, పిఎస్సీ తదితర టార్గెట్స్ రద్దుచేసి.. రిటైర్ మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు, అన్ని ఆసుపత్రుల్లో ఆశాలకు రెస్ట్‌రూం ఏర్పాటు చేయాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు.

# మట్టపల్లి పుణ్యక్షేత్రం నుంచి సన్న బియ్యం పంపిణీ

## స్థానిక నాయకులు అధికారులతో సమాలోచనలు చేసిన మంత్రి ఉత్తమ్



**హుజూర్‌గర్ (గరిడేపల్లి), మార్చి 20, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసేందుకు సిద్ధపడుతున్న సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని హుజూర్నగర్ నియోజకవర్గంలోని మట్టపల్లి పుణ్యక్షేత్రము నుంచి ప్రారంభించేందుకు సన్నహాలు చేస్తున్నట్లు రాష్ట్ర మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం రాష్ట్ర జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో కలిసి మట్టపల్లి ని సందర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో రాష్ట్రవ్యాప్తంగా పేద ప్రజలకు రేషన్ కార్డుల ద్వారా సన్నబియాన్ని పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఇక్కడ నుంచి లాంచనంగా ప్రారంభిస్తే ఎలా ఉంటుంది అనే విషయంపై మంత్రి ఉత్తం అధికారులు స్థానిక నాయకులతో సుదీర్ఘంగా చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అయినప్పటికీ ఇప్పటివరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హుజూర్నగర్ నియోజకవర్గంలో పర్యటించలేదు. ఇప్పుడు సన్న బియ్యం పంపిణీ ప్రారంభోత్సవం కార్యక్రమం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నియోజకవర్గానికి ఆహ్వానిస్తే సాధ్యసాధ్యాలు ఎలా ఉంటాయి అనే విషయంపై ఆయన ఆరా తీశారు. సన్న బియ్యం పంపిణీ ప్రారంభోత్సవం కార్యక్రమాన్ని ఉగాది పండుగ రోజున ఏర్పాటు చేయాలని ఒకవేల ఆ రోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమయాన్ని కేటాయిస్తే అదే రోజు ఈ పుణ్యక్షేత్రంలో పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహిస్తే ఎలా ఉంటుంది అనేదానిపై ఆలయ అర్చకలతో చర్చించారు. దీనిలో భాగంగా హెలిపాడ్ స్థలాన్ని, సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తే ప్రాంతాన్ని బహిరంగ సభను నిర్వహించటానికి అవసరమైన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన ఖరారు కానప్పటికీ ప్రతిష్టాత్మకమైన ఈ సన్న బియ్యం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని హుజూర్నగర్ నియోజకవర్గం నుంచి ప్రారంభించేందుకు దానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించి ఆయన చేతుల మీదుగా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నట్లు అధికారులకు నాయకులకు నిర్వహించిన సమావేశంలో ఆయన వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన పై రెండు మూడు రోజుల్లో స్పష్టమైన సమాచారం వస్తుందని దానికి అనుగుణంగా ఉన్నతాధికారులు స్థానిక నాయకులు సాధ్యసాధ్యాలపై పూర్తి సమాచారాన్ని తనకు అందించాలని కోరారు. అనంతరం హుజూర్నగర్ పట్టణంలోని క్యాంప్ ఆఫీసులో కొద్దిసేపు గడిపి హైదరాబాదుకు తరలి వెళ్లారు. మంత్రి ఉత్తమ్ వెంట సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందులాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహా, మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, మల్టిజోన్ 2 రేంజ్ ఐజి సత్యనారాయణ, అదనపు జిల్లా కలెక్టర్ పి రాంబాబు, కోదాడ డి.ఎస్.పి శ్రీధర్ రెడ్డి, హుజూర్నగర్ ఆర్డీవో శ్రీనివాసులు ఉన్నారు.

## బీమా విస్తరణపై దృష్టి

### ఎల్ఐసి సిఇఒ మొహంతి

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** జీవిత బీమా కవరేజీని విస్తృతం చేయడానికి ఎల్ఐసి కట్టుబడి ఉందని సంస్థ సిఇఒ సిదార్థ మొహంతి అన్నారు. ఇందుకు స్థిరంగా దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటనలో గ్రామీణ ప్రాంతాలకు మరియు ఆర్థికంగా మరియు సామాజికంగా వెనుకబడిన విభాగాలకు చేరుకోవడం తమ లక్ష్యమన్నారు. భీమా చేయలేని ప్రతి వ్యక్తికి ఆర్థిక రక్షణను సరసమైన ఖర్చుతో విస్తరించే ధ్యేయంతో ప్రణాళికా బద్ధంగా ముందుక వెళుతున్నట్లు వివరించారు. కొంతమంది జీవిత బీమా ఏజెంట్లు వివిధ అంశాలకు సంబంధించి ప్రతిపక్ష నాయకుడిని కలుసుకున్నారని చెప్పారు. దీనిపై క్రొత్త ఉత్పత్తితో సమలేఖనం చేసే ఉత్పత్తులను ప్రవేశపెట్టినట్లు ఆయన స్పష్టం చేశారు. సమాజంలోని విభిన్న వర్గాలు, అన్ని నియంత్రణ అవసరాలకు పూర్తిగా అనుగుణంగా ఉంటుందని వెల్లడించారు. ఏజెంట్ల కోసం కమిషన్ తగ్గించబడలేదని తేల్చిచెప్పారు. పాలసీదారులకు ఆర్థిక భద్రతను అందించడానికి ఎస్ఐసీ అంకితం చేయబడిందిదాని, అదే సమయంలో ఏజంట్ల శ్రేయస్సుకు మద్దతు ఇస్తున్నట్లు పేర్కొన్నారు.



ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీశైలం

## వేధింపులు తట్టుకోలేక యువకుడు ఆత్మహత్యాయత్నం

### చర్చి గోడ విషయంలో ఎస్ఐ వేధింపులు

**గజ్వేల్, మార్చి 20, ప్రభాతవార్త:** కుకునూర్‌పల్లి ఎస్ఐ వేధింపులు తట్టుకోలేక కుకునూర్‌పల్లికి చెందిన ఇండ్ల శ్రీశైలం గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స నిమిత్తం హుటాహుటిన కుకునూర్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రభుత్వాసుపత్రి ఆవరణలో యువకుని భార్య వసంత విలేకరులతో మాట్లాడుతూ కుకునూర్‌పల్లి మండలకేంద్రంలో అనుమతి లేకుండా తన ఇంటి పక్కన చర్చి నిర్మించడం జరిగిందని, గత పది సంవత్సరాల నుండి డేవిడ్ రాజు, అతని భార్య ఎలిజబిత్ రాణిలు నివాస గృహం కట్టుకొని అనుమతి లేకుండా చర్చిని నడుపుతున్నారని తెలిపారు. తమ ఇంటి పక్కనే ఉండడంతో పొత్తుల గోడ ఉండగా తీసివేయాలని గత వారం రోజుల క్రితం సత్యనారాయణ అలియాస్ డేవిడ్ రాజు కుకునూర్‌పల్లి ఎస్ఐ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో పలుమార్లు ఇండ్ల శ్రీశైలంకు ఫోన్‌చేసి నీవు పోలీస్‌స్టేషన్‌కు రావాలని అనడంతో అతను వెళ్లకపోవడంతో గురువారం మధ్యాహ్నం 1.30 గంటలకు ఇద్దరు కానిస్టేబుళ్లను తమ ఇంటికి పంపించారని తెలిపారు. కానిస్టేబుళ్లు రాగానే ఇంట్లో ఉన్న శ్రీశైలం మిరప తోట కోసం తెచ్చిన మందును వారి ముందే సేవించాడు. పోలీసులు అప్రమత్తమై శ్రీశైలంను దగ్గరలో ఉన్న ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. శ్రీశైలం ఆత్మహత్యాయత్నం పట్టణంలో దావానంలా వ్యాపించడంతో స్థానిక బిజెపి నాయకులు మనోహర్‌యాదవ్, బండారు మహేష్, కుడిక్యాల శ్రీనివాస్, నాయిని సందీప్, బోనాల రాజు, కుకునూర్‌పల్లి మండల అధ్యక్షుడు సంపత్‌రెడ్డిలు హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి చేరుకొని శ్రీశైలం ఆత్మహత్యాయత్నంకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. చర్చి గోడ విషయంలో తలదూర్చిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలన్నారు. కుకునూర్‌పల్లి ఎస్ఐకి ఫోన్ అడుగగా గత వారం రోజుల క్రితం కుకునూర్‌పల్లికి చెందిన డేవిడ్ రాజు ఇంటి గోడ విషయంలో తనకు ఇబ్బందులు పెడుతున్నారని ఇండ్ల శ్రీశైలంపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు వస్తే ఎవరినైనా పిలిపించడం జరుగుతుందని, అతనిపై నేను ఎలాంటి వేధింపులకు పాల్పడలేదన్నారు.

## ఆత్మవిశ్వాసంతో ప్రశాంతంగా పరీక్షలు రాయండి

**10వ తరగతి విద్యార్థులకు సీఎం రేవంత్‌రెడ్డి అభినందనలు**

**ప్రభాతవార్త ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 20:** రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్న సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుభాభినందనలు తెలియజేశారు. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఆకాంక్షించారు. బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవడానికి లక్ష్యంపైనే గురిపెట్టాలని గురువారం ఒక సందేశంలో పేర్కొన్నారు.

**ప్రశాంతంగా పరీక్షలు రాయండి: ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్**

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** పదవ తరగతి విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి, ఆందోళనలకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ సూచించారు. ప్రజాపాలనలో పదవ తరగతి పరీక్ష రాస్తున్న విద్యార్థులందరికీ మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులందరు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చే దిశగా ముందుకెళ్లాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.



## జగిత్యాల ఆర్డీఓ ఆఫీసులో ఐటి అధికారుల సోదాలు

**జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త;** రైల్వే లైన్‌లో భూమి కోల్పోయిన రైతులకు డబ్బుల పంపిణీలో కోటి రూపాయల పైనే అవకతవకలు జరిగాయని రైతుల ఫిర్యాదుల మేరకు ఐటి అధికారులు జగిత్యాల ఆర్డీవో కార్యా లలో గురువారం రికార్డులు తనిఖీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. జగిత్యాల జిల్లాలో 2006 సంవత్సరంలో రైల్వే లైన్ భూసేకరణ సంబంధించి 100 మంది పైనే రైతులు భూములు కోల్పోగా ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం తక్కువగా ఇస్తామనడంతో రైతులు దానికి అంగీకరించక ఎక్కువగా నష్టపరిహారం కావాలని సుప్రీంకోర్టులో కేసు వేశారు. దీంతో 2019లో సుప్రీంకోర్టు రైతులకు వడ్డీతో సహా నష్టపరిహారం చెల్లించాలని తీర్పునిచ్చింది. కాగా ఈ డబ్బు రైతుల అకౌంట్లో ప్రభుత్వం వేయగా పాన్ కార్డు ఉన్న రైతులకు టిడిఎస్ డబ్బులు కటుకాకుండానే రైతుల అకౌంట్ నుండీ కొందరు తీసుకోగా మరికొంత మందికి పాన్ కార్డు లేకపోవడంతో టిడిఎస్ డబ్బులు కట్ కటుకాగా ఆ డబ్బులను ఆర్డిఓ కార్యాలయ అధికారులు కోటి. రూపాయల పై నుండి అవకతవకులకు పాల్పడి రైతులకు ఇవ్వలేదు. కాగా రైల్వే లైన్ సంబంధించి నష్టపోయిన రైతుల డబ్బులు కొందరు అధికారులు అవకా తవకలు చేసి లబ్ధి పొందిన సమాచారం మేరకు కేంద్రీ ఇన్కంటాక్స్ అధికారులు జగిత్యాల చేరుకొని ఆర్డిఓ కార్యాలయం లోని రికార్డులన్నీ తనిఖీలు చేశారు. అధికారుల వాంగు మూలం తీసుకున్నారు. రికార్డు ప్రతులను వారి వెంట తీసుకెళ్లారు .పూర్తి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఆల్ఫా జోలం కేసులో పదేళ్ల జైలుశిక్ష, రూ.లక్ష జరిమానా

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త :** అల్ఫాజూలం రవాణా చేస్తూ ఎక్సైజ్ పోలీసులకు పట్టు పడిన గౌండ్ల మాధవ గౌడ్ అనే వ్యక్తికి గురువారం సంగారెడ్డి అడిషనల్ జిల్లా జడ్జ్ 10 సంవత్సరాల కారాగార శిక్ష రూ. 1 లక్ష జరిమానా విధించారు. సంగారెడ్డి సదాశివపేట మండలం ఆరూరు గ్రామానికి చెందిన గాండ్ల మాధవ గౌడ్ కేజీ అల్ఫాజూలాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న సమయంలో అప్పటి సీఐ మధుబాబు సదాశివపేటలో పట్టుకున్నారు. నిందితుడు పై కేసు నమోదు చేశారు. 2022లో నమోదైన ఈ కేసులో వాదనల అనంతరం జిల్లా న్యాయమూర్తి పదేళ్లు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.నిషేధిత మత్తు పదార్థాన్ని పట్టుకొని కేసు నమోదు చేసి శిక్ష పడే విధంగా చర్యలు తీసుకున్నటువంటి దూల్పేట్ సిఐ మధుబాబును ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ విబి కమలహాసన్ రెడ్డి అభినందించారు. తీర్పు వెలువరించిన అనంతరం నిందితుడు గాండ్ల మాధవ గౌడ్‌ను కానిస్టేబుళ్లు జిల్లా జైలుకు తరలించారు.

## ఎస్సీ హాస్టల్‌లో 23 మంది విద్యార్థినులకు అస్వస్థత

**ఎస్సీ సంక్షేమ శాఖ సీరియస్**

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** ప్రభుత్వం ఎన్ని పటిష్ట చర్యలు తీసుకున్నా, రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లలో మాత్రం ఫుడ్ పాయిజనింగ్ సంఘటనలు తరచూ జరుగుతునే ఉన్నాయి. తాజాగా రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్లాలో ఫుడ్ పాయిజన్ సంఘటన జరగడంతో సాంఘిక సంక్షేమ శాఖ సీరియస్ అయింది. సంఘటనకు గల కారణాలతో కూడిన నివేదికను సమర్పించాలని అధికారులను అదేశించారు. జిల్లాలోని వర్ని మండలం కోటయ్య క్యాంప్‌లో గల ఎస్సీ సంక్షేమ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ కావడంతో 23 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వర్నిలోని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఉదయం హాస్టల్‌లో పప్పు అన్నం తిని స్కూల్‌కు వెళ్లారు. 11 గంటల సమయంలో అస్వస్థతకు గురైన 23 మంది విద్యార్థినులు వాంతులు చేసుకున్నారు. వారిని హుటా హుటిన ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. ప్రాథమిక చికిత్స అనంతరం కోలుకున్న విద్యార్థినులను హాస్టల్‌కు తరలించారు. ఫుడ్ పాయిజన్ కావడం వల్లే ఇలా జరిగి ఉంటుందని డాక్టర్ స్నేహ తెలిపారు.

## చాహల్ ధనశ్రీలకు విడాకులు మంజూరు!

**ముంబయి, మార్చి 20:** టీమిండియా క్రికెటర్ యజువేంద్రచాహల్, ధనశ్రీవర్మ వివాహ బంధానికి తెరపడింది. వీరికి ముంబయిలోని ఫ్యామిలీ కోర్టు విడాకులు మంజూరుచేసింది. గురువారం కోర్టు తుదితీర్పును వెలువరించింది. వీరిద్దరూ విడాకులు తీసుకుంటున్నారంటూ కొంతకాలంగా ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. 2022నుంచే ఈ ఇద్దరూ వేరువేరుగా ఉంటున్నారు. ఈక్రమంలో 2025 ఫిబ్రవరి ఐదున



ముంబయిలోని ఫ్యామిలీ కోర్టులో విడాకులకోసం ఇద్దరూ దరఖాస్తు చేసుకున్నారు. ఇక పరస్పర అంగీకారంతో ఈ జంట విడాకులు తీసుకోవాలని కోరుకుంటున్న నేపథ్యంలో ఆరునెలల కూలింగ్ పీరియడ్‌ను మినహాయించాలని ఫ్యామిలీకోర్టును అభ్యర్థించగా అందుకు న్యాయస్థానం అంగీకరించలేదు. దీనిని సవాల్‌చేస్తూ చాహల్ న్యాయవాది హైకోర్టును ఆశ్రయించారు. అందుకు చాహల్‌కు అనుకూలంగా తీర్పువచ్చింది. 2022నుంచే వేరుగా ఉంటున్నందున ఆరునెలల కూలింగ్‌పీరియడ్ అవసరంలేదని తెలిపింది. మార్చి 20 లోపు విడాకుల అంశంపై తుదితీర్పు ఇవ్వాలని ఫ్యామిలీకోర్టును ఆదేశించింది. ఈ క్రమంలోనే గడువుతేదీ 20వ తేదీ గురువారం ఫ్యామిలీకోర్టు తీర్పుచెప్పింది. ధనశ్రీకి భరణం కింద రూ.4.75 కోట్లు ఇచ్చేందుకు చాహల్ ఇప్పటికే అంగీకరించారు. ఈ మొత్తంలో ఇందులో 2.37 కోట్లు ఇప్పటికే చెల్లించాడుకూడా.

# 26 రోజులు.. ఐదు షిఫ్టులు



**సవాలుగా మారిన నీటి-ఊట, మట్టి తొలగింపు**

**ఎస్ఎల్‌బిసిలో నిరంతరంగా రెస్క్యూ ఆపరేషన్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 20, ప్రభాతవార్త:** నాగర్ కర్నూల్ జిల్లా దోమల పెంట వద్ద ఎస్ఎల్‌బీసీ ప్రమాదం జరిగి 25 రోజులు అవుతున్నది. ఇప్పటివరకు ఒక మృతదేహం లభించగా టన్నెల్లో చిక్కుకున్న మిగతా ఏడుగురి ఆచూకీ కోసం రెస్క్యూ ఆపరేషన్ నిరంతరంగా కొనసాగుతున్నది. టీబిఎం శకలాల తొలగింపు, నీటి ఊట రావడం, మట్టి తొలగింపు సవాలుగా మారింది. నిరంతరాయంగా కొనసాగుతున్న సహాయక చర్యలు, శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలపై ఉన్నతాధికారుల సమీక్ష, ఆర్మీ జనరల్ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ అజయ్ మిశ్రా, డిజాస్టర్ అండ్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, గురువారం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని, దోమలపెంట, ఎస్ఎల్‌బిసి ఇన్లెట్ 1 ఆఫీస్ వద్ద నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆర్మీ జనరల్ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ అజయ్ మిశ్రా, డిజాస్టర్ అండ్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఆర్మీ ఉన్నతాధికారులు, సహాయక బృందాల ఉన్నతాధికారులతో, టన్నెల్ లోపల ప్రమాద ప్రదేశంలో జరుగుతున్న సహాయక చర్యలపై, తిసుకోవాల్సి న భద్రత ప్రమాణాలను విశ్లేషించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యలను వేగవంతం చేసేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

టన్నెల్ లోపల పరిస్థితులను అనుసరించి భద్రతా ప్రమాణాలను పాటిస్తూ సహాయక చర్యలను కొనసాగిస్తున్నట్లు వివరించారు. టన్నెల్ ప్రమాద ప్రదేశంలో సహాయక పనులకు ఆటంకంగా ఉన్న ఊట నీటిని అధిక సామర్థం గల పంపుల ద్వారా బయటకు తరలిస్తున్నట్లు తెలిపారు. జియో లాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారుల సూచనలను పాటిస్తూ ప్రమాద ప్రదేశంలో సహాయక చర్యలు చేపడుతున్న బృందాలను నిరంతరం అప్రమత్తంగా ఉంచుతున్నట్లు, ప్రమాదంలో చిక్కుకున్న వారు ఉంటున్నట్లు గుర్తించిన ప్రదేశంలో స్టీలును, మట్టిని, సహాయక బృందాలు పూర్తిస్థాయిలో తొలగించేందుకు చర్యలు చేపడుతున్నట్లు, పెద్ద పెద్దబండ రాళ్లను ఎస్కవేటర్ ద్వారా తొలగిస్తూ లోకో ట్రైన్ ద్వారా బయటకు తరలిస్తున్నట్లు తెలియజేశారు. మట్టిని, కన్వేయర్ బెల్ట్, ద్వారా బయటకు పంపే ప్రక్రియ నిరంతరం కొనసాగిస్తున్నట్లు వివరించారు. నీటి ఊటలు, మట్టి ఎక్కువగా ఉండటం వంటి సవాళ్లను అధిగమించేందుకు యంత్రాలు, ప్రత్యేక నిపుణులను రంగంలోకి దించినట్లు తెలిపారు.

సహాయక చర్యలు ప్రతి రోజు 5 షిఫ్టులుగా కొనసాగుతున్నాయని, ఉదయం 7 గం.లకు, 11 గం.లకు, మధ్యాహ్నం 3 గంటలకు, రాత్రి 7 గం.లకు, 11 గంటల షిఫ్టుల్లో, ప్రత్యేక సహాయక బృందాలు నిరంతరాయంగా పనిచేయిస్తున్నారని వివరించారు. టన్నెల్ లోపల జరిగే సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు ప్రత్యేక కమ్యూనికేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వివరించారు. 26 రోజులుగా ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో రాత్రి పగలు తేడా లేకుండా 5 షిఫ్టులుగా పనిచేస్తూ, ప్రమాద ప్రదేశంలో ఉన్న మట్టిని, స్టీల్, బండరాళ్లను తొలగిస్తూ సహాయక చర్యలలో పాల్గొంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల సహాయక బృందాలను తెలంగాణ ఆంధ్ర సబ్ ఏరియా జనరల్ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ అజయ్ మిశ్రా, అధికారులను అభినందించారు. సమీక్ష సమావేశంలో ఆర్మీ అధికారులు, కల్నల్ సురేష్, కల్నల్ పరీక్షిత్ మెహర, వికాస్ సింగ్ ఎన్‌డిఆర్ఎఫ్ అధికారులు డా, హరీష్, జిఎస్ఐ అధికారులు తప్లీ యాల్, భట్టాచార్య, శైలేంద్ర, లక్ష్మణ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, ఎస్ డిఆర్ఎఫ్, హైడ్రా, దక్షిణ మధ్య రైల్వే అధికారులు, ర్యాట్ హోల్ మైనర్స్, అన్వి రోబోటిక్ , కడావర్ డాగ్ స్క్వాడ్, జేపి, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## శరవేగంగా భద్రకాళి చెరువు పూడికతీత పనులు

**పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**



**హన్మకొండ బ్యూరో, మార్చి 20, ప్రభాతవార్త:** వచ్చే వానకాలం సీజన్ రాకకు ముందుగానే భద్రకాళి చెరువు పూడికతీత పనులు పూర్తి కావాలని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం భద్రకాళి చెరువు పూడికతీత పనులను వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె అర్.నాగరాజు, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద, సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు పూడికతీత పనుల వివరాలను కలెక్టర్, అధికారులు మంత్రికి వివరించారు. ప్రతిరోజు చెరువు పూడికతీత పనులు కొనసాగుతున్నాయని, సోమవారం నుండి విద్యుత్ లైట్లను, తగినంత సిబ్బందిని ఏర్పాటు చేసి రాత్రి వేళలోనూ పూడికతీత మట్టి తరలింపు ప్రక్రియను మరింత వేగవంతం చేస్తామని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య మంత్రికి వివరించారు. అదేవిధంగా పూడిక మట్టిని తీసుకుని వెళ్లి వచ్చే వాహనాలకు రెండు వైపులా అంతర్గత రోడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పుడు ఉన్న మార్గం ద్వారా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్న దృష్ట్యా మరో మార్గాన్ని సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. చెరువు పూడికతీత పనులు, అందుకు సంబంధించిన ఏర్పాట్లను సాగునీటి పారుదల శాఖ ఈఈ శంకర్ మంత్రికి వివరించారు. అదేవిధంగా జూ పార్క్ వైపు నుండి వచ్చే మురుగునీరును భద్రకాళి చెరువులో చేరకుండా ప్రణాళికను రూపొందిస్తే బాగుంటుందని కుడా ఛైర్మన్ వెంకట్రాంరెడ్డి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి స్పందిస్తూ చెరువులోకి మురుగు నీరు చేరకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా బయటికి వెళ్లేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వర్షాకాలం నాటికి చెరువు పూడికతీత పనులు పూర్తయ్యే విధంగా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. చెరువు పూడికతీయడం ద్వారా నీటి నిల్వ సామర్థం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కుడా పీవో అజిత్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసికి బడ్జెట్ కేటాయింపుపై సిఎం, డిప్యూటీ సిఎంకు ధన్యవాదాలు

**జిహెచ్ఎంసి ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి**

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** జిహెచ్ఎంసికి బడ్జెట్ కేటాయింపులు చేయడంపై సిఎం రేవంత్‌రెడ్డికి, డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్కకు జిహెచ్ ఎంసి ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. గురు వారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. జిహెచ్ఎంసిలో కొన్ని కొత్త ప్రాజెక్టులు స్టార్ట్ చెయ్యబోతున్నామని తెలిపారు. ఫ్లై ఓవర్లు, మూసి పునరుద్ధరణ, గోదావరి జలాలతో జంట జలాశయాలు నింపటం చేస్తున్నామన్నారు. మెక్ డొనాల్డ్ ఈ రాష్ట్రానికి రావటం హైదరాబాద్ వేదిక కావటం సంతోషంగా ఉందన్నారు. హైదరాబాద్‌కి రింగురోడ్డు, ఎయిర్ పోర్ట్, మెట్రో తెచ్చింది కాంగ్రెస్ పార్టీనే అన్నారు. ఒక్క స్టీల్ బిడ్జ్ కట్టి గొప్పలు చెప్పుకుంటున్నావని అన్నారు. కరోనాకి కనీసం మందు ఉంది మీ పార్టీ ఏం ఉందో మీకే తెలపాలన్నారు. రైతులు తక్కువ ధరకు టిడిఆర్ అమ్ముకోవడానికి కెటిఆర్ కారణం అన్నారు.

## ఎస్పీడిసిఎల్‌కు జాతీయ స్థాయిలో 3వ ర్యాంక్

**ఉన్నత స్థానాలకు చేరేలా కృషి చేయాలన్న సిఎండి ఫరూఖీ**

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** జాతీయ స్థాయిలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ (ఎస్పీడీసీఎల్)కు అరుదైన గుర్తింపు లభించింది. జాతీయ స్థాయిలో ఎస్పీడీసీఎల్‌కు 3వ ర్యాంక్ దక్కింది. కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ విడుదల చేసిన డిస్ట్రిబ్యూషన్ యుటిలిటీస్ ర్యాంకింగ్ (డియుఆర్) రిపోర్ట్ డిస్కామ్‌ల వినియోగదారుల సేవా రేటింగ్ 2023-24 లో కేటగిరీ పరంగా మూడోవ స్థానాన్ని కైవసం చేసుకున్నది.

ఈ కేటగిరిలో వివిధ రాష్ట్రాల నుండి మొత్తం 41 విద్యుత్ పంపిణి సంస్థలకు ర్యాంకులు కేటాయించింది. ఇందులో భాగంగా ఎస్పీడీసీఎల్‌కు మూడవ ర్యాంక్ లభించింది. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు, ఇతర డిస్కంలతో పోల్చుకుంటే తక్కువ సమయంలో విద్యుత్ కనెక్షన్‌ల మంజూరు, నిర్దిష్ట పత్రాలతో వివిధ సేవలు పొందేలా నియమ నిబంధలను సరళతరం చేయడం,

కచ్చితమైన బిల్లింగ్, సరైన మీటరింగ్ కోసం విద్యుత్ వ్యవస్థ యొక్క ఇన్ఫ్రారెడ్ థర్మల్ ఇమేజింగ్ తనిఖీ పోర్ట్ ఆధారిత మీటర్లను అమర్చడం, వినియోగదారుల ఫిర్యాదులు వెంటనే పరిష్కరించడం, విద్యుత్ కార్యాలయాలను సందర్శించకుండానే నేరుగా ఆన్‌లైన్ లో సంస్థ వెబ్ సైట్, మొబైల్ ఆప్ ద్వారా దాదాపు 99 రకాల విద్యుత్ సంబంధిత సేవలు పొందేలా ఏర్పాట్లు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో ఈ జాతీయ పురస్కారం లభించిందని ఎస్పీడీసీఎల్ అధికారవర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భముగా సంస్థ సిఎండి ముషారఫ్ ఫరూఖీ తమ వినియోగదారులకు, అధికారులకు, సిబ్బందికి అభినందలు తెలిపారు. భవిష్యత్ లోను సంస్థను మరింత ఉన్నత స్థానాలకు చేరేలా కృషి చేయాలని సూచించారు.

## అగ్రవర్ణ పేదలకు రాజీవ్ యువ వికాస్ పథకం వర్తింపచేయాలి: ఇబిసి సంక్షేమ సంఘం

**హైదరాబాద్, మార్చి 20 ,ప్రభాతవార్త :** అగ్రవర్ణ పేదలకు కూడా రాజీవ్ యువ వికాస్ పథకం వర్తింప చేయాలని ఈబిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వల్లపు రవీంద్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన గురువారం సిఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు.తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాస పథకం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగ యువత నిరాశ, నిస్పృహకు గురై పెడత్రోవ పడుతుందని, ఇటువంటి పరిస్థితులలో ఉద్యోగ అవకాశాలు లభించని నిరుద్యోగ యువతకు ఈ పథకం ఒక శాశ్వత ఉపాధికి పునాది లాంటిదన్నారు. రాష్ట్రంలో ఎస్.టి., ఎస్.సి. బి.సి. మైనారిటీ వర్గాలకు చెందిన యువతీ యువకులకు రాజీవ్ యువ వికాస పథకం అమలు చేయాలని నిర్ణయించి దరఖాస్తులు తీసుకుంటున్నారని, అయితే రాష్ట్రంలో అగ్రవర్ణాలుగా పిలువబడుతున్న, రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, వెలను, బ్రాహ్మణ, క్షత్రియ, కావు, బలిజ, ఒంటరి, ముస్లిం తదితర కులాలకు సంబంధించిన నిరుపేద యువతీ యువకులకు రాజీవ్ యువ వికాస పథకం అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఓసి ల్లోని నిరుద్యోగ యువత అనేక ఇబ్బందులకు గురవుతుందన్నారు.

## ఆత్మహత్యలతో తల్లిదండ్రులకు కడుపుకోత మిగల్చొద్దు

**విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు గురుకుల అధ్యాపకులకు శిక్షణ పూర్తి**

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యార్థుల్లో ఆత్మహత్యల కట్టడికి చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతో సొసైటీ స్కూల్స్ లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులను నిర్వహించారు. విద్యార్థుల్లో ఆందోళన కల్గిస్తున్న ఆత్మహత్య ఆలోచనలపై వారికి అవగాహన కల్పించి.. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపేలా చర్యలు తీసుకోవడానికి అధ్యాపకులకు నాలుగు రోజులపాటు శిక్షణను అందించారు. ఈ నెల 17 నుంచి 20 వరకు శిక్షణను ఇచ్చినట్టు గురుకుల సొసైటీ కార్యదర్శి డాక్టర్ అలగు వర్షిణి తెలిపారు. గురువారం జరిగిన ముగింపు కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి మాట్లాడుతూ ..గురుకుల విద్య సంస్థల్లో ఆత్మహత్యలు చేసుకోవాలనే ఆలోచన విరమించుకోవాలని... కని పెంచిన తల్లిదండ్రులకు కడుపు కోతను కలిగించొద్దని విజ్ఞప్తి చేశారు. కన్నబిడ్డలు చనిపోతే తల్లిదండ్రుల మానసిక క్షోభను ఒక్కసారి ఆలోచించాలని కోరారు. ఆత్మహత్యలు పరిష్కారం కాదని, నిరాశ నిస్పృహాలోనూ ధైర్యంగా నిటారుగా నిలిచేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో కుంగుబాటును దూరం చేసి మానసిక ఆరోగ్యం పెంపొందించేలా దేశంలో ప్రతిష్టాత్మకమైన ఎన్ఎల్‌పి మాస్టర్ ట్రైనర్ రఫీ నేతృత్వంలో (మ్యాజిక్ ఆఫ్ ఛేంజ్ సంస్థతో కలిసి ) గురుకుల టీచర్లకు నాలుగు రోజులపాటు మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణ సంస్థలో ట్రెయినింగ్ పూర్తి చేశారు. అంతర్జాతీయ శిక్షణ, వ్యక్తిత్వ వికాస సంస్థ "మాజిక్ ఆఫ్ ఛేంజ్" భాగస్వామ్యంతో నిర్వహించబడింది. వ్యక్తిత్వ వికాస నిపుణులు మొహమ్మద్ రఫి (మ్యాజికల్ రఫి) 250 మంది గురుకుల ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

## రామినేని శ్రీనివాస్ కుటుంబానికి ఎక్సైజ్ శాఖ అండ

**ఎక్సైజ్ శాఖ గెజిటెడ్ యూనియన్ అధ్యక్షుడు హరికిషన్**

**హైదరాబాద్,మార్చి 20,ప్రభాతవార్త:** అందరిని ఆత్మీయంగా పలకరించే రామినేని శ్రీనివాస్ మరణం దురదృష్టకరం. ఆయన లాంటి మంచివాడు ఆత్మీయ మిత్రుడు మాతో కలిసి పనిచేసే అదృష్టం మాకు దక్కడం, తెలంగాణ ఉద్యమంలో ఎంతో కీలక భూమిక పోషించిన ఆయన కుటుంబానికి అండగా నిలుస్తుందని ఎక్సైజ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హరికిషన్ అన్నారు. గురువారం ఆయన స్వగృహంలో జరిగిన దశదినకర్మకు ఆఫీసర్ అసోసియేషన్ సభ్యులందరూ హాజరయ్యారు. ఆయనకు ఘనంగా నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు రూ.7.50 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారు.

## విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి

**సిఎంకు మాజీ ఎమ్మెల్యే పటోళ్ల శశిధర్‌రెడ్డి లేఖ**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మార్చి 20:** రాష్ట్రంలోని అన్ని కాలేజీలకు సంబంధించి విద్యార్థి సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ మాజీ అధ్యక్షుడు, మెదక్ మాజీ ఎమ్మెల్యే పటోళ్ల శశిధర్‌రెడ్డి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు సిఎంకు బహిరంగ లేఖ రాశారు. ఈ నెల 13న ఉస్మానియా వర్సిటీ అధికారులు జారీ చేసిన సర్కులర్‌ను వెంటనే నిలుపుదలకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. విద్యార్థులు తమ సమస్యలను పరిష్కరించేకోవడానికి ప్రజాస్వామ్యక పద్ధతి లో నిరసనలు ధర్నాలు చేస్తుంటారని పేర్కొన్నారు. ఉస్మానియా యూని వర్సిటీ, కాకతీయ యూనివర్సిటీతోపాటు రాష్ట్రంలోని అన్ని అనుబంధ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో ఇంజనీరింగ్ పాలిటెక్నిక్, ఎంబీబీఎస్, ఐటిఐ తదితర అన్ని కళాశాలలో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించినట్లయితే ఇలాంటి ధర్నాలు, రాస్తారోకోలు ఉండవని పేర్కొన్నారు.




ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న సతీష్ మాదిగ తదితరులు


## మాయమాటలతో మాదిగలను మోసం చేస్తున్న మందకృష్ణ

**ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక జనరల్ సెక్రటరీ దేవని సతీష్ మాదిగ**

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** బీజేపీ కోసం పని చేస్తున్న మంద కృష్ణ మాయ మాటలు చెబుతూ మాదిగ లను మోసం చేస్తున్నాడని ఎట్టి పరిస్థితుల్లో తెలంగాణ మాదిగలు మనువాడ జెండా మోయబోరని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక జనరల్ సెక్రటరీ దేవని సతీష్ మాదిగ అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో బిజెపి అఫిడవిట్ వేసిందని మందకృష్ణ మాట్లాడటం వెనుక కుట్ర దాగి ఉందన్నారు. మాదిగలను బిజెపి వైపు మళ్లించేందుక ఆయన ప్రయ్నతిస్తున్నారని బిజెపి వేసిన అఫిడవిట్‌ను వెంటనే బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. 1997 నుంచే మందకృష్ణకు కిషన్‌రెడ్డి, చంద్రబాబుతో సోపతి ఉందవని బిజెపి వర్గీకరణకు కట్టుబడిఉన్నామని నిరూపించుకోవడానికి ముందు బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. 30 ఏండ్ల ఉద్యమం ఫలితంగానే కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీలను ఎబిసిడిలను వర్గీకరించిందని తెలిపారు. మాదిగ విద్యార్థులు మంద కృష్ణ రాజకీయ క్రిడలో పడి మోసపోయి గోస పడవద్దని ఉద్యోగం చేసేందుకు ఉన్నత చదువులకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ ఫౌండర్ జనరల్ సెక్రటరీ పాలడుగు శ్రీనివాస్ మాదిగ, అల్లారం రత్నయ్య మాదిగ, కొక్కెర భూమన్న మాదిగ, జన్ను జయరాజ్ మాదిగ, శ్రీనివాస్ మాదిగ , పెద్దన్న మాదిగ , తుప్పుడు నర్సయ్య మాదిగ, అనంతయ్య మాదిగ, దైద శ్యామ్ మాదిగ, రాంచందర్ మాదిగ, మోజెస్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## గాజాపై ఇజ్రాయెల్ దాడులు

**70 మంది మృతి, అనేకమందికి గాయాలు**



**గాజాసిటీ, మార్చి 20:** ఇజ్రాయెల్ హమాస్‌లమధ్య ఉద్రిక్తతలు పెరిగిన క్రమంలో పశ్చిమాసియా మళ్లీ యుద్ధభూమిగా మారుతోంది. ఇజ్రాయెల్ జరిపిన భీకర దాడుల్లో 400 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. తాజాగా టెల్ అవీవ్‌దళాలు మరోసారి వైమానిక దాడులతో విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లో సుమారు 70మందికిపైగా మృతిచెందారని స్థానిక అధికారులు తెలిపారు. వీరిలో ఒక మహిళతోసహా అనేకమంది చిన్నారులున్నట్లు తెలిపారు. ఇక ఇజ్రాయెల్‌రక్షణమంత్రి కాట్జ్ గాజాకు తీవ్ర హెచ్చరికలుచేసారు. బందీలందరినీ తిరిగి ఇవ్వడానికి ఇదే చివరి అవకాశమని లేకుంటే తీవ్రపరిణామాలు ఎదుర్కొనాల్సి ఉంటుందన్నారు. మరోవైపు నెట్జారిమ్ కారిడార్‌లో కొంతభూభాగం ఇజ్రాయెల్‌స్వాధీనంచేసుకుంది. ఇక్కడినుంచి పాలస్తీనా వాసుల కదలికలను నియంత్రించే వెసులుబాటు ఇజ్రాయెల్ సాధించింది. ముందు రోజు కూడా గాజాపై భీకర దాడులుచేసింది. 400 మందికిపైగా మృతి చెందగా అనేకమంది గాయపడ్డారు. మృతుల్లో చిన్నారులు మహిలలే ఎక్కువ మంది ఉన్నారు. ఇజ్రాయెల్ హమాస్‌ల మధ్య తొలిదశ కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిన సంగతి తెలిసిందే. ఈ ఒప్పం దంలో మార్పులు చేయ డానికి హమాస్ తిరస్కరిం చడంతోనే దాడులకు ఆదేశించినట్లు ఇజ్రాయెల్‌ప్రధాని నెతన్యాహు ప్రకటించారు. బందీల విడుదలకు హమాస్ కావాలనే నిరాకరిస్తోందని, యుద్ధ లక్ష్యాలు సాధించేందుకు గాజాలోని హమాస్ స్థావరాలే లక్ష్యంగా ఐడిఎఫ్ దాడులుచేస్తోందని ఆయన పేర్కొన్నారు. కాగా హమాస్ తీవ్రంగా ధ్వజమెత్తింది. ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి బందీలప్రాణాలను ప్రమాదంలోపడేసిందని అందుకుతగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుం దని మిలిటెంట్ సంస్థ హమాస్ హెచ్చరించింది.

# 'శారీ' ట్రైలర్ రిలీజ్ ఈవెంట్

ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ కొత్త సినిమా శారీ. ఈ చిత్రంలో సత్య యాదు, ఆరాధ్య దేవి ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ చిత్రాన్ని సైకలాజికల్ థ్రిల్లర్ కథతో దర్శకుడు గిరి కృష్ణ కమల్ రూపొందించారు. ఆర్జీవీ, ఆర్వీ ప్రొడక్షన్స్ ఎల్ఎల్ పీ బ్యానర్‌పై ప్రముఖ వ్యాపారవేత్త రవిశంకర్ వర్మ నిర్మించారు. శారీ సినిమా ఏప్రిల్ 4న తెలుగు, హిందీ, తమిళం, మలయాళ భాషలలో పాన్‌ఇండియా స్థాయిలో విడుదల కానుంది. హైదరాబాద్‌లో శారీ సినిమా ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ మాట్లాడుతూ, మనం ఎవరితోనైనా డైరెక్ట్‌గా మాట్లాడినప్పుడు పెద్దగా వారితో కనెక్ట్ కాము. కానీ వాట్సాప్ లాంటి సోషల్ మీడియా యాప్స్ ద్వారా మాట్లాడుకున్నప్పుడు మనం వారిని నేరుగా చూడటం లేదు గనుక త్వరగా వారితో కలిసిపోతాం. మన వ్యక్తిగతమైన విషయాలు కూడా చెప్పేస్తుంటాం. ఒక్కసారి ఎదుటివారికి దగ్గరయ్యాక భయం వల్లో సైకలాజికల్ ఫీలింగ్ వల్లో మరింతగా అటాచ్ అవుతాం. ఇలా పర్సనల్ విషయాలు షేర్ చేసుకోవడం వల్ల ఆ తర్వాత చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. శారీ సినిమా నేపథ్యమిదే. ప్రాథమికంగా చూస్తే ఇది చాలా సీరియస్ సబ్జెక్ట్. నేను ఈచిత్రానికి మూలకథ రాశాను. గిరి కృష్ణకమల్ దర్శకత్వం వహించాడు. ఆరాధ్య చీరకట్టులో చేసిన ఒక రీల్ చూసి ఆమెను కాస్ట్ చేశాం. ఆమె చేసిన పర్ ఫార్మెన్స్ సూపర్బ్‌గా అనిపించింది. సత్య ట్రైన్డ్ యాక్టర్. తను బాగా నటించాడు. శారీ సినిమాలో మెసేజ్ ఉంటుందని చెప్పను గానీ ఈ సినిమా చూశాక అమ్మాయిలు జాగ్రత్తపడతారు. రాజకీయాలు, సినిమాలు వేరు. ఏపీలో మా శారీ సినిమాకు థియేటర్స్ దొరకవు అనుకోవడం లేదు. పోసానిని అరెస్ట్‌చేస్తే ఆయన సినిమాలు ఆపేయరు కదా. సోషల్ మీడియా మనుషులను దగ్గర చేసేందుకు తయారైంది. కానీ ఇప్పుడు దానికి వ్యతిరేకంగా ఒకర్ని మరొకరు తిట్టుకోవడానికి పనికొస్తోంది.



# ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ మూవీ 'జాక్-కొంచెం క్రాక్'


స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'జాక్ కొంచెం క్రాక్'. వైష్ణవి చైతన్య హీరోయిన్‌గా నటించారు. ఈ మూవీ ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. ఇప్పటికే రిలీజ్ చేసిన పాటలు, టీజర్ సినిమా మీద పాజిటివ్ బజ్‌ను క్రియేట్ చేశాయి. తాజాగా ఈ చిత్రం నుంచి కిస్ అంటూ సాగే రొమాంటిక్ సాంగ్‌ను మేకర్స్ గురువారం రోజున విడు దల చేశారు. ఈ సందర్భంగా జరిగిన ప్రెస్ మీట్‌లో పాటల రచయిత సనారె మాట్లాడుతూ, "శ్రీవెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌లో పాట రాయటం చాలా ఆనందంగా ఉంది. ఈ అవకాశం ఇచ్చిన డైరెక్టర్ భాస్కర్‌కి, మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలికి, నిర్మాతలు బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, పాటను పాడిన వారికి మన స్ఫూర్తిగా ధన్యవాదాలు" అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి మాట్లాడుతూ, "నాకు ఈ సినిమాలో వర్క్ చేసే అవకాశం ఇచ్చిన బొమ్మరిల్లు భాస్కర్‌కి థాంక్స్. ఇద్దరు సెల్ఫ్ మేడ్ స్టార్స్‌తో ఈ సినిమాలో వర్క్ చేసే అవకాశం నాకు కలిగింది. నిర్మాతలు బాపినీడు, బివిఎస్ఎన్ ప్రసాద్‌కి థాంక్స్" అన్నారు. నిర్మాత బివిఎస్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ, "సిద్ధు యూత్‌లోనే కాదు.. అన్నీ ఏజ్‌ల వారికి స్టార్ బాయ్‌గా మారారు. 'జాక్' సినిమాను భాస్కర్ చాలా చక్కగా హ్యాండిల్ చేశాడు. గ్యారంటీగా మంచి సినిమా అవుతుందని భావిస్తున్నాను" అన్నారు. హీరోయిన్ వైష్ణవి చైతన్య మాట్లాడుతూ, "ఇంత మంచి పాటను రాసిన సనారెకి థాంక్స్. యూత్‌కి కనెక్ట్ అయ్యేలా పాటను రాశారు. ఇంత మంచి ట్యూన్‌ను అందించిన సురేష్‌కి. డైరెక్టర్ భాస్కర్‌కి థాంక్స్. ఏప్రిల్ 10న మా జాక్ మూవీ థియేటర్స్‌లోకి వస్తుంది. మీకు సినిమా నచ్చుతుందని ఆశిస్తున్నాను" అన్నారు. హీరో సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ "మూవీకి 'జాక్ కొంచెం క్రాక్' అనే టైటిల్ పెట్టటానికి కారణం.. రైమింగ్‌తో పాటు హీరో క్యారక్టరైజేషన్. సినిమా చూస్తే అర్థమవుతుంది. ప్రతి మనిషి లైఫ్‌లో ఓ గోల్ ఉంటుంది. అయితే ఏ పని చేస్తున్నామనే దాంతో పాటు ఆ పనిని మనం ఎలా చేస్తున్నామనేది కూడా చాలా ఇంపార్టెంట్. ఓ పనిని ఇలానే ఎందుకు చేయాలి.. మరోలా నేను చేస్తానని కొందరు అంటుంటారు. అందుకనే ఈ టైటిల్ పెట్టాం. హీరో క్యారెక్టరైజేషన్ గురించి భాస్కర్ చెప్పగానే నచ్చి సినిమా చేయటానికి ఒప్పుకున్నాను. నేను కూడా రైటర్‌ని కాబట్టి కొన్ని ఇన్‌పుట్స్ ఇచ్చాను.. దాన్ని భాస్కర్ ఆయన కథకు అనుగుణంగా డెవలప్ చేశారు. ప్రేక్షకులను నవ్విస్తూనే రెస్పాన్సిబుల్‌తో ఉండే పాత్రలో కనిపిస్తాను అన్నారు.



# రామ్ సినిమా రాజమండ్రి షెడ్యూల్ పూర్తి




ఉస్తాద్ రామ్ పోతినేని కథా నాయకుడిగా టాప్ ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్ ఓ సినిమాను నిర్మిస్తోంది. మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి విజయం తర్వాత యంగ్ అండ్ టాలెంటెడ్ మహేష్ బాబు పి దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మాతలు. హీరోగా రామ్ 22వ చిత్రమిది. అందుకని ఆర్ఎపిఒ22ను వర్కింగ్ టైటిల్‌గా వ్యవహరిస్తున్నారు. రాజమండ్రిలో సెకండ్ షెడ్యూల్ ముగించుకుని చిత్ర బృందం హైదరాబాద్ వచ్చింది. రాజమండ్రిలో 34 రోజుల పాటు నాన్ స్టాప్‌గా డే అండ్ నైట్ షూటింగ్ చేసింది ఆర్ఎపిఒ22 యూనిట్. ఈ షెడ్యూల్‌లో రెండు పాటలతో పాటు ఒక యాక్షన్ సీక్వెన్స్, ఇంకా ఇంపార్టెంట్ టాకీ సీన్స్ షూటింగ్ చేశారు. రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో అందమైన లొకేషన్లను అంతే అందంగా క్యాప్చర్ చేశామని చిత్ర బృందం చెబుతోంది. రాజమండ్రిలో జరిగిన చిత్రీకరణలో హీరో రామ్ పోతినేని, హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే సహా రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేష్ తదితర తారాగణం మీద సినిమా చిత్రీకరించారు. మార్చి 28వ తేదీ నుంచి హైదరాబాద్ షెడ్యూల్ మొదలవుతుందని నిర్మాతలుతెలిపారు. రామ్ జంటగా భాగ్యశ్రీబోర్సే కథా నాయికగా నటిస్తున్న ఈసినిమాలో రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ.




# ఫ్రెష్ కంటెంట్‌తో 'టుక్‌టుక్'

ఫాంటసీ, మ్యాజికల్ అంశాలతో ఓ వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో, ఫ్రెష్ కంటెంట్‌తో రాబోతున్న చిత్రం టుక్ టుక్. హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు,సాన్వీ మేఘన, నిహాల్ కోధాటి ముఖ్యతారలుగా రూపొందుతున్న ఈ చిత్రానికి సి.సుప్రీత్ కృష్ణ దర్శకుడు. మార్చి 21న చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత రాహుల్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.. ఆ విశేషాలివి. **మీ నేపథ్యం?**
ఐటీ మల్టీపుల్ కంపెనీలో పనిచేస్తుండేవాడిని, ఆ తరువాత యానిమేషన్ స్టూడియో స్టార్ట్ చేశాను. ఓ కామన్ ఫ్రెండ్ ద్వారా పరిచయమైన దర్శకుడు సుప్రీత్‌తో కలిసి మొదటగా అలనాటి చిత్రాలు అనే వెబ్‌సీరిస్ చేశాను. నాకు సినిమాలంటే ఇంట్రెస్ట్ కూడా ఉండటంతో థియేటర్‌సినిమా చేయాలని అనుకున్నాను. సుప్రీత్ చెప్పిన ఈ ఫాంటసీ థ్రిల్లర్ నచ్చడంతో టుక్‌టుక్ చిత్రాన్ని స్టార్ట్ చేశాను. కంటెంట్ నచ్చడంతో అందరూ కలిసి, నేను యానిమేషన్‌లో కూడా ఉండటంతో.. ఈ పాంటసీ కథతో టుక్‌టుక్ కథను ప్రారంభించాం. దీనినే ఫ్రాంఛైజీ. కంటెట్‌తో పాటు కమర్షియల్ అంశాలు. **టుక్‌టుక్‌పై మీకున్న నమ్మకం ఎలాంటింది?** కంటెంట్ ఉంటే ప్రేక్షులు ఆదిరిస్తారు అనేది నానమ్మకం, ఏ భాషలోనైనా కొత్తదనం కూడా ఆదరిస్తారు కంటెంట్ నచ్చితేనే కమర్షియల్ హిట్‌లుగా నిలుస్తాయి. ప్రొడ్యూసర్‌గా నా నమ్మకం అదే. **టుక్‌టుక్ టైటిల్ జస్టిఫికేషన్ ఏమిటి?** టుక్ టుక్ అంటో త్రీవీల్డ్ ఆటోను అంటారు. సినిమాలో టుక్ టుక్ ఆటో కీలక పాత్ర పోషించింది. అందుకే ఆ టైటిల్ పెట్టాం. సినిమాలో ఆర్టిస్టలను కూడా పాత్రలకు ఎవరి సెట్ అయితే వాళ్లనే తీసుకున్నాం. **టుక్ టుక్‌లో కీలక పాత్ర పోషించిన రోషన్ నటించిన కోర్టు హిట్ కావడం మీ సినిమాకు ఎంత వరకు ప్లస్ అవుతుంది?** కోర్టు సినిమా హిట్ అవ్వడం మా సినిమాకు మంచి శుభారంభం. ఈ సినిమాతో కూడా రోషన్‌కు కూడా మంచి పేరు వస్తుంది. తప్పకుండా కోర్టు హిట్ అవ్వడం చాలా ప్లస్ అవుతుంది. మా సినిమాకు కూడా ప్రేక్షకుల్లో మంచి బజ్ వుంది. **టుక్‌టుక్‌లో ప్రధాన అంశాలు ఏమిటి?** ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్, ఫాంటసీ, థ్రిల్లింగ్ అన్ని అంశాలు ఉంటాయి. ప్రేక్షకులను రెండున్నర గంటలు నాన్‌స్టాప్‌గా ఎంటర్‌టైన్ చేస్తుంది.ఎక్కడ కూడా బోర్ కొట్టదు. **దర్శకుడు సుప్రీత్‌తో ఈ సినిమా చేయడానికి కారణం?** సుప్రీత్ చెప్పిన కథ బాగా నచ్చింది మా థింకింగ్ కూడా సిమిలర్‌గా ఉంటుంది. మా ఇద్దరి ఆలోచనలు, ఒకేలా ఉంటాయి. అతని మీద చేయగలడు అనే నమ్మకం ఉంది. మా నమ్మకాన్ని నిలబెట్టాడు. **ఈ చిత్రంలో ఉన్న మ్యాజికల్ ఎలిమెంట్స్ గురించి?** వెహికల్‌లో ఉన్నా మ్యాజికల్ ఎలిమెంట్స్‌కు ఆడియన్స్ కనెక్ట్ అవుతారు. టీజర్, ట్రైలర్ చూడగానే అందరిలో ఆసక్తి ఉంది. అసలు ఇది పాంటసీనా, హారర్ అనే ఆసక్తి ఉంది. అందరికి సినిమాలో ఏముంది అనే ఆసక్తి అందరిలో మొదలైంది. **సినిమా విడుదలకు ముందే అన్ని హక్కులు అమ్మేశారని తెలిసింది?** సినిమా విడుదలకు ముందే డిజిటల్, శాటిలైట్ రైట్స్ హక్కులకు మంచి ఫ్యాన్సీ రేట్ వచ్చింది. థియేట్రికల్ రిలీజ్ కూడా ఎంతో శాటిస్‌ఫాక్షన్‌గా చేస్తున్నాం. **మీరు ఎలాంటి సినిమాలు చేయాలని అనుకుంటున్నారు?** ఈ రిజల్ట్‌ను బట్టి.. ఇదే కాంబినేషన్‌లో ఇంకా బెటర్ సినిమాలు చేయాలని అనుకుంటున్నాను. అన్ని జానర్ సినిమాలు టచ్ చేయాలని ఉంది. **ఈ సినిమా చూసిన వాళ్ల నుంచి ఏమైనా ఫీడ్‌బ్యాక్ వచ్చిందా?:** ఆల్‌రెడీ సినిమా చూసిన వాళ్లు మంచి ఫీడ్‌బ్యాక్ ఉంది. ఓటీటీ, శాటిలైట్ వాళ్లు చూసి ఆ హక్కులను తీసుకున్నారు.




# చట్టాలకు లోబడి మాత్రమే యాడ్స్ చేస్తున్న మా హీరో

బెట్టింగ్ యాప్స్‌కు హీరో విజయ్ దేవరకొండ ప్రచారం చేశాడనే రూమర్స్ ప్రసారమవుతున్న నేపథ్యంలో ఆయన టీమ్ ఈ అసత్య వార్తలపై క్లారిటీ ఇచ్చింది. స్కిల్ బేస్డ్ గేమ్స్‌కు మాత్రమే విజయ్ దేవరకొండ ప్రచారం నిర్వహించాడని, ఆ కంపెనీలు చట్టప్రకారమే నిర్వహిస్తున్నాయని ఈ సందర్భంగా విజయ్ పీఆర్ టీమ్ తెలియజేసింది. ఆన్ లైన్ స్కిల్ బేస్డ్ గేమ్స్ అనుమతి ఉన్న ప్రాంతాలకు మాత్రమే విజయ్ దేవరకొండ ప్రచారకర్తగా పరిమితమయ్యారు. విజయ్ దేవరకొండ ఏ యాడ్ చేసినా, ఏ కంపెనీకి ప్రచారకర్తగా ఉన్నా ఆ కంపెనీని లీగల్‌గా నిర్వహిస్తున్నారా లేదా అనేది ఆయన టీమ్ క్షుణ్ణంగా పరిశీలిస్తుంది. ఆ కంపెనీ లేదా ప్రొడక్ట్‌కు చట్టప్రకారం అనుమతి ఉంది అని వెల్లడైన తర్వాతే విజయ్ ఆ యాడ్‌కు ప్రచారకర్తగా ఉంటారు. విజయ్ దేవరకొండ అలాంటి అనుమతి ఉన్న ఏ 23 అనే సంస్థకు బ్రాండ్ అంబాసిడర్ గా పనిచేశారు. రమ్మీ స్కిల్ బేస్డ్ గేమ్ అని గతంలో పలుమార్లు గౌరవనీయ సుప్రీం కోర్టు తెలియ జేసింది.ఏ 23 అనే కంపెనీతో విజయ్ దేవరకొండ ఒప్పందం గతేడాది ముగిసింది. ఇప్పుడు ఆ సంస్థతో విజయ్ కు ఎలాంటి సంబంధం లేదు. విజయ్ దేవరకొండ విషయంలో పలు మాధ్యమాలలో ప్రసారమవుతున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదు. విజయ్ ఇల్లీగల్‌గా పనిచేస్తున్న ఏ సంస్థకూ ప్రచారకర్తగా వ్యవహరించలేదు. పీఆర్ టీమ్ విజయ్ దేవరకొండ.




# యష్ లేటెస్ట్ యాక్షన్ మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోనప్స్'

రాకింగ్ స్టార్ యష్.. లేటెస్ట్ సెన్సేషనల్ పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోనప్స్' గురించి అమెరికన్ నటుడు కైల్ పాల్ తన సోషల్ మీడియా ద్వారా స్పందించారు. ఇందులో ఆయన ఓ కీలక పాత్రలో నటించారు. దీని గురించి కైల్ పాల్ స్పందిస్తూ "నేను ఇప్పటి వరకు చేసిన సినిమాల్లో 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోనప్స్' సెట్స్‌లో నాకు కలిగిన ఎక్స్‌పీరియెన్స్ బెస్ట్ అని చెబుతాను" అన్నారు భాష పరంగా తనకు తెలియకపోయినప్పటికీ సినిమా సెట్స్‌లోకి అడుగు పెట్టిన వివరాలను ఆయన వివరించారు. 'తెలియని భాషలో భావోద్వేగ సన్నివేశాల్లో నటించటం అనేది ఎంతో సవాలుతో కూడుకున్నది. కానీ ఆ వర్కింగ్ ఎక్స్‌పీరియెన్స్‌ను మరచిపోలేను' అని పాల్ వెల్లడించారు. "నేను ఇండియాలో టాక్సిక్ సినిమా షూటింగ్ సమయంలో ఓ గొప్ప అనుభవాన్ని పొందాను. ఆరోజు ఉదయం మూడు గంటలకు షూటింగ్ చేస్తున్నాం. అదొక భావోద్వేగ సన్నివేశం. అలాంటి సన్నివేశంలో నేను కన్నడలో మాట్లాడాలి. ఆ పదాలను తార్కికంగా ఆలోచిస్తూ భావోద్వేగంలో ఉండాలి. కానీ నేను తార్కికంగా ఆలోచించలేకపోయాను. కాబట్టి భావోద్వేగాన్ని గొప్పగా సన్నివేశంలో పలికించలేకపోయాను" అని తెలిపారు పాల్. అయితే నటుడిగా పాల్‌కు ఆ క్షణం ఎంతగానో గుర్తుండిపోయింది. అందుకు కారణం డైరెక్టర్ గీతూ మోహన్ దాస్ నుంచి ఆయనకు లభించిన మద్దతు. 'డైరెక్టర్ గీతు అద్భుతమైన వ్యక్తి. నేను సన్నివేశాన్ని పూర్తి చేయటానికి చాలా సమయం తీసుకున్నప్పటికీ ఆమె సహకారాన్ని అందించింది. మీరు ఈ సన్నివేశంలో బాగా నటించగలరు. ప్రయత్నించండి.. కావాలంటే ఇంకా సమయం తీసుకోండి అని నన్నెంతగానో ఉత్సాహపరిచారు. ఇది నటుడిగా నేను ఎదుర్కొన్న గొప్ప అనుభవం. నాకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది" అన్నారు కైల్ పాల్. యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న టాక్సిక్ చిత్రం కన్నడ చిత్రసీమ పేరుని మరో అడుగు ముందుకు తీసుకెళ్లటానికి వేస్తోన్న ధైర్యమైన అడుగుగా ప్రస్తావించవచ్చు. ఆడియెన్స్‌కి సినిమాటిక్ విజువల్ ఎక్స్‌పీరియెన్స్ అందించనుంది. కన్నడ, ఇంగ్లీష్‌లో రూపొందిస్తోన్న తొలి భారీ చిత్రంగా టాక్సిక్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. మన భారతీయ కథనానికి, అంతర్జాతీయ ప్రేక్షకుల మధ్య వారధిగా ఈ చిత్రం నిలుస్తుంది. గొప్ప సంస్కృతి కలిగిన కన్నడ చిత్రసీమను మన ఇండియన్ సినీ ప్రేక్షకులకు ఓ సరికొత్త ప్రామాణికతను నిర్ధారిస్తూ ముందుకు తీసుకెళ్లటానికి ఈ చిత్రం కేంద్రబిందువుగా మారుతుంది. ఈ చిత్రాన్ని హిందీ, తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ భాషలు సహా పలు భారతీయ, అంతర్జాతీయ భాషల్లో విడుదల చేయటానికి సన్నాహాలు చేస్తున్నారు. కె.వి.ఎన్.ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్స్ పై వెంకట్ కె.నారాయణ, యష్ నిర్మిస్తోన్న 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోనప్స్' చిత్రం యాక్షన్ జోనర్‌కి ఓ సరికొత్త నిర్వచనాన్ని చెప్పనుంది.



# 'చౌర్య పాఠం' నుంచి సాంగ్ రిలీజ్

బ్లాక్ బస్టర్ డైరెక్టర్ త్రినాథ రావు నక్కిన తన అప్ కమింగ్ క్రైమ్‌కామెడీ డ్రామా చౌర్య పాఠంతో మూవీ ప్రొడక్షన్ అడుగుపెడుతున్నారు. యంగ్ ట్యాలెంటెడ్ ఇంద్రా రామ్‌ను హీరోగా పరిచయం చేస్తున్నారు. కార్తికేయ 2 మొదలైన చిత్రాలకు చందూ మొండేటి వద్ద అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేసిన నిఖిల్ గొల్లమారి ఈ మూవీతో దర్శకునిగా పరిచయం అవుతున్నారు. నక్కిన నెరేటివ్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ మూవీకి వి చూడమణి సహ నిర్మాత. ఈ చిత్రం టీజర్ థ్రిల్లింగ్ క్రైమ్, డార్క్ హ్యూమర్ బ్లెండ్‌తో ఇప్పటికే బజ్ క్రియేట్ చేసింది. నాగ చైతన్య లాంచ్ చేసిన ప్రమోషనల్ సాంగ్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. మేకర్స్ టెర్రిఫయింగ్ నెంబర్ ఆడ పిశాచం సాంగ్‌ని రిలీజ్ చేశారు. దావ్‌జాండ్ ఈ సాంగ్ ఎనర్జిటిక్ వైబ్ అండ్ బీట్స్‌తో క్యాచిగా కంపోజ్ చేశారు. ఆంథోనీ దాసన్ సాంగ్‌ని పాడిన విధానం మరింత ఆకట్టుకుంది. భాస్కరభట్ల రవికుమార్ రాసిన లిరిక్స్ ఫన్ ఫుల్‌గా వున్నాయి. ఈ సాంగ్‌లో లీడ్ కాస్ట్ ప్రజెన్స్ స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచింది. ఈ సాంగ్ ఇన్‌స్టంట్ హిట్‌గా నిలిచింది. ఈ చిత్రంలో పాయల్ రాధాకృష్ణ కథానాయికగా నటిస్తుండగా, రాజీవ్ కనకాల, మస్త్ అలీ ముఖ్యమైన కీలక పాత్రలను పోషిస్తున్నారు. ఈ చిత్రంలో మరో బిగ్గెస్ట్ ఎట్రాక్షన్ ఈ కథను సినిమాటోగ్రాఫర్ కార్తీక్ ఘట్టమనేని రాశారు. అతను కెమెరా వర్క్ కూడా నిర్వహిస్తున్నారు. దావ్‌జాంద్ మ్యూజిక్ అందిస్తున్నారు. హనుమాన్ ఫేమ్ శ్రీ నాగేంద్ర తంగాల ప్రొడక్షన్ డిజైనర్. ఉతుర ఎడిటర్. సమ్మర్‌లో వన్ ఆఫ్ ది బిగ్గెస్ట్ అట్రాక్షన్‌గా చౌర్య పాఠం ఏప్రిల్ 18న థియేటర్లలోకి రాబోతోంది. తారాగణం: ఇంద్ర రామ్, పాయల్ రాధాకృష్ణ, రాజీవ్ కనకాల, మస్త్ అలీ, మాడి మానేపల్లి, అంజి వల్లుమాన్, ఎడ్వర్డ్ పెరెజీ, సుప్రియ ఐసోలా, క్రిష్ రాజ్, సహదేవ్, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం:నిఖిల్ గొల్లమారి, నిర్మాత: నక్కిన త్రినాధరావు, బ్యానర్: నక్కిన నెరేటివ్, కథ అండ్ డీవోపీ: కార్తీక్ ఘట్టమనేని, ప్రొడక్షన్ డిజైన్: శ్రీ నాగేంద్ర తంగాల, సంగీతం: దావ్‌జాంద్, ఎడిటర్: ఉత్తర, సహ నిర్మాత: వి చూడామణి, సాహిత్యం: బాస్కర బట్ల, కళ్యాణ చక్రవర్తి, రోల్ రైడా.




# 'పెళ్లికాని ప్రసాద్' ప్రిరిలీజ్

సప్తగిరి హోల్సమ్ ఎంటర్ టైనర్ పెళ్లి కాని ప్రసాద్. అభిలాష్ రెడ్డి గోపిడి దర్శకత్వం వహించిన ఈ చిత్రం హ్యూమర్, సోషల్ కామెంటరీ బ్లెండ్‌తో పర్ఫెక్ట్ ఎంటర్ టైనర్ గా ఉండబోతోంది. థామ మీడియా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై విజన్ గ్రూప్ కె.వై. బాబు, భాను ప్రకాష్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్ రెడ్డి ముత్యాల కలిసి నిర్మించారు. చాగంటి సినిమాటిక్ వరల్డ్ సమర్పిస్తోంది. దిల్ రాజు నేతృత్వంలోని ప్రముఖ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ ట్రైలర్ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేశాయి. ఈ సినిమా మార్చి 21న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా ప్రిరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. హీరో సప్తగిరి మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. బ్రహ్మానందం మాటలతో నా మనసు బరువెక్కింది. ఇది జీవితంలో మర్చిపోలేని రోజు. గురువుకి పాదాభివందనం. మారుతి అన్న నన్ను వాళ్ళ ఇంట్లో ఒక ఫ్యామిలీ మెంబర్ లాగా చూస్తారు. నా జీవితం మారుతి అన్నతోనే స్టార్ట్ అయింది. ఈసినిమాకి అండ దండ కొండ లాగా నిలబడటం జీవితంలో మర్చిపోలేను. మమ్మల్ని బ్లెస్ చేయడానికి వచ్చిన నిర్మాత ఎస్కేన్‌కి థాంక్యూ. ఈ సినిమాని రిలీజ్ చేస్తున్న హర్షిత్ రెడ్డికి థాంక్యూ. ఎస్విసిలో ఈ సినిమా రిలీజ్ చేస్తున్నందుకు వారికి రుణపడి ఉంటాను. దాదాపు ఏడాదిగా ఈ సినిమా కోసం కష్టపడ్డాం. డైరెక్టర్ అభిలాష్ రెడ్డి చాలా అద్భుతంగా తీశాడు చాలా రోజుల తర్వాత నాకు మంచి కంటెంట్‌తో ఉన్న సినిమాని ఇచ్చాడు. అభిలాష్ చాలా మంచి డైరెక్టర్ అవుతాడు. తనకి ఈ సినిమా చాలా కొత్త జీవితాన్ని ఇస్తుంది. మా నిర్మాతలు చాలా ప్యాషన్‌తో పని చేశారు. ప్రమోదిని తన క్యారెక్టర్‌లో డామినేట్ చేశారు. ఇకపై ఆమెకు వచ్చే క్యారెక్టర్‌లో చాలా మార్పులు వస్తాయి. ఈ సినిమా చూసిన వాళ్లంతా కూడా ప్రమోదని యాక్టింగ్ గురించి గొప్పగా మాట్లాడుకుంటున్నారు. ఈ సినిమాలో నాకు మా ఫాదర్ క్యారెక్టర్ చేసిన మురళీధర్‌కి చాలా మంచి కెమిస్ట్రీ ఉంటుంది. మా ఇద్దరి క్యారెక్టర్స్ మిమ్మల్ని చాలా అలరిస్తాయి. హీరోయిన్ ప్రియాంక శర్మ చాలా అద్భుతంగా పెర్ఫార్మ్ చేసింది. ఈ సినిమా తర్వాత తనకి మంచి అవకాశాలు వస్తాయి. సినిమా ఫన్ బ్లాస్ట్ లా ఉంటుంది. మార్చ్ 21న థియేటర్స్‌కి వస్తున్నాం. మీ గొప్ప మనసుతో ఆదరించాలని కోరుకుంటున్నాను. 100శాతం థియేటర్స్‌లో ఆడియన్స్‌ని నవ్విస్తాం. 20 సంవత్సరాలు అయింది ఇండస్ట్రీకి వచ్చి. అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాను. కమెడియన్‌గా మీ గుండెల్లో నిలిచిపోయే సినిమాలుచేశాను. హీరోగా మంచి సినిమాలు చేశాను. ప్రతిసారి నన్ను నేను నిలబెట్టుకోవడానికి చేసిన యుద్ధంలో ఇండస్ట్రీ, ఆడియన్స్ నాకు అండగా ఉన్నారు. ప్రభాస్ అన్న, వెంకటేష్, మారుతి అన్న, ఎస్కేన్ దిల్ రాజ్, శిరీష్, హర్షిత్ అన్న, అనిల్ రావిపూడి అన్న ఇంతమంది గొప్ప వ్యక్తుల బ్లెస్సింగ్స్ మా సినిమాకి దొరకడం అదృష్టంగా భావిస్తున్నాను. ఈ వేడుకు వచ్చి మమ్మల్ని బ్లెస్ చేసిన జగన్ అన్నకే థాంక్ యూ. ఇండస్ట్రీ నుంచి ఈ సినిమా గొప్ప సక్సెస్ అవుతుందనే బ్లెస్సింగ్స్ ఉన్నాయి. ప్రేక్షక దేవుళ్ళు మా సినిమాని ఆదరించి గొప్ప విజయాన్ని ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాను. సినిమా చూసే ప్రతి ప్రేక్షకులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. పెయిడ్ ప్రీమియర్స్ 100శాతం ఫుల్ అవుతున్నాయి. దయచేసి సినిమా చూడండి. బ్లెస్ చేయండి. మీ ఆశీర్వాదం కోసం ఎదురుచూస్తున్నాను అన్నారు. హాస్యబ్రహ్మ బ్రహ్మానందం మాట్లాడుతూ, అందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు. ఈ వేడుకకి రావడానికి ప్రధాన కారణం సప్తగిరి. చిరంజీవి మొన్న బ్రహ్మ ఆనందం ఈవెంట్‌కి ఇన్విటేషన్ లేకుండానే నేనే వస్తానని వచ్చారు.



# కేంద్ర ప్రభుత్వంపై మస్క్ 'ఎక్స్' దావా!

## కంటెంట్ బ్లాక్‌చేసే అధికారం లేదని వాదనలు



**వాషింగ్టన్, మార్చి 20:** ఎలాన్ మస్క్ నేతృత్వంలో నడుస్తున్న సోషల్‌మీడియా వెబ్‌సైట్ 'ఎక్స్' భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా కర్ణాటక హైకోర్టులో పిటిషన్ దాఖలుచేసింది. ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని సెక్షన్ 79(3) ప్రకారం చూస్తే ప్రభుత్వ అధికారులకు కంటెంట్‌ను ఆన్‌లైన్‌లో బ్లాక్‌చేసే అధికారాలు లేవని పేర్కొంటూ ఈ పిటిషన్ దాఖలుచేసింది. ఐటి చట్టం ఆధారంగా ఎక్స్ మీడియాలాంటి సంస్థలు కొంత చట్టపరమైన రక్షణను కోల్పోతున్నాయని తమకు ఏదైనా చిక్కులు వస్తే న్యాయపరంగా ఒక్కటే ఆధారంగా భావిస్తూ ప్రభుత్వం ఇలాంటి చర్యలు తీసుకోకుండా కట్టడిచేయాలంటూ పిటిషన్‌ను దాఖలుచేసారు. ఐటిచట్టంలోని ప్రభుత్వం చెపుతున్న సెక్షన్ ప్రభుత్వానికి తమ వెబ్‌లో కంటెంట్ బ్లాక్‌చేసే అధికారాలను ఇవ్వడంలేదని సెక్షన్ 69(ఎ)ను పక్కనపెట్టి ఈ సెక్షన్ ప్రయోగిస్తున్నారని ఆరోపించింది. కంటెంట్ బ్లాక్‌చేసే ముందు 69(ఎ) ఒక సమగ్ర విధానాన్ని తెలియజేస్తోందని ఇదే సుప్రీంకోర్టు 2015లో సింఘాల్ జడ్జిమెంట్‌లో కూడా స్పష్టం చేసిందన్నారు. కంటెంట్ బ్లాక్‌చేయడం అనేది కొన్ని నిర్దిష్టమైన కారణాల ఆధారంగా మాత్రమే జరగాలి. జాతీయభద్రత, రక్షణరంగానికి ముప్పువంటి కంటెంట్లను బ్లాక్‌చేసేముందు సమీక్షచేసి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని వివరించింది. అందుకు భిన్నంగా సెక్షన్ 79(3)(బి)లో చెప్పిన ప్రకారం అధికార యంత్రాంగానికి ఏకపక్షంగా కంటెంట్ బ్లాక్‌చేసే అధికారాలు ఏమీలేవని సరైన తనిఖీలేకుండా ఏకపక్షంగా బ్లాక్‌చేయడానికి వీలులేదని ఎక్స్ యంత్రాంగం వాదించింది. ఇలాంటి విధానాలు భారత్‌లో అత్యంత తీవ్ర స్థాయిలో సెన్సార్‌షిప్ అమలవుతున్నట్లు తెలుపుతోందన్నారు. అంతేకాకుండా ప్రభుత్వం సహయోగ్ పోర్టల్‌లో నమోదుకావాలని ఒత్తిడి చేస్తోందని ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆరినడనేషన్ సెంటర్ (14సి) ద్వారా ఐటిచట్టంలోని 79(3)(బి)ని కూడా అణిచివేసేందుకు వీలు కల్పిస్తోందని వాదించింది. సహయోగ్ అంటేనే సెన్సార్‌షిప్ పోర్టల్‌గా మారిందని, వాస్తవానికి ఎలాన్ మస్క్ ఎక్స్‌సంస్థ 2021 ఐటి మార్గదర్శకాలన్నింటినీ గౌరవిస్తోందని ప్రత్యేక ఫిర్యాదులు, పరిష్కారవేదికను కూడా ఏర్పాటుచేసిందని చెప్పారు. జస్టిస్ ఎం నాగరప్రసన్న ఈ పిటిషన్‌ను విచారించి ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లయితే మళ్లీ కోర్టుకు రావచ్చని సూచించారు. ప్రభుత్వపరంగా ఇప్పటివరకూ ఎక్స్‌పైఎలాంటి ఒత్తిడిలేదని, అలాగేసహయోగ్ పోర్టల్‌లో జాయిన్‌కావాలన్న నిర్బంధంకూడా ఏదీ తీసుకురాలేదన్నారు. తనపిటిషన్‌లో ఎక్స్ ఎలక్ట్రానిక్స్ ఐటి (మైయిటీ) శాఖ కూడా ఇతర మంత్రిత్వ శాఖలు, రాష్ట్రాలు, పోలీసు శాఖలను కూడా ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటుచేసి కంటెంట్‌ను బ్లాక్ చేయించేందుకు కృషిచేస్తోందని ఆరోపించింది. ఇందుకు ఆధారాలను కూడా కొన్ని బ్లాక్‌చేస్తూ జారీచేసిన ఉత్తర్వులు సమర్పించింది. రైల్వే మంత్రిత్వశాఖ గత ఏడాది ఫిబ్రవరిలో జారీచేసిన ఉత్తర్వులను ఇందుకు జోడించింది.



# భారత్ సుంకాలు తగ్గించే అవకాశం

## అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

**వాషింగ్టన్, మార్చి 20:** భారత్ విధించే ట్యారిఫ్‌లు తగ్గింపు విషయంలో ఆమెరికాఅధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వరం మారింది. భారత్ సుంకాలు తగ్గించే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ఆశాభావం వ్యక్తంచేసారు. తాజాగా ఆయన బ్రిట్‌బాట్‌న్యూస్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ భారత్ ట్యారిఫ్‌లు తగ్గించే అవకాశం ఉందన్నారు. గతంలోకూడా ఒక సందర్భంలో భారత్ పన్నులు తగ్గించేందుకు అంగీకరించిందని, అదంతా తన ఘనతే అని చెప్పారు.

భారత్ సుంకాలు తగ్గించే అవకాశం ఉందని విశ్వసిస్తున్నట్లు చెప్పిన ట్రంప్ తాను మాత్రం ఏప్రిల్ రెండునుంచి వారెంత విధిస్తే మేం కూడా అంటే అమెరికాకూడా అంతే విధిస్తుందని బదులిచ్చారు. ఇటీవలికాలంలో ఆయన ఏప్రిల్‌రెండవ తేదీని లిబరేషన్‌డేగా అభివర్ణిస్తుండటం గమనార్హం. వాణిజ్య యుద్ధాల నేపథ్యంలో ఇరుదేశాలమధ్య పన్నుల విధానంలో కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయన్న అంచనాల నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు వెలువడటం గమనార్హం. ఒకవేళ పన్నుల తగ్గింపు నిర్ణయం వెలువడితే అది భారత ఆర్థికవ్యవస్థపై వాణిజ్య మిగులు, ఫైనాన్షియల్ మార్కెట్లపై ప్రభావం చూపించింది. ముఖ్యంగా వ్యవసాయోత్పత్తులు ఆటోమొబైల్స్, ఎలక్ట్రానిక్స్ రంగాలు భారీ పోటీని ఎదుర్కొంటాయి. దీనితోపాటు భారతప్రభుత్వానికి పన్నులు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్నాయి. ట్రంప్ భారత్‌లో పన్నుల విధానాలపై తీవ్ర అసంతృప్తితో ఉన్న సంగతి తెలిసిందే. గతంలో కూడా ఆయన మాట్లాడుతూ భారత్ ట్యారిఫ్‌ల కింగ్ అన్న మాటలు కూడా ఉన్నాయి. భారత్ అమెరికా వాణిజ్యలోటు 100 బిలియన్ డాలర్లు ఉందని కూడా ఆయన ప్రస్తావించారు.

అయితే భారత్ విదేశాంగమంత్రి జైశంకర్‌మాత్రం మీరునమ్మినా నమ్మకపోయిన ఆసుంకాలు ఆంక్షలు అనేవి వాస్తవ అంశాలు. దేశాలు వాటిని అమలుచేస్తున్నాయి. నిజానికి గత దశాబ్దాన్ని మీరు గమనించినట్లయితే సామర్థ్యం ఏదయినా గొప్ప ఆయుధీకరణను చూసామని, ఆర్థిక ప్రవాహం ఇంధన సరఫరా సాంకేతికత బదలీ పెరగడంచూసామని ఇదేప్రపంచంలో జరుగుతున్న వాస్తవమన్నారు. ఒకదేశం సమగ్రజాతీయ శక్తిగా ఎదిగేపోరాటానికి వ్యాపార వాణిజ్య సంబంధాలు ముఖ్యమైన సహకారం అందిస్తాయన్నారు. అందుకే ఆ వ్యాపారంకోసం దేశాలు పోటీపడుతున్నాయని తెలిపారు.



# నినాదాలు రాసి ఉన్న టీ షర్టులు ధరించి సభకు రావద్దు

## సభ్యులు హుందాగా వ్యవహరించాలి: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా!

**న్యూఢిల్లీ, మార్చి 20:** ప్రతిపక్ష పార్టీ ఎంపిలు నినాదాలు రాసి ఉన్న టీ షర్టులు ధరించి లోక్‌సభకు రావడంపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అసహనం వ్యక్తం చేశారు. ఇది పార్లమెంటరీ నియమాలకు విరుద్ధమని వ్యాఖ్యానించారు. అనంతరం సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. నిబంధనలు, విధానాలతో సభలు నిర్వహిస్తారు. సభ్యులు హుందాగా వ్యవహరించి సభ గౌరవాన్ని కాపాడుకోవాలి. కానీ, ప్రతిపక్ష పార్టీలోని కొంతమంది ఎంపిలు నిబంధనలు పాటించడం లేదు. ఇది సరైనది కాదు. ఎంత పెద్ద నాయకుడైనా సభ గౌరవాన్ని తగ్గించే ఇలాంటి దుస్తులు ధరించడం ఆమోద యోగ్యం కాదు అని ఓం బిర్లా పేర్కొన్నారు. ఈ సందర్భంగా సభను మధ్యాహ్నానికి వాయిదా వేస్తూ సభ్యులు బయటకు వెళ్లి దుస్తులు మార్చుకుని రావాలని సూచించారు. నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రంలోనిబిజెపి, తమిళనాడులోని డిఎంకెల మధ్య వివాదం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గురువారం డిఎంకె సభ్యులు నినాదాలు రాసిఉన్న టీ షర్టులు ధరించి పార్లమెంటుకువచ్చారు. 'పునర్విభజన న్యాయబద్ధంగా జరగాలి. తమిళనాడు పోరాడుతుంది. తమిళనాడు గెలుస్తుంది' అనే నినాదాలు టీ షర్టులపై రాసి ఉన్నాయి. దీనిపై పార్లమెంటు వెలుపల నిరసనలు తెలిపారు. లోక్‌సభలోనూ ఇదే అంశాన్ని లేవనెత్తెందుకు ప్రయత్నించారు.

# మా కుమార్తెకు ఉరేసరి

## ప్రియుడితో కలిసి భర్తను చంపిన కేసులో నిందితురాలి తల్లిదండ్రుల తీర్పు

**లక్నో, మార్చి 20:** ప్రేమించి పెళ్లాడిన భర్తను ప్రియుడిసాయంతో కట్టుకున్న భార్యే దారుణంగా హత్య చేసి, ముక్కలు చేసిన ఘటన సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఉత్తరప్రదేశ్‌లోని మేరఠ్‌లో చోటుచేసుకున్న మర్చంట్ నేవీ అధికారి సౌరభ్ రాజ్‌పుత్ హత్యకు సంబంధించి తాజాగా మరోకీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఈ హత్యను మృతుడి ఆరేళ్లకుమార్తె చూసి ఉంటుందని సమాచారం. తన తండ్రి డ్రమ్ములో ఉన్నాడని ఆపాప చుట్టుపక్కల వారికి చెప్పినట్లు తెలిసింది. ఈ విషయాన్ని సౌరభ్ తల్లి మీడియాకు వెల్లడించారు. నా కుమారుడిని అతని భార్య, ఆమె ప్రియుడు కలిసి మార్చి 4న చంపేశారు. ఆ తర్వాత వారిద్దరూ కలిసి ట్రిప్‌కు వెళ్లారు. తిరిగొచ్చిన తర్వాత మరమ్మతుల కోసం వారు ఉంటున్న ఇంటి యజమాని కూలీలను తీసుకొచ్చారు. ఇంట్లో ఉన్న డ్రమ్మును వారు లేపలేకపోయారు. లోపల ఏముందని అడిగితే చెత్తాచెదారం అని ముస్కాన్ చెప్పింది. అనుమానం వచ్చి మూతతీయగా లోపల నుంచి దుర్వాసన వచ్చింది. దీంతో వారు పోలీసులకు సమాచారమిచ్చారు.

పోలీసులు వచ్చేలోపే మా కోడలు అక్కడి నుంచి వెళ్లిపోయింది. మా ఆరేళ్ల మనవరాలికి కూడా హత్య విషయం తెలిసే ఉంటుంది. 'నాన్న డ్రమ్ములో ఉన్నాడు' అని ఆ చిన్నారి పొరుగింటి వారికి పదే పదే చెప్పడం గమనించిన ముస్కాన్ బాలికను వేరే చోటుకు పంపించేసింది' అని సౌరభ్ తల్లి రేణు దేవీ ఆవేదన వ్యక్తం చేశారు. డ్రమ్మును తెరిచిచూసిన రోజునే ముస్కాన్ తన పుట్టింటికి వెళ్లిపోయింది. సౌరభ్‌ను చంపేశానని చెప్పడంతో ఆమె తల్లిదండ్రులు వెంటనే ముస్కాన్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి అప్పగించారు. తమ అల్లుడిని అంత దారుణంగా చంపేసిన కుమార్తెను ఉరితీయాలంటూ నిందితురాలి తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. సౌరభ్ రాజ్‌పుత్ (29), ముస్కాన్ (27) 2016లో ప్రేమ వివాహం చేసుకున్నారు. సౌరభ్‌మర్చంట్ నేవీలో పనిచేసేవాడు. వారికి 2019లో కుమార్తె జన్మించింది. ఆతర్వాత ముస్కాన్‌కు సాహిల్(25)తో వివాహేతర సంబంధం ఏర్పడింది. సౌరభ్ ఉద్యోగం మానేసి లండన్‌కు వెళ్లి ఓ బేకరీలో పనిచేసేవాడు. గత నెల కుమార్తె పుట్టిన రోజు కోసం అతడు ఇండియాకు వచ్చాడు. ఇది నచ్చని ముస్కాన్ ప్రియుడితో కలిసి ఈ దారుణానికి ఒడిగట్టింది. మృతదేహాన్ని 15 ముక్కలుగా నరికారు. శరీరా భాగాలను ఓ ప్లాస్టిక్ డ్రమ్ములో దాచిపెట్టి పైన సిమెంటుతో కప్పిపెట్టారు.

# విద్యాశాఖ మూసివేత దిశగా ట్రంప్ అడుగులు!

**వాషింగ్టన్, మార్చి 20:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వఖర్చు తగ్గింపుపై దృష్టిపెట్టారు. అందులో భాగంగా విద్యాశాఖలో భారీగా ఉద్యోగాల కోతలు పెడుతోన్న ఆయన.. ప్రస్తుతం దానిని మూసివేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ఆదిశగా ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఉదారవాద భావజాలంతో విద్యాశాఖ కలుషితమైందని ఆయన భావిస్తున్నట్లు పేర్కొన్నాయి. 'విద్యా శాఖను మూసివేయడానికి, ఆ శాఖ అధికారాలను రాష్ట్రాలకు తిరిగి ఇవ్వడానికి అవసరమైన అన్నిచర్యలు తీసుకోవాలి. అదే సమయంలో అమెరికా ప్రజలకు అందుతోన్న సేవల్లో అంతరాయం లేకుండా చూసుకోవాలి' అని విద్యా శాఖ మంత్రి లిండా మెక్‌మాన్‌ను ఉద్దేశిస్తూ ఉన్న వైట్‌హౌస్ ఫ్యాక్ట్‌షీట్‌ను అంతర్జాతీయ మీడియా కథనం పేర్కొంది. అయితే అమెరికా చట్టసభల ఆమోదం లేకుండా దానిని మూసివేయడం దాదాపు అసాధ్యమే.

అమెరికా విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెస్తానని అధ్యక్షుడు ట్రంప్ చెప్పిన విషయం తెలిసిందే. దానిలోభాగంగా ఆశాఖలోని సిబ్బందిలో సగం మందిని తొలగించే ప్రయత్నాల్లో ఉన్నామని గతంలో ప్రభుత్వం తెలిపింది. విద్యాశాఖ మంత్రిగా లిండా మెక్‌మాన్ బాధ్యతలు స్వీకరించిన కొన్ని రోజుల్లోనే ఆ పని మొదలుపెట్టారు. 'ట్రంప్ నాకు ఇచ్చిన ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి. విద్యాశాఖను మూసివేసేందుకు మేం కాంగ్రెస్‌తో కలిసి పనిచేయాల్సి ఉంటుందని తెలుసు. కానీ ఇప్పుడు తీసుకున్న నిర్ణయం అవసరానికి మించి ఉన్నవారిపై కత్తెర వేయడం కిందికే వస్తుంది' అని లిండా ఇటీవల పేర్కొన్నారు. విద్యా శాఖ ను తొలగించి, దానిని రాష్ట్రాలకు అప్పగిస్తానని చెప్పారు. ట్రంప్ బాధ్యతలు స్వీకరించే నాటికి విద్యాశాఖలో 4,100 మంది ఉద్యోగులు ఉన్నారు. వారిలో 600 మంది స్వచ్ఛందంగా పదవీవిరమణ చేయడానికి ముందుకొచ్చారు.

# అఫైర్‌కు అడ్డొస్తున్నాడని భర్తను హత్యచేసిన ఇల్లాలు

## గోనెసంచిలో కుక్కి సుదూర ప్రాంతంలో దహనం

**జైపూర్, మార్చి 20:** భర్తను హత్యచేసి ప్రియుడితో ఒక గోనెసంచిలో భర్తశవం మూటగట్టి బైక్‌పై పారేసేందుకు తీసుకువెళుతున్న భార్య అకృత్యాన్ని నగరంలోని సిసిటివి కెమేరాలు బయట పెట్టాయి. ఒక మహిళ బైక్‌పై వెనుకన కూర్చుని బైకర్‌కు తనకు మధ్య తెల్లటి గోనెసంచిని పెట్టుకుని వెళుతుండటం అనుమానాలకు తావిచ్చింది. గోపాలిదేవి అనే మహిళ తన భర్త మృతదేహాన్ని సంచిలో బయటకు తీసుకెళుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆమె తన భర్తను ఒక ఐర్‌రాడ్‌తో బాది హత్యచేసింది. గోపాలిదేవికిఉన్న ప్రియుడు దీన్‌దయాల్ కుష్వాహ్ సహకారంతో ఈహత్య చేసి మృతదేహాన్ని అడవుల్లో పారేసేందుకు తీసుకెళుతుండటం కనిపించింది. ఆ తర్వాత దర్యాప్తులో వీరిద్దరకలిసి మృతదేహాన్ని తగులబెట్టారని కూడా ఇంటరాగేషన్‌లో వెల్లడించారు. దోపాలిదేవి తన భర్త ధన్నాలాల్ సైనీతో తన అక్రమసంబంధం వ్యవహారంపై నిలదీయడంతో హత్యచేసినట్లు పోలీసులుతెలిపారు. కుష్వాహతో గోపాలిదేవికి ఐదేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారు. తానొక ఫ్యాక్టరీలో పనిచేస్తున్నానని చెపి అబద్ధం ఆడి ప్రియుడిని కలిసేందుకు వెళుతున్నది. నిజానికి సైనీ కూరగాయల విక్రేతగా జీవనం సాగిస్తున్నాడు. వారం రోజులక్రితం ఆమెతో కలిసి ఒక బట్టల దుకాణంలోకి వెళ్లాడు. అక్కడే కుష్వాహ్ కూడా పని చేస్తున్నాడు. వీరిద్దరూ అక్కడ కలిసి ఉంటున్నట్లు గమనించి ఇద్దరితోను ఘర్షణకు దిగినట్లు పోలీసులు చెప్పారు. పైఅంతస్తులో ఉన్న మరోషాప్‌లోకి తీసుకెళ్లి అక్కడ తీవ్రంగా కొట్టారు. ఒక ఐరన్ పైపుతో కొట్టి తాడుతో మెడకు ఉరిబిగించి చంపినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడి అయింది. భార్య అక్రమ సంబంధం వ్యవహారాన్ని నిలదీసినందుకే దీన్‌దయాల్‌తో కలిసి ఆమె హత్యచేసింది. సహనిందితుడు దీన్‌దయాల్ ఆతడి తలపై బాదాడు. దీనితో స్పృహతప్పిపడిపోయాడు. తర్వాత తాడుతో ఉరివేయడంతో స్పాట్‌లోనే చనిపోయినట్లు డిసిపి సౌత్ దిగంత్ ఆనంద్ తెలిపారు. ఒక సంచిలో మృతదేహం కుక్కి కుష్వాహ్ మోటారుసైకిల్‌పై దూరప్రాంతానికి తీసుకెళ్లి పడేసారు. అయితే బిజీ మార్కెట్‌లోని సిసిటివి కెమేరాల్లో వీరి వ్యవహారం మొత్తం బయటపడింది. రింగ్‌రోడ్ దాటినతర్వాత మృతదేహాన్ని సంచిలోంచి తీసి దగ్ధంచేసారు. అయితేసగం కాలిన దశలో మృతదేహం పడి ఉండటంతో రెండురోజులు తర్వాత మృతదేహాన్ని గుర్తించామని, గోపాలిదేవిని అరెస్టుచేసామని, కుష్వాహాకోసం గాలింపు ముమ్మరంచేసినట్లు డిసిపి ఆనంద్ చెప్పారు.

# హమాస్‌తో సంబంధాలు: భారతీయ విద్యార్థి అరెస్ట్



**న్యూయార్క్ మార్చి 20:** హమాస్‌తో సంబంధాలున్నాయన్న ఆరోపణలపై ఒక భారతీయ విద్యార్థిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఉగ్రవాదులతో ఆతడికి సంబంధాలున్నాయన్న ఆరోపణలపైనే అరెస్టు అయ్యాడని తేలింది. బదర్‌ఖాన్‌సూరి స్టూడెంట్ వీసాపై అమెరికాలో ఉంటున్నారు. వాషింగ్టన్ డిసిలోని జార్జ్‌టౌన్ యూనివర్సిటీలో పోస్టు డాక్టోరల్‌గా ఉన్నారు. యూనివర్సిటీలో సూరి హమాస్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్నారని డిపార్టుమెంట్ ఆఫ్ హోంల్యాండ్‌సెక్యూరిటీలోని అసిస్టెంట్ సెక్రటరీ ట్రిసియా మెక్‌లాఫ్లిన్ ఆరోపించారు. ఉగ్రవాదసంస్థలోని పలువురితో ఆతడికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఆమె అన్నారు. దీనితో ఆతడి వీసాను రద్దుచేసినట్లు తెలిపారు. ఈదిశగానే ఫెడరల్ ఏజెంట్లు వర్జీనియాలోని ఆతడి ఇంటి వెలుపల అరెస్టుచేసినట్లు వెల్లడించారు.

అయితే తన అరెస్టుపై సూరి ఇమిగ్రేషన్ కోర్టులో సవాల్‌చేసారు. తనకు ఎలాంటి నేర చరిత్రలేదని తన భార్యకు పాలస్తీనా మూలా లున్న కారణంగానే తనను టార్గెట్ చేసారని కోర్టులో వాదనలు వినిపించారు. జార్జ్‌టౌన్ వర్సిటీకూడా స్పందిస్తూ బదర్‌ఖాన్ సూరి డాక్టోరల్ పరిశోధకులుగా ఉన్నారని సూరి ఎలాంటి చట్టవిరుద్ధ చర్యల్లో పాల్గొంటున్నారనేది ఈ అరెస్టుకు కారణం ఏంటనేది మాకు తెలియ లేదని. బహిరంగ విచారణకు మద్దతిస్తున్నామని, కోర్టు న్యాయబద్ధమైన తీర్పునిస్తుందని ఆశిస్తు న్నట్లు చెప్పారు. పాలస్తీనాకు మద్దతుగా ఆందోళనచేస్తున్న విద్యార్థులపై ట్రంప్ సర్కారు తీవ్రంగా స్పందిస్తోంది.

ఈ ఆందోళనల్లోనే సుమారు రెండువేలమంది ఆందోళన కారులను అరెస్టుచేసారు. కొలంబియా వర్సిటీలోకూడా ఆందోళనలు జరిగాయి. ఒక భారతీయ విద్యార్థిని రంజనీ శ్రీనివాసన్ వీసాను డిహెచ్‌ఎస్ రద్దుచేసింది. ఆమెస్వీయ బహిష్కరణకు గురయిందని అధికారులు ప్రకటించారు. కాగా బదర్‌ఖాన్‌సూరి 2020లో శాంతి సంఘర్షణ అనే అంశంపై ఢిల్లీలోనిజామియా మిలియా ఇస్లామియా వర్సిటీలో పిహెచ్‌డి చేసారు. విద్యార్థి వీసాపైనే అమెరికాకువచ్చారు. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లలో శాంతినినెలకొల్పే అంశంపై పరిశోధనలు చేస్తున్నారని వర్సిటీ తెలిపింది. ఆయన సతీమణిమాపెజ్ సలేహ్ గాజాకు చెందిన ఆమెకు అమెరికా పౌరసత్వం ఉంది. ఆమె జార్జ్‌టౌన్ విశ్వవిద్యాలయంలో చదువుకుంటున్నది.

# భారత్ రియాల్టీలోకి ట్రంప్ కంపెనీలు

## పుణే హబ్‌గా ట్రంప్ టవర్స్ ఏర్పాటు

**ముంబయి, మార్చి 20:** భారత్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ రియల్‌ఎస్టేట్ వ్యాపారాన్ని ప్రారంభించారు. పూణెలో ఇందుకు సంబంధించి ట్రంప్ వరల్డ్‌సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. ట్రిబెకాడెవలపర్స్, కుందన్ స్పేసెస్‌తో కలిసి జాయింట్ వెంచర్‌గా ఏర్పాటుచేస్తోంది. సుమారు 289 మిలియన్ డాలర్లు విక్రయాలు జరపాలని టార్గెట్ పెట్టుకుంది. భారత్‌లో మొట్టమొదటి బ్రాండెడ్ ఆఫీస్ స్పేస్‌కోసం ట్రంప్ టవర్స్‌ను పూణెలో ఏర్పాటుచేస్తోంది. పూణెలోని కోరేగాంవ్ పార్కుపరిసరాల్లో ఈ టవర్ ఏర్పాటుచేస్తోంది. ఈప్రాజెక్టులో సుమారు 1.6 మిలియన్ చదరపు అడుగుల స్థలాన్ని అభివృద్ధిచేయాలని నిర్ణయించింది. ఈ స్పేస్‌లోనే విలాసవంతమైన కార్యాలయాలు నిర్మించి ఇవ్వడం, లీజుకు ఇవ్వడం వంటివిచేస్తుంది. ట్రంప్‌బ్రాండ్‌పై లావాదేవీలకు ట్రిబెకాకు లైసెన్సింగ్ హక్కులున్నాయి.

ట్రంప్ సంస్థలు ట్రిబెకాకే హక్కులు ఇచ్చాయి. లోధా, పంచ్‌శీల్ గ్రూప్‌లకు గతంలో ట్రంప్ టవర్ రెసిడెన్షియల్ ప్రాజెక్టులకోసం లీజు హక్కులుఇచ్చింది. గతంలో ముంబయి, పూణెల్లో ఈ బ్రాండ్ హక్కులు ఇచ్చింది. ఇపుడు ట్రిబెకా భూమి యజమానులతో భాగస్వామ్యం, లీజుస్థలాలను అభివృద్ధిచేయడం వంటివి చేస్తోంది. ప్రస్తుతం గురుగ్రామ్, కోల్‌కత్తాల్లో ట్రిబెకా లావాదేవీలునిర్వహిస్తోంది. ట్రిబెకా పూణెప్రాజెక్టుకోసం అక్కడి కుందన్‌స్పేసెస్‌తో భాగసామ్యం కుదుర్చుకుంది. 4.3 ఎకరాల భూమి 27 అంతస్తులతో టవర్ల నిర్మాణం చేసేందుకు ఈ సంస్థతో టైఅప్ చేసుకుంది.

# విడియోలను ఎడిట్‌చేసి సోషల్ మీడియాలో పోస్టింగ్

## నాగ్‌పూర్ హింసలో నిందితుడిపై సైబర్‌సెల్ దర్యాప్తు



**నాగ్‌పూర్, మార్చి 20:** నాగ్‌పూర్‌లో వెల్లువెత్తిన హింసకు సంబంధించి సైబర్‌క్రైమ్ పోలీసులు కొన్ని ఆసక్తికర వివరాలను సేకరించారు. అరెస్టు చేసిన నిందితుడు సోషల్‌మీడియాలో ఎడిట్ చేసిన విడియోలను పోస్టుచేసాడని, హింసను మరింత రెచ్చగొట్టేవిదంగా విడియోలను ఎడిట్‌చేసి సర్క్యులేట్‌చేసినట్లు తెలింది. ఫహీమ్ ఖాన్ అనే ఈ నిందితుడు ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా ఉన్న విడియోను సర్క్యులేట్‌చేసి హింసను మరింత రెచ్చగొట్టాడు. అంతేకాకుండా హింసాత్మక విడియోలను మరింత హింసాత్మకంగా చూపించి ప్రజల్లో విద్వేషాన్ని రెచ్చగొట్టినట్లు సైబర్‌సెల్‌పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించి నాలుగు ఎఫ్ఐఆర్‌లు రిజిస్టరుచేసారు. మొదటి ఎఫ్ఐఆర్ ఎడిట్‌చేసిన ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా సర్క్యులేట్‌చేయడం, విడియోలద్వారా హింసను మరింత ప్రజ్వరిల్లే చర్యలు తీసుకోవడం, రెండు మతాలమధ్య హింసను ప్రేరేపించేవిధంగా ఈ విడియోలను షేర్‌చేయడం, మరింతగా హింస ప్రజ్వరిల్లేందుకు వీలుగా హింసాత్మక విడియోలను ఎక్కువ చూపించడం వంటి వాటిపై ఎఫ్ఐఆర్‌లు నమోదుచేసినట్లు డిసిపి లోహిత్‌మతాని వెల్లడించారు. నిందితుడు ఫహీమ్‌ఖాన్‌ను ఈనెల 19వ తేదీ అరెస్టుచేసామని 21వ తేదీవరకూ రిమాండ్‌లో ఉంచినట్లు తెలిపారు. మైనార్టీస్ డెమొక్రటిక్‌పార్టీ నాయకుడుగా కొనసాగుతున్నాడు. అంతకు ముందు నాగ్‌పూర్ కలెక్టర్ విపిన్ ఇటాంకర్ మాట్లాడుతూ ఈప్రాంతంలో సాధారణ స్థితి నెలకన్నదని కొన్ని ప్రాంతాల్లో ఇంకా కర్ఫ్యూకొనసాగిస్తున్నట్లు చెప్పారు. పౌర ఆస్తులకు జరిగిన నష్టం మదింపుచేస్తున్నామని, బాధితులకు నష్టపరిహారం చెల్లించే అంశం పరిశీలనలో ఉందన్నారు.

ప్రభుత్వం నష్టం అంచనా వేసిన తర్వాత పరిహారం విడుదలచేస్తుంది. ప్రాథమికంగా 50 నుంచి 60కిపైగా టూవీలర్లు, 10నుంచి 15 వరకూ ఫోర్ వీలర్లు, క్రేన్లు, పదికిపైగా గృహాలు కూడా దగ్ధంచేసారు. ఒక ప్రత్యేకబృందం పంచనామాచేస్తోందని తెలిపారు. మొత్తం 50 మందిని అరెస్టుచేసారు. వారిలో ఏడుగురు మైనర్లుకూడాఉ న్నారు. సిసిటివికెమేరాల ఫుటేజిల ఆధారంగా నిందితులను గాలించి అరెస్టు చేసినట్లు చెప్పారు.

# తాగునీటి విషయంలో ఇద్దరి మధ్య గొడవ..

## కేంద్రమంత్రి నిత్యానందరాయ్ మేనల్లుడి హత్య

**పాట్నా, మార్చి 20:** కేంద్ర మంత్రి నిత్యానందరాయ్ కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. ఆయన ఇద్దరు మేనల్లుళ్ల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. బీహార్‌లోని భాగల్‌పూర్‌కు చెందిన జగత్‌పూర్ గ్రామంలో వారి నివాసంలో గురువారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. తాగునీటి విషయమై ఇరువురి మధ్య వివాదం చెలరేగి, అది కాస్తా ఒకరి హత్యకు దారితీసిందని తెలిపాయి. 'జగత్‌పూర్ గ్రామంలో ఇద్దరు సోదరుల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయని మాకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే వారిలో ఒకరు మృతి చెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. వారి గొడవను ఆపేందుకు మధ్యలో వారి తల్లి వచ్చినట్లు తెలుస్తోంది. ఆమెకు బుల్లెట్ గాయం అయింది. ఆమె పరిస్థితి విషమంగా ఉంది' అని పోలీసు ఉన్నతాధికారి వెల్లడించారు. కేంద్ర హోం శాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్‌కు బావ అయిన రఘునందన్‌యాదవ్ ఇద్దరు కుమారులు. వారి జైజిత్‌యాదవ్, విశ్వజిత్‌యాదవ్. వారింట్లో పనిచేసే సహాయకుడు సర్వ్ చేస్తోన్న సమయంలో తన చేతిని గ్లాసులో ముంచడమే వీరి గొడవకు కారణమి తెలుస్తోంది. ఆ గొడవ పెరిగి ఇద్దరు కాల్పులు జరుపుకోగా.. విశ్వజిత్ ప్రాణాలు కోల్పోయాడు. ఎప్పటి నుంచో ఈ అన్నదమ్ముల మధ్య సంబంధాలు సరిగా లేవని సమాచారం.

# ఎంఎఫ్ హుస్సేన్ కళాఖండానికి రూ. 118 కోట్లు!



**న్యూయార్క్, మార్చి 20:** ప్రముఖ భారతీయ చిత్రకారుడు ఎంఎఫ్ హుసేన్ గీసిన ఓ పెయింటింగ్ అరుదైన రికార్డు సృష్టించింది. ప్రముఖ వేలం సంస్థ క్రిస్టీ.. న్యూయార్క్‌లో తాజాగా నిర్వహించిన వేలంలో హుస్సేన్ గీసిన 'అన్‌టైటిల్డ్ (గ్రామ్ యాత్ర)' కళాఖండం 13.8 మిలియన్ డాలర్ల (రూ. 118 కోట్లు)కు అమ్ముడుపోయింది. దీంతో ఆధునిక భారత చరిత్రలో అత్యంత ఖరీదైన కళాకృతిగా ఇది రికార్డు సృష్టించింది. ప్రముఖ ఆర్టిస్ట్ అమృతా షెర్గిల్ 1937లో గీసిన 'ది స్టోరీ టెల్లర్' పెయింటింగ్‌ను 2023లో వేలం వేయగా రూ. 61.8 కోట్ల ధర పలికింది.

తాజా ఎంఎఫ్ హుస్సేన్ పెయింటింగ్ దీని కంటే రెట్టింపు ధర పలకడం విశేషం. ఈ అద్భుత కళాఖండం కొత్త రికార్డు సృష్టించడంలో భాగస్వామ్యమైనందుకు సంతోషంగా ఉందని వేలం సంస్థ క్రిస్టీ ప్రతిని ధులు పేర్కొన్నారు.

ఆట

# ఫుట్‌బాల్ మ్యాచ్‌లో.. భారత్ ఘన విజయం

## 3-0తో మాల్దీవులు ఓటమి



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ ఫుట్‌బాల్ పునరాగమనంలో భారత్ జట్టు కెప్టెన్ సునీల్ ఛెత్రి గోల్‌తో మెరిశాడు. ఫలితంగా 12 మ్యాచ్‌ల నుండి విజయం లేకుండా సాగుతున్న భారత్ ఫుట్‌బాల్ జట్టు ఎట్టకేలకు గెలుపు రుచి చూసింది. షిల్లాంగ్‌లో జరిగిన అంతర్జాతీయ స్నేహపూర్వక మ్యాచ్‌లో భారత్ 3-0 గోల్స్ తేడాతో మాల్దీవులుపై నెగ్గింది. భారత్ తరఫున రాహుల్ (35వ నిమిషంలో), లిస్టన్ కొలాకో (66వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. గత ఏడాది జూన్‌లో అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికిన 40 ఏళ్ల ఛెత్రి 77వ నిమిషంలో గోల్ చేసి జట్టు ఆధిక్యాన్ని మరింత పెంచాడు. ఛెత్రి కెరీర్లో ఇది 95వ అంతర్జాతీయ గోల్ కావడం విశేషం. తన రిటైర్మెంట్ తర్వాత జాతీయ జట్టు పేలవ ప్రదర్శన కారణంగా ఛెత్రి తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నాడు. 286 రోజుల అనంతరం బ్లూ జెర్సీలో మైదానంలో అడుగు పెట్టాడు. సునీల్‌కు ఇది 152వ మ్యాచ్ కాగా, 16 నెలల తర్వాత భారత జట్టు తొలి విజయం నమోదు చేసుకుంది. మొనొలో భారత ఫుట్బాల్ జట్టు హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం జట్టుకు ఇదే మొదటి గెలుపు. భారత జట్టు చివరిసారిగా ఫిఫా ప్రపంచ కప్ క్వాలిఫయింగ్ రౌండ్‌లో భాగంగా 2023 నవంబర్ 16న కువైట్‌పై విజయం సాధించింది.

# రోహిత్ సేనకు రూ.58 కోట్ల క్యాష్ రివార్డు

## ఛాంపియన్స్‌ట్రోఫీకి భారత్ క్రికెట్ బోర్డు నజరానా




**న్యూఢిల్లీ:** ఇటీవల జరిగిన చాంపియన్స్ ట్రోఫీని సాధించిన నేపథ్యంలో రోహిత్ సేనకు భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) భారీ నగదు నజరానా ప్రకటించింది. చాంపియన్స్ ట్రోఫీలో ఆడిన భారత క్రికెటర్లకు 58 కోట్ల రూపాయల క్యాష్ ప్రైజ్‌ను గురువారం ప్రకటించింది. క్యాష్ ప్రైజ్ అందుకునేవారిలో క్రికెటర్లతో పాటు కోచింగ్, సపోర్ట్ స్టాఫ్, సెలెక్షన్ కమిటీ సభ్యులు కూడా ఉంటారు. క్యాష్ రివార్డు కింద ప్రతి ప్లేయర్‌కు 3 కోట్లు, హెడ్ కోచ్‌కు 3 కోట్లు, సపోర్టింగ్ స్టాఫ్‌కు 50 లక్షలు దక్కనున్నట్లు బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా తెలిపారు. రోహిత్ శర్మ నేతృత్వంలో ఇండియన్ జట్టు పాక్ ఆతిథ్యం ఇచ్చిన చాంపియన్స్ ట్రోఫీలో డామినేట్ చేసినట్లు వెల్లడించారు. ఐసీసీ టైటిళ్లను వరుసగా గెలవడం ప్రత్యేకమైందని, అంతర్జాతీయ స్థాయిలో టీమిండియా అంకితభావానికి, ఉత్తమ ఆటతీరుకు క్యాష్ రివార్డు సంకేతమని బీసీసీఐ ప్రెసిడెంట్ రోజర్ బిన్నీ తెలిపారు. ప్రతి ఒక్కరి కష్టానికి నగదు నజరానా గుర్తింపు వంటిదన్నారు. 2025లో ఇది రెండో ఐసీసీ ట్రోఫీ అన్నారు. అండర్19 వుమెన్స్ వరల్డ్‌కప్ గెలిచినట్లు చెప్పారు.




# ఐపిఎల్ హిస్టరీలో అత్యధిక సిక్సర్లు కొట్టిన హీరోలు

## టాప్ 5లో ముగ్గురు టీమిండియా స్టార్లు

### రోహిత్, కోహ్లీల మధ్య పోటీ?

**న్యూఢిల్లీ:** క్రికెట్ ప్రేమికులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025 సీజన్ మరో 24 గంటల్లో ఆరంభం కానుంది. తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు తలపడనుంది. ఈ నెల 22 నుండి మే 25 వరకు జరగనున్న ఐపీఎల్ 18వ సీజన్‌లో ప్రేక్షకులు ఫోర్లు, సిక్సర్ల వర్షంలో తడిసి ముద్ద కానున్నారు. కాగా ఇప్పటి వరకు ఐపీఎల్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన హీరోల్లో టీమిండియా స్టార్‌లు కూడా ఉన్నారు. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక సిక్సర్లు బాదిన రికార్డు క్రిస్‌గేల్ పేరిట ఉంది. మూడే వేరు వేరు ఫ్రాంచైజీల తరుపున ఆడాడు. పంజాబ్, కోల్‌కతా, బెంగళూరు జట్ల తరపున 142 మ్యాచ్‌లు ఆడి 357 సిక్సర్లు కొట్టాడు. ఐపీఎల్‌లో 350 సిక్సర్లు కొట్టిన ఏకైక ఆటగాడిగానూ క్రిస్‌గేల్ కొనసాగుతున్నాడు. అలాగే ఐపీఎల్‌లో విజయవంతమైన కెప్టెన్లలో రోహిత్ శర్మ ఒకడు. ముంబై ఇండియన్స్‌కు ఐదు ఐపీఎల్ ట్రోఫీలను అందించాడు. ఇక బ్యాటింగ్‌లో దుమ్ముదులిపే రోహిత్ శర్మ ఐపీఎల్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ఆటగాళ్ల జాబితాలో రెండో స్థానంలో నిలిచాడు. 257 మ్యాచ్‌ల్లో 280 సిక్సర్లు బాదాడు. ఇక పరుగుల యంత్రం, రికార్డుల రేరాజు విరాట్ కోహ్లీ ఈ జాబితాలో మూడో స్థానంలో ఉన్నాడు.

కోహ్లీ 252 మ్యాచ్‌ల్లో 272 సిక్సర్లు బాదాడు. రోహిత్ కంటే కేవలం 8 సిక్సర్ల వెనుకంజలో ఉన్నాడు. మరో రోజులో ప్రారంభమవుతున్న ఐపీఎల్ 18వ సీజన్‌లో రోహిత్ ను కోహ్లీ అధిగమిస్తాడో లేదో చూడాలి. కాగా ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన కెప్టెన్లలో మహేంద్ర సింగ్ ధోని ఒకడు. ధోని 264 మ్యాచ్‌ల్లో 252 సిక్సర్లు బాదాడు. ఈ క్రమంలో అత్యధిక సిక్సర్ల జాబితాలో 4వ స్థానంలో ఉన్నాడు. ఐపీఎల్ 2024 సీజన్‌లో ధోని చాలా లేటుగా బ్యాటింగ్‌కు వచ్చాడు. అయినప్పటికి తనదైన మెరుపులు మెరిపించాడు. మరి ఈ సీజన్‌లో అయినా బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు వస్తాడా? లేదో చూడాల్సిందే. కాగా ఐపీఎల్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాళ్ల జాబితాలో ఏబీ డివిలియర్స్ 5వ స్థానంలో ఉన్నాడు. లీగ్ చరిత్రలో మిస్టర్ 360 డిగ్రీస్ ఆటగాడు 184 మ్యాచ్‌ల్లో 251 సిక్సర్లు బాదాడు. ఇక ఐపీఎల్ అత్యధిక సిక్సులు కొట్టిన టాప్ 10లో 6వ స్థానంలో డేవిడ్ వార్నర్ 184 మ్యాచుల్లో 236 సిక్సర్లు, తదుపరి వరుసగా కీరన్ పొలార్డ్ 189 మ్యాచుల్లో 223 సిక్సర్లు, ఆండ్రీ రసెల్ 127 మ్యాచుల్లో 209 సిక్సర్లు, సంజూ శాంసన్ 168 మ్యాచుల్లో 206 సిక్సర్లు, సురేశ్ రైనా 205 మ్యాచుల్లో 203 సిక్సర్లు, షేన్ వాట్సన్ 145 మ్యాచుల్లో 190 సిక్సర్లు కొట్టాడు.



# స్విస్ వరల్డ్ బ్యాడ్మింటన్‌లో.. శ్రీకాంత్ శుభారంభం

## ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ఇషారాణి, అనుపమ

### తొలి రౌండ్‌లోనే ఓడిన సింధు

**న్యూఢిల్లీ:** స్విస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ప్రపంచ మాజీ నంబర్ వన్, భారత అగ్రశ్రేణి ఆటగాడు కిడాంబి శ్రీకాంత్ శుభారంభం చేశాడు. బాసెల్‌లో జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 49వ ర్యాంకర్ శ్రీకాంత్ 23-21, 23-21తో భారత్‌కే చెందిన ప్రపంచ 28వ ర్యాంకర్ హెచ్ఎస్ ప్రణయ్‌ను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. ఈ గెలుపుతో శ్రీకాంత్ ముఖాముఖి రికార్డులో 7-3తో ప్రణయ్‌పై ఆధిక్యంలోకి వెళ్లాడు. ప్రణయ్‌తో 48 నిముషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో శ్రీకాంత్ రెండు గేముల్లో గేమ్ పాయింట్లు కాపాడుకుని నెగ్గడం విశేషం. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో భారత్‌కే చెందిన క్వాలిఫయర్ శంకర్ ముత్తుస్వామి సుబ్రమణియన్ 21-5, 21-16తో డెన్మార్క్‌కు చెందిన మాగ్నస్ జొహాన్సన్‌పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌లో భారత ప్లేయర్లు ఆయుశ్ శెట్టి 15-21, 19-21తో జపాన్‌కు చెందిన కెంటా నిషిమోటో చేతిలో, కిరణ్ జార్జి 21-18, 17-21, 10-21తో డెన్మార్క్‌కు చెందిన రస్‌ముస్ గెమ్కే చేతిలో ఓటమిపాలయ్యారు. ఇక మహిళల సింగిల్స్‌లో భారత క్రీడాకారిణులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. భారత నంబర్ వన్, ప్రపంచ మాజీ చాంపియన్ పీవీ సింధు 17-21, 19-21తో 39 నిమిషాల్లో ప్రపంచ 31వ ర్యాంకర్, డెన్మార్క్‌కు చెందిన జూలీ జేకబ్సన్ చేతిలో అనూహ్యంగా ఓడిపోయింది. భారత్‌కే చెందిన ఇషారాణి బారువా, అనుపమ తొలి రౌండ్‌లో గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. క్వాలిఫయర్ ఇషారాణి 18-21, 21-17, 22-20తో భారత్‌కే చెందిన ఆకర్షి కశ్యప్‌పై, అనుపమ 21-14, 21-13తో అన్మోల్ ఖరబ్ (భారత్)పై గెలిచారు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో భారత్‌కు చెందిన మాళవిక బన్సోద్ 22-20, 14-21, 19-21తో కెనడాకు చెందిన మిచెల్లి లీ చేతిలో, భారత్‌కు చెందిన రక్షిత శ్రీ 11-21, 17-21తో డెన్మార్క్‌కు చెందని లినె క్రిస్టోఫర్సన్ చేతితో ఓడిపోయారు. కాగా మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో భారత్ జోడీ పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ ద్వయం 21-16, 21-17తో నెదర్లాండ్స్‌కు చెందిన అలైన్ ముల్లర్-కెల్లీ బుటెన్ జంటపై విజయం సాధించి ప్రికార్వర్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది.

# టి20 ర్యాంకింగ్స్‌లో టీమిండియా హవా

## టాప్ 2లో అభిషేక్, వరుణ్

**న్యూఢిల్లీ:** ఐసీసీతాజాగా ప్రకప్రటించిన టీ20ర్యాంకింగ్స్ లో టీమిండియా బ్యాటర్ల హవా కొనసాగింది. టాప్5లో ఏకంగా ముగ్గురు చోటు దక్కించుకున్నారు. రెండోస్థానంలో అభిషేక్ శర్మ, నాలుగు, ఐదు స్థానాల్లో తిలక్‌వర్మ,సూర్యకుమార్ యాదవ్ కొనసాగుతున్నారు. ఆసీస్ విధ్వంసకర బ్యాటర్ ట్రవిస్ హెడ్ అగ్ర పీఠంపై తిష్ట వేశాడు. పాక్ బ్యాటర్ బాబర్ ఆజమ్ ఒస్థానం కోల్పోయి ఎనిమిదో ప్లేస్‌కు పడిపోగా,శ్రీలంక ఆటగాడు పథుమ్ నిస్సంక ఓ స్థానం మెరుగుపర్చుకుని ఏడో స్థానానికి చేరాడు. ఇవి మినహా ఈ వారం టాప్ 10బ్యాటర్ల ర్యాంకిగ్స్ లో ఎలాంటి మార్పులులేవు. సిరీస్‌లో చెలరేగిపోతున్న న్యూజిలాండ్ బ్యాట ర్లు టిమ్ సీఫర్ట్, ఫిన్ అలెన్ ఈ ర్యాంకింగ్స్‌లో గణనీయంగా లబ్ధి పొందారు. సీఫర్ట్ 20 స్థానాలు మెరుగుపర్చుకుని 13వ స్థానానికి చేరగా, అలెన్ 8 స్థానాలు మెరుగుపర్చుకుని 18వ స్థానానికి ఎగబాకాడు. భారత బ్యాటర్లలో యశస్వి జైస్వాల్ 12, రుతురాజ్ గైక్వాడ్ 26, సంజూ శాంసన్ 36,శుభ్మన్‌గిల్ 41, హార్దిక్ పాండ్యా 52, రింకూ సింగ్ 54,శివమ్ దూబే 57 స్థానాల్లో ఉన్నారు. ఇక బౌలర్ల ర్యాంకిగ్స్ విషయానికొస్తే విండీస్ స్పిన్నర్‌అకీల్ హుసేన్ టాప్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా, భారత మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి రెండో స్థానంలో నిలిచాడు. వరుణ్‌కు టాప్ ప్లేస్‌లో ఉన్న అకీల్ హుసేన్‌కు కేవలం ఒక్కపాయింట్ వ్యత్యాసంమాత్రమే ఉంది. అలాగే టాప్10లో వరుణ్ సహాముగ్గురు భారతబౌలర్లు ఉన్నారు. రవి బిష్ణోయ్ 6, అర్షదీప్ సింగ్ 9 స్థానాల్లో కొనసాగుతున్నారు. తాజాగా పాక్‌తో జరిగిన రెండు టీ20ల్లో అద్భుత ప్రదర్శనలు చేసిన న్యూజిలాండ్ బౌలర్లు ర్యాంక్‌లను భారీగా మెరుగుపర్చుకున్నారు. జేకబ్ డఫీ 23 స్థానాలు మెరుగుపర్చుకుని 12వ స్థానానికి ఎగబాకగా, బెన్ సియర్స్ 22 స్థానాలు మెరుగు పర్చుకుని 67వస్థానానికి, జకరీఫౌల్క్స్ 41 స్థానాలు మెరుగుపర్చుకుని 90వ స్థానానికి చేరారు. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్ 38, బుమ్రా 41, హార్దిక్ పాండ్యా 48 స్థానాల్లో ఉన్నారు.

# స్టీల్ ఉత్పత్తులపై 12% సుంకాలు

**న్యూఢిల్లీ, మార్చి 20:** కొన్ని రకాల స్టీల్ ప్రొడక్టులపై 12శాతం రక్షణాత్మక సుంకాలను విధించమంటూ వాణిజ్యశాఖ దర్యాప్తు విభాగం ట్రేడ్ రెమిడీస్ డైరెక్టరేట్ జనరల్ (డిజిటిఆర్) తాజాగా ప్రతిపాదించింది. పెరుగుతున్న దిగుమతుల నుంచి దేశీయ సంస్థలకు రక్షణ కల్పించేందుకు వీలుగా 200 రోజుల వరకూ సుంకాల అమలుకు సూచించింది. ఉన్నట్టుండి ఊపందుకున్న అలాయ్, నాన్‌అలాయ్ స్టీల్ ప్లాంట్ ప్రొడక్టుల దిగుమతులపై గతేడాది డిసెంబరులో డిజిటిఆర్ దర్యాప్తు చేపట్టింది. వీటిని ఫ్యాబ్రికేషన్, పైప్ మేకింగ్, నిర్మాణం, కేపిటల్ గూడ్స్, ఆటో, ట్రాక్టర్లు, సైకిళ్లు, ఎలక్ట్రికల్ ప్యానెళ్లు తదితర వివిధ పరిశ్రమలలో వినియోగిస్తారు. దేశీయ స్టీల్ అసోసియేషన్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు నిర్వహించింది. ఈ జాబితాలో ఆర్సెలర్‌మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా, జెఎస్‌డబ్ల్యూ స్టీల్ కోటెడ్ ప్రొడక్ట్, భూషణ్ పవర్ అండ్ స్టీల్, జిందాల్ స్టీల్ అండ్ పవర్, సెయిల్ తదితర దిగ్గజాలున్నాయి. ఇటీవల కొన్ని స్టీల్ ప్రొడక్టుల దిగుమతులు ఉన్నట్టుండి భారీగా పెరిగినట్లు దర్యాప్తులో డిజిటిఆర్ ప్రాథమికంగా గుర్తించింది. దీంతో విలువ ఆధారిత సుంకాల విధింపునకు ఈ నెల 18న నోటిఫికేషన్ ద్వారా సిఫారసు చేసింది. వెరసి 200 రోజులకు 12 శాతం ప్రొవిజనల్ సేఫ్‌గార్డ్ డ్యూటీలను విధించేందుకు ఆర్థిక శాఖకు నివేదించింది. వీటిపై ఆర్థిక శాఖ తుది నిర్ణయాన్ని తీసుకోవాల్సి ఉంది. ప్రధానంగా చైనా, జపాన్, కొరియా, వియత్నాం నుంచి దిగుమతులు పెరిగినట్లు తెలుస్తోంది. పరిశ్రమ వర్గాల వివరాల ప్రకారం, ఆయా దేశాల్లో స్థానిక డిమాండ్‌కు మించి భారీ స్థాయిలో సరఫరాలు జరుగుతున్నాయి.



# బ్యాంకింగ్, ఐటి రంగాల మద్దతు

**ముంబై, మార్చి 20:** దేశీయ స్టాక్ మార్కెట్ లాభాల పరుగు కొనసాగుతోంది. బెంచ్ మార్క్ సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా నాలుగోరోజూ లాభాల్లో ముగిశాయి. ముఖ్యంగా బ్యాంకింగ్, ఐటీ రంగాల షేర్లలో కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను స్థిరంగా ఉంచినప్పటికీ, ఈ ఏడాది రెండుసార్లు కీలక రేట్ల కోత ఉంటుందని సంకేతాలివ్వడం మన మార్కెట్లకు బూస్ట్ ఇచ్చినట్లయ్యింది. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు మాత్రం స్వల్ప స్థాయిలోనే కదలాడాయి. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.3 లక్షల కోట్ల మేర పెరిగి రూ.408 లక్షల కోట్లకు చేరింది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 76,456.25 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచి.. చివరికి 899.01 పాయింట్ల లాభంతో 76,348.06 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 283.05 పాయింట్ల మేర లాభంతో 22,190.65 పాయింట్ల వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.33గా ఉంది. ఇండస్‌ఇండ్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్ మినహా మిగిలిన అన్ని షేర్లూ లాభాల్లో ముగిశాయి. భారతీ ఎయిర్‌టెల్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, హిందుస్థాన్ యూనిలీవర్, టీసీఎస్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అందరూ ఊహించినట్లే ఫెడ్ ఈ సారి వడ్డీ రేట్లను స్థిరంగా ఉంచింది. అయితే, ఈ ఏడాది రెండు సార్లు కోత ఉంటుందని ప్రకటించడం పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గితే డాలర్‌తో పాటు, అక్కడి బాండ్ రాబడులు కూడా తగ్గుతాయి. ఇలాంటి సందర్భాల్లో భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల మార్కెట్ల వైపు విదేశీ మదుపర్లు దృష్టి సారించే అవకాశం ఉంటుంది. దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రాణించడంలో ఐటీ స్టాక్స్‌లో కొనుగోళ్లు కూడా కీలక భూమిక పోషించాయి. ఈ ఏడాది దాదాపు 16 శాతం మేర పతనమైన నిఫ్టీ ఐటీ ఇండెక్స్ దాదాపు 2 శాతం మేర రాణించింది. అమెరికా మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో ఇతర ప్రపంచ మార్కెట్లు లాభాల్లో కదలాడాయి. దీంతో మన మార్కెట్లూ అదే బాటలో పయనించాయి. ఓ వైపు ట్రంప్ వాణిజ్య భయాలు ఉన్నా రేట్ల కోత ఉంటుందని సంకేతాలు ఇవ్వడం ప్రపంచ మార్కెట్లకు ఫెడ్ ఊపిరిపోసింది.




# ప్రకృతి వైద్యంతో పతంజలి 'ఆరోగ్యం'!

**న్యూఢిల్లీ, మార్చి 20:** పతంజలి ఆయుర్వేదం భారతీయ వెల్‌నెస్ పరిశ్రమలో కొత్త విప్లవాన్ని తీసుకువచ్చింది. ఆయుర్వేదాన్ని ఆధునిక శాస్త్రంతో జతచేయడంతో ప్రపంచ వ్యాప్త గుర్తింపును పొందింది. యోగా గురువు స్వామి రామ్‌దేవ్, ఆచార్య బాలకృష్ణ నాయకత్వంలో, పతంజలి ఆరోగ్యం, ప్రకృతివైద్య రంగంలో కొత్త కోణాలను స్థాపించడమే కాకుండా, స్వావలంబన భారతదేశాన్ని సృష్టించడంలో కూడా ఒక ముఖ్యమైన సహకారాన్ని అందించింది. పతంజలి ఆయుర్వేద భవిష్యత్తు ప్రణాళికలు స్వావలంబన, సమగ్ర ఆరోగ్యం, ఆవిష్కరణ మరియు భారత దేశాన్ని బలమైన, ఆరోగ్యకరమైన దేశంగా మార్చడానికి ప్రపంచ విస్తరణపై దృష్టిసారించాయి. ప్రపంచ స్థాయిలో ఆయుర్వేదానికి ప్రచారం.. పతంజలి ఆయుర్వేదం తన ప్రపంచవ్యాప్తంగా విస్తరణ ద్వారా ప్రాచీన భారతీయ వైద్య విధానాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందేలా చేస్తోంది. అమెరికా, యూరప్, ఆఫ్రికా, ఆసియాకు తన ఉత్పత్తుల ఎగుమతిని పెంచడం ద్వారా, పతంజలి అంతర్జాతీయ మార్కెట్లలో స్వదేశీ ఉత్పత్తులకు డిమాండ్‌ను బలోపేతం చేసింది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు, అంతర్జాతీయ భాగస్వామ్యాలను ఉపయోగించి కంపెనీ తన ఉత్పత్తులను ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉంచింది. దీనితో పాటు, యోగా ఆయుర్వేద పరిశోధన కేంద్రాలను స్థాపించడం ద్వారా, పతంజలి ఆయుర్వేదాన్ని ప్రపంచ ఆరోగ్య వ్యవస్థలో ప్రభావవంతమైన వైద్య వ్యవస్థగా ఏర్పాటు చేస్తోంది. స్వావలంబన, సమగ్ర ఆరోగ్యంపై దృష్టి.. పతంజలి భవిష్యత్తు ప్రణాళికల్లో స్వావలంబన, సంపూర్ణ ఆరోగ్యంపై దృష్టి సారించింది. పతంజలి ఆయుర్వేదం రైతులు, మూలికా ఉత్పత్తిదారులు, స్థానిక చేతివృత్తులవారికి మద్దతు ఇవ్వడం ద్వారా దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహిస్తోంది. తద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తోంది. యోగా, సహజ జీవనశైలి, సమతుల్య పోషకాహారాన్ని ప్రోత్సహించడం ద్వారా, పతంజలి సమగ్ర ఆరోగ్య నమూనాను అభివృద్ధి చేస్తోంది. దీనితో పాటు, ఆయుర్వేద పరిశోధన, శాస్త్రీయ ఆధారాల ద్వారా దాని ఉత్పత్తుల నాణ్యత, ప్రభావం మరింత బలోపేతం అవుతోంది.




# రెనో వాహనాల ధరల పెంపు

**ముంబై, మార్చి 20:** ప్రముఖ కార్ల తయారీ సంస్థలు ఒక్కొక్కటిగా ధరల పెంపును ప్రకటిస్తున్నాయి. ఇప్పటికే ప్రముఖ కంపెనీలైన మారుతి సుజుకి, టాటా మోటార్స్, కియా ఇండియా, హుండాయ్, హోండా వచ్చే నెల నుంచి కార్ల ధరలను పెంచుతామని ప్రకటించాయి. తాజాగా రెనో ఇండియా కూడా ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. ఏప్రిల్ నుంచి కొత్త ధరలు అమల్లోకి వస్తాయని తెలిపింది. తయారీ వ్యయం, ముడి సరకు ధరలు నిర్వహణ ఖర్చులు పెరిగిన కారణంగా కార్ల ధరలను రెండు శాతం మేర పెంచుతున్నట్లు రెనో ఇండియా సిఇఒ ఎండి వెంట్రామ్ తెలిపారు. వినియోగ దారులకు నాణ్య మైన వాహనాలను అందించేందుకు ధరల పెంపు అనివార్యమని పేర్కొ న్నారు. మోడల్‌ను బట్టి ధరల పెంపు ఉంటుందని వెల్లడించారు. 2023 ఫిబ్రవరి తర్వాత రెనో నుంచి ధరల పెంపు నిర్ణయం రావడం ఇదే తొలిసారి అని కంపెనీ స్పష్టం చేసింది.




# ఆకాసా ఎయిర్‌కు బోయింగ్ షాక్


**ముంబై, మార్చి 20:** బోయింగ్ కష్టాలు ప్రపంచవ్యాప్తంగా విమానయాన సంస్థలకు సవాలుగా మారుతున్నాయి. భారత విమానయాన సంస్థ ఆకాసా ఎయిర్‌కు డెలివరీ ఇవ్వాల్సి న బోయింగ్ 737 మ్యాక్స్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఆలస్యం అవుతుండడంతో ఉన్నతాధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పనిలేకుండా ఖాళీగా ఉన్న వందలాది మంది పైలట్లను శాంతింపచేయడానికి బోయింగ్ ప్రయత్నిస్తోందని ఆకాసా ఎయిర్ తీవ్రంగా విమర్శిస్తోంది. ముంబైకి చెందిన ఆకాసా ఎయిర్ సుమారు మూడు సంవత్సరాల క్రితం కార్యకలాపాలను ప్రారంభించింది. ఈ సంస్థ ఇప్పటివరకు 27 విమానాల ఫ్లీట్‌ను కలిగి ఉంది. వీటి సంఖ్యను క్రమంగా పెంచుకోవాలని కంపెనీ యోచించింది. భవిష్యత్తులో వీటి సంఖ్యను 226ను తీసుకెళ్లాలని నిర్ణయించింది. అందుకోసం బోయింగ్ 737 మ్యాక్స్‌లను ఆర్డర్ ఇచ్చింది. ఈ క్రమంలో గత యేడాది మిడ్ ఎయిర్ క్యాబిన్ ప్యానెల్‌లో సమస్యలు వచ్చిన సంస్థల పరిశీలనలోకి వెళ్లింది. దానికి తోడు బోయింగ్ కార్మికులు సమ్మె చేయడంతో తయారీ తాత్కాలికంగా నిలిచిపోయింది. దాంతో ప్రపంచవ్యాప్తంగా ఈ కంపెనీకి ఆర్డర్ ఇచ్చిన కంపెనీల నుంచి ఒత్తిడి పెరుగుతుంది.




# వాణిజ్యం

## కేబుల్ బిజినెస్‌లోకి అదానీ ఎంట్రీ!

**ముంబై, మార్చి 20:** వైర్లు, కేబుళ్ల విభాగంలోకి బిగ్ ప్లేయర్లు ఎంట్రీ ఇస్తున్నారు. ఇప్పటికే ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్ ఈ విభాగంలోకి అడుగుపెడుతున్నట్లు ప్రకటించింది. తాజాగా అదానీ గ్రూప్ కూడా ఈ రంగంలో తన సత్తా చాటాలని నిర్ణయించుకుంది. అందులో భాగంగా జాయింట్ వెంచర్‌ని ఏర్పాటు చేసినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. ఈ నేపథ్యంలో మార్కెట్‌లో ఇప్పటికే ప్రధాన ప్లేయర్లుగా ఉన్న పాలీక్యాబ్ ఇండియా లిమిటెడ్, కెఇఐ ఇండస్ట్రీస్ లిమిటెడ్, ఆర్ఆర్ కేబుల్ లిమిటెడ్, ఫినోలాక్స్ కేబుల్స్, హావెల్స్ ఇండియా లిమిటెడ్ తదితర కంపెనీల షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అదానీ గ్రూప్ అనుబంధ కచ్ కాపర్ లిమిటెడ్, ప్రణీత వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి ప్రణీత ఎకోకేబుల్స్ పేరిట జాయింట్ వెంచర్‌ని ఏర్పాటు చేసినట్లు అదానీ గ్రూప్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో పేర్కొంది. ఈ ఒప్పందంలో భాగంగా కచ్ కాపర్ లిమిటెడ్‌కు కొత్తగా ఏర్పాటైన ప్రణీత ఎకోకేబుల్స్ కంపెనీలో 50శాతం ఈక్విటీ షేర్లను కలిగి ఉంటుంది. ఇప్పటికే సిమెంట్ వ్యాపారంలోకి ప్రవేశించిన అదానీ గ్రూప్, ఈ జాయింట్ వెంచర్ ద్వారా అదానీ గ్రూప్ మెటల్ ఉత్పత్తులు, కేబుల్స్, వైర్ల తయారీ, మార్కెటింగ్, పంపిణీ వ్యాపారంలోకి ప్రవేశించింది. ఈ నేపథ్యంలో కెఇఐ ఇండస్ట్రీస్ షేర్లు ఇంట్రాడేలో 14.55 శాతానికిపైగా పతనమయ్యాయి. ఎన్ఎస్ఇలో కంపెనీ షేరు విలువ ఒక్కరోజే రూ.461మేరపడిపోయి రూ.2,802 వద్ద కనిష్టానికిచేరింది. పాలీక్యాబ్ షేర్లు 9.58 శాతం పతనమై రూ.4,920 వద్ద ట్రేడయ్యాయి. హ్యావెల్స్ ఇండియా 5.5శాతం, ఫినోలెక్స్ కేబుల్స్ 4.7శాతం చొప్పున నష్టపోయాయి. వైర్లు, కేబుళ్ల విభాగంలోకి అడుగుపెడుతున్నట్లు అల్ట్రాటెక్ సిమెంట్ ప్రకటించిన నెల వ్యవధిలో అదానీ నుంచి ఈ ప్రకటన రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. అల్ట్రాటెక్ ఎంట్రీ ఇస్తున్నట్లు ప్రకటించిన సమయంలోనూ కేబుళ్లు, వైర్ల తయారీలో ఉన్న ప్రధాన కంపెనీల షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఆ నష్టాల నుంచి బయటపడేలోపే తాజా ప్రకటన నేపథ్యంలో మరోసారి కుంగాయి.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.